# భారత శక్తి®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 135 | హైదరాబాద్ | శనివారం 15-11-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

జానపద గాయకురాలి నుంచి ఎమ్మెల్యేగా.. అతిచిన్న వయస్సులో అలీ నగర్ నుంచి గెలిచిన మైథిలీ ఠాకూర్

## నేటి భారతం

- వృద్ధాప్యం శాపం కాదు.. అది ఎన్నో జ్ఞాపకాలను మోస్తున్న అంతులేని నిధి..
- అవ్యాజమైన అనుభవాలను మనకోసం పంచుతుంది..
- వారిని జాగ్రత్తగా చూసుకోవడం మన బాధ్యత..
- కడుపున పుట్టిన బిడ్డలు.. సేవలు చేయించుకున్న ప్రభుత్వం..
- సమాజం కూడా వారిని నీచంగా చూస్తోంది..
- వారి గుర్తించవలసింది ఏమిటంటే.. భవిష్యత్తులో వీరందరూ వారి దగ్గరకు చేరవలసిందే..
- అప్పుడు వారు ఎదురుకుంటున్న సమస్యలన్నీ.. మీరూ ఎదుర్కోవాల్సి వస్తుంది..
- కనుక యదార్థాలు గమనించి మనుషులుగా ప్రవర్తించండి..

## కేసీఆర్ గురించి
# అందుకే మాట్లాడను

### జూబ్లీహిల్స్ ఫలితంపై రేవంత్ రెడ్డి స్పందన



- ఈ గెలుపు తమ బాధ్యతను మరింతగా పెంచిందన్న రేవంత్ రెడ్డి
- కేసీఆర్ రాజకీయాల్లో క్రియాశీలకంగా లేనందువల్ల ఆయన గురించి మాట్లాడబోనన్న రేవంత్
- కేటీఆర్‌కు అహంకారం పోలేదని, హరీశ్ రావు అసహనం తగ్గించుకోవాలని సూచన

11లో



11లో

## జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ఓటమిపై స్పందించిన కేటీఆర్


- ప్రతిపక్ష పాత్ర పోషిస్తూనే ఉంటామన్న కేటీఆర్
- కార్యకర్తలు, మాగంటి సునీత ఎంతో కష్టపడ్డారన్న కేటీఆర్
- ఉప ఎన్నిక ఎలా జరిగిందో అందరికీ తెలుసని వ్యాఖ్య

## బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో
# సత్తా చాటిన మజ్లిస్ పార్టీ

### కొచ్చధామన్ సీటు గెలుపు

- ముస్లిం జనాభా అధికంగా ఉండే సీమాంచల్ ప్రాంతంలో పలు స్థానాల్లో మజ్లిస్ ఆధిక్యం
- కొచ్చధామన్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ అభ్యర్థి ఎండీ సర్వార్ ఆలమ్ గెలుపు
- సమీప ఆర్జేడీ అభ్యర్థి ముజాహిద్ ఆలమ్‌పై 23,021 ఓట్ల మెజార్టీ

11లో






11లో

## "కర్మ హిట్స్ బ్యాక్"..

### జూబ్లీహిల్స్ ఫలితాల నేపథ్యంలో కవిత ఆసక్తికర ట్వీట్

- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపు
- 24 వేల ఓట్లతో ఓడిపోయిన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి
- ఈ తరుణంలో చర్చనీయాంశంగా మారిన కవిత ట్వీట్

## జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్
# ఘన విజయం..

### మాగంటి సునీతపై నవీన్ యాదవ్ జయకేతనం

- 24,729 ఓట్ల మెజార్టీతో నవీన్ యాదవ్ ఘన విజయం
- తొలి రౌండ్ నుంచి చివరి రౌండ్ వరకు కాంగ్రెస్ ఆధిపత్యం
- ఈసీ నుంచి వెలువడిన అధికారిక ప్రకటన

11లో






## అభివృద్ధికి
# మార్గాలు ఇవే

11లో

- విశాఖపట్నంలో 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు
- అభివృద్ధికి పెట్టుబడులు, ఆవిష్కరణలే కీలకమన్న సీఎం చంద్రబాబు
- పరిశ్రమల ఏర్పాటుకు 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్
- ప్రకృతి వ్యవసాయం, ఆక్వా రంగాల్లో ఏపీకి అగ్రస్థానం
- గ్లోబల్ బ్రాండ్‌గా గుర్తింపు పొందిన అరకు కాఫీ
- కేంద్రంలో సుస్థిర ప్రభుత్వం పెట్టుబడులకు అనుకూలం అని వెల్లడి

## అంతంలేని ప్రభుత్వ
# పెన్షనర్ల వ్యథలు




జీవితమంతా కష్టపడి పనిచేసి, కుటుంబాన్ని నిలబెట్టి, సమాజానికి సేవ చేసిన వ్యక్తి పెన్షనర్.. అయితే వీరి వయస్సు పెరిగే కొద్ది అవసరాలు పెరుగుతాయి, ఆదాయం మాత్రం ఒకేఒక్క పింఛను మీదే ఆధారపడుతుంది.కానీ ఈ రోజుల్లో పెన్షనర్ల జీవితం సుఖంగా ఉందా? అంటే జవాబు లేదు.. వీరికి ప్రభుత్వాలు ఎంత వరకూ తోడుగా ఉన్నాయి? వారికి కావాల్సిన భద్రత, గౌరవం అందుతోందా? ఇవన్నీ కూడా జవాబులేని ప్రశ్నలుగానే మిగిలిపోయాయి.. ప్రభుత్వ ఉద్యోగులుగా విధులు నిర్వహించి, తీరా పదవీ విరమణ చేసిన తరువాత తమకు రావాల్సిన వాటికోసం అదే ప్రభుత్వ ఉద్యోగులకు లంచం ఇవ్వాల్సి రావడం దురదృష్టం.. ఈ విషయంపై ప్రభుత్వం, అధికారులు కల్పించుకుని పెన్షనర్ల సమస్యలపై సత్వరం స్పందించాలని " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " డిమాండ్ చేస్తోంది..

12లో

భారత శక్తి


# మోడీకి తిరుగులేదు

బీహార్ ఎన్నికలలో బీజేపీ కూటమి అధికారం దిశగా పయనిస్తుంది. నిజంగా అనేక రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీహార్ విజయం బీజేపీ కూటమికి ఇది మంచి బూస్ట్ ఇచ్చినట్లే. త్వరలోనే ఉత్తర్ ప్రదేశ్, పశ్చిమ బెంగాల్, తమిళనాడు రాష్ట్రాల్లో ఎన్నికలు జరగనున్నాయి. ఈ మూడు రాష్ట్రాల్లోనూ పాజిటివ్ వేవ్ తో వెళ్లాలంటే బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ అలయన్స్ గెలవడం ముఖ్యం. అది సాధించినట్లయింది. ఏకపక్షంగా బీహార్ ఓటర్లు బీజేపీ కూటమికి పట్టం కట్టారు. అందుకే 243 అసెంబ్లీ నియోజకవర్గాలున్న బీహార్ అసెంబ్లీలో దాదాపు రెండు వందల అసెంబ్లీ స్థానాలకు దగ్గరగా బీజేపీ కూటమి వెళ్లడం అంటే వన్ సైడ్ అనే చెప్పాలి. అందుకే ఇది వన్ సైడ్ వార్ అని స్పష్టంగా చెప్పాలి. నిజానికి బీహార్ లో మోదీ, నితీష్ కుమార్ అంటే నమో కాంబినేషన్ బాగా వర్క్ అవుట్ అయింది. ఎన్డీఏ కూటమి ఇచ్చిన హామీలు కూడా బాగా పనిచేశాయి. నితీష్ కుమార్ కు ముఖ్యంగా మహిళల ఓట్లు అనుకూలంగా ఏకపక్షంగా పడినట్లు కనిపిస్తుంది. నితీష్ కుమార్ ప్రభుత్వం మద్యపాన నిషేధం అమలు చేయడంతో అనేక కుటుంబాలు ఆనందంగా ఉన్నాయి. అలాగే ఎన్నికల నోటిఫికేషన్ కు ముందు నితీష్ కుమార్ పది వేల రూపాయలు మహిళల ఖాతాల్లో జమ చేయడం కూడా కూటమికి కలిసి వచ్చింది. సీమాంచల్ లో ఆర్జేడీకి పట్టుంది. అలాంటి ప్రాంతంలోనూ బీజేపీ, జేడీయూలు గెలవడమంటే ప్రజలు ఇక ఎన్డీఏ కూటమికి తిరుగులేని విజయాన్ని అందించడానికి సిద్ధమయినట్లు కనిపించింది. ఇక ఎన్డీఏ కూటమి తొలి నుంచి ఒక పద్ధతి ప్రకారం వెళుతుంది. సీట్ల సర్దుబాటులోనూ ఎలాంటి అలకలు, ఇబ్బందులు లేకుండా చూసుకోగలిగింది. ముఖ్యమంత్రి అభ్యర్థిగా నితీష్ కుమార్ ను ప్రకటించింది. అదే సమయంలో అన్ని సామాజికవర్గాల నేతలను దగ్గరకు తీసుకుని ఓటర్లకు దగ్గరయ్యే ప్రయత్నం ఎన్డీఏ కూటమి చేసింది. ఇక పోల్ మేనేజ్ మెంట్ విషయంలో కానీ, ప్రచారంలో కానీ బీజేపీ కూటమి మహా ఘట్ బంధన్ కంటే ముందంజలో ఉంది. ఆర్జేడీ వస్తే అవినీతి హెచ్చుమీరిపోతుందన్న బీజేపీ అందులోనూ మోదీ పదే పదే చేసిన ప్రచారం ప్రజల్లోకి చొచ్చుకు వెళ్లింది. అన్నీ కలిసి బీజేపీ కూటమిని కలసి వచ్చినట్లే కనిపిస్తుంది. ఇక మోదీకి తిరుగులేదు. వరసగా ఒక్కొక్క రాష్ట్రంలో కాంగ్రెస్ ను దానికి మద్దతిచ్చే పార్టీలను ఖతం చేస్తూ పోతుంది, బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ కూటమి అధికారం చేజిక్కించుకుంది. అయితే మహాకూటమికి ఈ ఎన్నికల్లో పెద్ద ఎదురుదెబ్బ తగిలింది. ఈ ఎన్నికల్లో బీజేపీ అతిపెద్ద పార్టీగా అవతరించే అవకాశం ఉంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు జాతీయ పార్టీలకు, ముఖ్యంగా ప్రాంతీయ పార్టీలకు కొన్ని ముఖ్యమైన పాఠాలు నేర్పించాయి. భవిష్యత్తులో వీటిని విస్మరిస్తే ఏ పార్టీకైనా నష్టం వాటిల్లే అవకాశం ఉందని, ఇప్పుడు బిహార్‌లో మహాకూటమికి ఎదురైన పరిస్థితే వారికి రానుంది. ఓటర్లు ఇకపై పెద్ద, ఆకర్షణీయమైన నినాదాలకు ఓటు వేయరని రాజకీయ పార్టీలు అర్థం చేసుకోవాలి. వారికి వాస్తవికమైన, అమలు చేయగలిగే వాగ్దానాలు కావాలి. నేతల నుంచి విశ్వసనీయత కోరుకుంటున్నారు. మహాకూటమి నాయకుడు తేజస్వి యాదవ్ 'ప్రతి ఇంటికి ప్రభుత్వ ఉద్యోగం', 'మహిళలకు సంవత్సరానికి 30 వేల రూపాయలు' ఇస్తానని చేసిన వాగ్దానం అమలుకాదని రాష్ట్ర ఓటర్లు గుర్తించారు. ఈ వాగ్దానాలు అమలు సాధ్యం కానివి. ఈ వాగ్దానాలకు అయ్యే ఖర్చు బిహార్ బడ్జెట్‌తో సమానమని ప్రజలు గుర్తించారు. రాజకీయ పార్టీలు రాజ్యాంగబద్ధమైన, ఎన్నికలు నిర్వహించే సంస్థ అయిన ఈసీపై పదేపదే ప్రశ్నలు సంధించకూడదు. ఎన్నికల ప్రక్రియపై ఆరోపణలు చేయడం ప్రజలలో నమ్మకాన్ని పెంచడానికి బదులుగా ప్రతికూలతను కలిగిస్తుంది. మహాకూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రజల సమస్యలపై దృష్టిపెట్టడానికి బదులుగా ఈసీపై ఆరోపణలు చేశారు. కనుక విద్య, ఆరోగ్యం, ఉపాధి, మౌలిక సదుపాయాలు వంటి ప్రజా ప్రయోజన సమస్యలపై దృష్టి సారించే పార్టీలకు ప్రాధాన్యత ఇస్తామని బిహార్ ప్రజలు స్పష్టం చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలను ఆకట్టుకునే పెద్ద ప్రకటనలు లేదా ఎన్నికల బహుమతులు (ఉచిత సౌకర్యాలు) ప్రకటించడం ఓట్లు రాబట్టేందుకు దోహదం చేస్తాయని నిరూపించాయి. ఈ ప్రకటనలు తరచుగా మధ్యతరగతి, దిగువ మధ్యతరగతి ప్రజలకు, దారిద్ర్య రేఖకు దిగువన ఉన్న వారికి ఉపశమనం కలిగిస్తాయి. దాంతో ఓటర్లు ఆ పార్టీ వైపు మొగ్గు చూపుతారు. ఇది దీర్ఘకాలిక అభివృద్ధికి సరైనది కాకపోయినా, తమకు ఎంతో కొంత మేలు జరుగుతుందని ప్రజలు భావించడంతో ప్రయోజనం పొందవచ్చు. బిహార్ ఎన్నికలు, అంతకుముందు జరిగిన ఎన్నికలలో ఒక ముఖ్యమైన సామాజిక మార్పు కనిపిస్తోంది. మహిళలు ఇప్పుడు పెద్ద సంఖ్యలో ఓట్లు వేస్తున్నారు. ఈ ఎన్నికల్లో ఇది ఒక నిర్ణయాత్మకమైన సైలెంట్ ఓటింగ్ గా మారింది. ఈ ఎన్నికల్లో దాదాపు 71 శాతం మంది మహిళలు ఓటు హక్కును వినియోగించుకున్నారు. దాంతో రాజకీయ పార్టీలు మహిళల భద్రత, సాధికారత, మహిళల సమస్యలపై ఫోకస్ చేయాలి. మహిళల ప్రయోజనాలను కాపాడటంలో ఎవరు ముందుంటారో, ఆ పార్టీ విజయం సాధిస్తుంది. వారికి గొప్ప విజయం లభిస్తుంది. బిహార్ ఓటర్లు రాష్ట్రంలో, కేంద్రంలో ఒకే రాజకీయ పార్టీ లేదా కూటమి ప్రభుత్వం కావాలని కోరుకుంటున్నారు. రాష్ట్రంలో, కేంద్రంలో వేర్వేరు పార్టీల ప్రభుత్వాలు ఉంటే వివాదాస్పద పరిస్థితులు ఏర్పడతాయి. రాష్ట్ర అభివృద్ధి పనులకు అవాంఛిత అడ్డంకులు ఏర్పడతాయని ప్రజలు భావించారు. అంటే డబుల్ ఇంజిన్ సర్కార్ పాలసీకి మొగ్గు చూపారు. అప్పుడే రాష్ట్రానికి నిధులు వచ్చి, స్థిరంగా పాలన సాగుతుందని చూపించారు.

# మారనున్న కాకినాడ దిశ

కాకినాడ, నవంబర్ 14, (న

కాకినాడ జిల్లాలో ఏఎం గ్రీన్ సంస్థ భారీ పెట్టుబడులు పెట్టనుంది. ఉప్పాడ సమీపంలో రూ.44 వేల కోట్లతో గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ ఏర్పాటు కానుంది. ఇది పర్యావరణ హితంగా, పునరుత్పాదక ఇంధనంతో నడుస్తుంది. ఈ ప్రాజెక్టుతో 3 వేల మందికి ఉపాధి లభించనుంది. ప్రభుత్వం భూమి, విద్యుత్, నీటి సరఫరాలో రాయితీలు మంజూరు చేసింది. పరిశ్రమకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఆంధ్రప్రదేశ్‌కు పెట్టుబడులు కొనసాగుతున్నాయి.. ఆయా జిల్లాల వారీగా పరిశ్రమలు క్యూ కడుతున్నాయి. తాజాగా కాకినాడ జిల్లాలో ఏఎం గ్రీన్ సంస్థకు చెందిన ఏఎంజీ మెటల్ అండ్ మెటీరియల్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఏర్పాటు చేయబోతోంది. ఈ కొత్త పరిశ్రమ ఉప్పాడకు సమీపంలో రాబోతోంది. గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమను సుమారు వెయ్యి ఎకరాల విస్తీర్ణంలో ఏర్పాటు చేస్తారు. దీని కోసం రూ.44 వేల కోట్లు ఖర్చు చేయనున్నారు. ఇది గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ. అల్యూమినియంను తయారుచేసే ఈ పరిశ్రమ పర్యావరణానికి హాని కలిగించకుండా ఉండేలా రూపొందిస్తున్నారు. ఈ పరిశ్రమ ఏర్పాటుకు అవసరమైన భూములను కొనుగోలు చేయడానికి, మౌలిక సదుపాయాలు కల్పించడానికి ప్రభుత్వం రాయితీలు మంజూరు చేసింది. ఈ విషయమై ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ పరిశ్రమ రెండు దశల్లో పూర్తికానుంది.. ఈ పరిశ్రమ ద్వారా 3 వేల మందికి ఉపాధి అవకాశాలు లభించనున్నాయి. ఏఎం గ్రీన్ కంపెనీ, నెదర్లాండ్స్‌కు చెందిన ఏఎంజీ మెటల్ భాగస్వామ్యంతో, రూ.10,050 కోట్ల పెట్టుబడితో గ్రీన్ అమ్మోనియా, గ్రీన్ అల్యూమినియం తయారీ పరిశ్రమలను ఏర్పాటు చేయనుంది. ఏఎం గ్రీన్ కంపెనీ ఏడాదికి రెండు మిలియన్ టన్నుల గ్రీన్ అమ్మోనియాను ఉత్పత్తి చేయనుంది. ఈ ప్రాజెక్టుకు ఇటీవల రాయితీలు కూడా మంజూరు అయ్యాయి. గ్రీన్ అమ్మోనియా అంటే పర్యావరణానికి హాని చేయని పద్ధతుల్లో తయారుచేసే అమ్మోనియా. ఇక ఏఎంజీ మెటల్, నెదర్లాండ్స్ కంపెనీ భాగస్వామ్యంతో ఏడాదికి ఒక మిలియన్ టన్నుల గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేయనున్నారు. ఈ పరిశ్రమ పూర్తిగా పునరుత్పాదక ఇంధన వనరులైన సౌర, పవన విద్యుత్‌తోనే నడుస్తుంది. దీనివల్ల పర్యావరణానికి హాని కలిగే అవకాశం లేదని తెలుస్తోంది. ఈ పరిశ్రమల ఏర్పాటు కోసం ఏఎం గ్రీన్ కంపెనీ




ఇప్పటికే నేమాం వద్ద మూతపడిన స్పెక్ట్రం పవర్ జనరేషన్ కంపెనీకి చెందిన సుమారు 800 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఇప్పుడు అందులోనే ఈ కొత్త పరిశ్రమలను ఏర్పాటు చేయాలని యోచిస్తోంది. ఈ ప్రాజెక్టుల విస్తరణకు అదనంగా మరో 250 ఎకరాల భూమి అవసరమని భావించి, దాని కోసం ప్రభుత్వాన్ని కోరింది. గ్రీన్ అల్యూమినియం స్మెల్టర్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రభుత్వం 250 ఎకరాల భూమిని మార్కెట్ ధరకు అందిస్తోంది. గ్రీన్ కారిడార్ ద్వారా 2000–2,500 మెగావాట్ల విద్యుత్ కనెక్షన్, రోజుకు 1.75 కోట్ల లీటర్ల నీటిని సరఫరా చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని సంబంధిత శాఖలు సింగిల్ డెస్క్ విధానంలో అనుమతులు మంజూరు చేయాలి. అలాగే ఈ పరిశ్రమకు విద్యుత్ డ్యూటీ, మూలధన పెట్టుబడిపై రాయితీలు ఇవ్వాలి. నీటి సరఫరా ఛార్జీలను తగ్గించాలి. స్టాంపు డ్యూటీ నుంచి మినహాయింపుతో పాటు ఇతర ప్రోత్సాహకాలను కూడా అందించాల్సి ఉంటుంది.

# పాత జిల్లాల్లోనే కలపడం, మండలాల్లో మార్పులపై ఫోకస్

ఒంగోలు, నవంబర్ 14,

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జిల్లాల పునర్వ్యవస్థీకరణపై దృష్టి సారించింది. అద్దంకి నియోజకవర్గాన్ని బాపట్ల జిల్లా నుంచి వేరు చేసి, తిరిగి ప్రకాశం జిల్లాలో కలపడానికి కసరత్తు మొదలైంది. మార్కాపురం జిల్లా ఏర్పాటు, కందుకూరును ప్రకాశంలో కలపడం వంటి అంశాలపై కూడా ప్రభుత్వ యంత్రాంగం చురుగ్గా పనిచేస్తోంది. ప్రజల విజ్ఞప్తులకు అనుగుణంగా ఈ మార్పులు దిశగా అడుగులుపడుతున్నాయి. త్వరలోనే దీనిపై పూర్తిస్థాయిలో క్లారిటీ రానుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, ఆయా నియోజకవర్గాలను మళ్లీ పాత జిల్లాల్లోనే కలపడం, మండలాల్లో మార్పులపై ఫోకస్ పెట్టింది. ఇప్పటికే మంత్రులుతో కమిటీని కూడా ఏర్పాటు చేశారు. తాజాగా ఓ కొత్త జిల్లా ఏర్పాటుతో పాటుగా రెండు నియోజకవర్గాలను మళ్లీ పాత జిల్లాలోకే కలిపే దిశగా అడుగులు పడుతున్నాయి. ఏపీ విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ ప్రాతినిధ్యం వహిస్తున్న అద్దంకి నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో చేర్చే ప్రక్రియ మొదలైంది. బాపట్ల జిల్లా నుంచి అద్దంకిని వేరు చేసి ప్రకాశంలో కలపడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని సీసీఎల్ఏ జయలక్ష్మి, కలెక్టర్ వినోద్‌కుమార్‌ను ఆదేశించారు. అమరావతి నుంచి సీసీఎల్ఏ జయలక్ష్మి, కార్యదర్శి వెంకటమురళి కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అద్దంకి ప్రాంత సరిహద్దులను స్పష్టంగా నిర్ణయించి, సమగ్ర నివేదికను రెండు రోజుల్లో పంపాలని బాపట్ల కలెక్టర్‌కు సూచనలు అందాయి. ప్రస్తుతం బాపట్ల జిల్లా సరిహద్దులు, అద్దంకిని వేరు చేసే అంశంపై సాధ్యాసాధ్యాలను వివరిస్తూ నివేదికను సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ మేరకు రెండు రోజుల్లో సమగ్ర నివేదికను బాపట్ల కలెక్టర్ సమర్పించాలని సూచించారు. గత ప్రభుత్వ హయాంలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగింది. 2022 ఏప్రిల్ 4న ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాలను.. అలాగే ఉమ్మడి గుంటూరు జిల్లాలోని వేమూరు, రేపల్లె, బాపట్ల నియోజవర్గాలను కలిపి బాపట్ల జిల్లాగా ఏర్పాటు చేశారు. బాపట్ల లోక్‌సభ స్థానం పరిధిలో ఉన్న సంతనూతల పాడు నియోజకవర్గాన్ని మాత్రం ప్రకాశం జిల్లాలోనే కొనసాగించారు. అయితే అద్దంకి నియోజకవర్గంలో నారా లోకేశ్ యువగళం పాదయాత్ర జరిగిన సమయంలో ఆ ప్రాంత ప్రజలు తమ సమస్యను చెప్పుకున్నారు. జిల్లా కేంద్రం బాపట్ల తమకు 70 కి.మీ. దూరంలో ఉందని.. అద్దంకి నుంచి బాపట్ల వెళ్లాలంటే ఇబ్బందిగా ఉందన్నారు. అద్దంకిని మళ్లీ ప్రకాశం జిల్లాలో కలపాలని కోరారు. తమకు ప్రకాశం జిల్లా కేంద్రం ఒంగోలు దగ్గరగా ఉంటుందన్నారు. అద్దంకి నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్ కూడా ఈ అంశంపై హామీ ఇచ్చారు.. ఇప్పుడు ఆ దిశగా అడుగులు పడుతున్నాయి. మరోవైపు మార్కాపురం జిల్లా ఏర్పాటుకు సంబంధించి ప్రకాశం కలెక్టర్ రాజాబాబుకు.. అలాగే కందుకూరు, అద్దంకి నియోజకవర్గాలను తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపేందుకు అవసరమైన నివేదికను ఇవ్వాలని నెల్లూరు, బాపట్ల కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. కలెక్టర్లు, జేసీలు, ఇతర ముఖ్య రెవెన్యూ అధికారులతో సీసీఎల్ఏ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ విషయమై స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. మార్కాపురం జిల్లా ఏర్పాటు అంశంపై కూడా కూటమి హామీ ఇచ్చింది. ఈ మేరకు ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు. అలాగే కందుకూరును కూడా ప్రకాశం జిల్లాలోనే కొనసాగించాలని.. యువగళం పాదయాత్ర సందర్భంగా జిల్లాకు వచ్చిన ప్రస్తుత మంత్రి నారా లోకేష్ ను స్థానిక ప్రజలు కోరారు. అందుకే కందుకూరును తిరిగి ప్రకాశం జిల్లాలో కలిపే కసరత్తు జరుగుతోంది. మార్కాపురం జిల్లా ఏర్పాటు విషయానికి వస్తే.. మార్కాపురంతో పాటుగా గిద్దలూరు, కనిగిరి, దర్శి, యర్రగొండపాలెం అసెంబ్లీ నియోజకవర్గాలను కలిపి కొత్త జిల్లాగా ఏర్పాటు చేయాలని డిమాండ్ ఉంది. ఈ మేరకు కొత్త జిల్లాకు సంబంధించి.. ప్రభుత్వ భూములు, అటవీశాఖ భూములు, నియోజకవర్గాలు, మండలాలు, గ్రామాల వారీ, భూపరమైన హద్దులను తెలిపే నివేదికలను పంపాలని ఆదేశించారట. కలెక్టర్లను రెండు, మూడు రోజుల్లోనే నివేదికలు ఇవ్వాలని ఉన్నతాధికారులు ఆదేశించారట. మొత్తం మీద ఉమ్మడి ప్రకాశం జిల్లాకు సంబంధించి మార్పులపై కసరత్తు జరుగుతోంది.

## పెద్దపులి సంచారం కలకలం

ఒంగోలు, నవంబర్ 14,

ప్రకాశం జిల్లా డోర్నాల మండల ప్రజలను పెద్దపులి సంచారం కలకలం రేపుతోంది. గండి చెరువు వద్దకు మేతకు వెళ్లిన రెండు ఆవులను పులి చంపేసిందని స్థానికులు చెప్తున్నారు. దీంతో భయంతో వణికిపోతున్నారు. గతంలోనూ ఈ ప్రాంతంలో పెద్దపులి కదలికలు నమోదయ్యాయి. స్థానికుల సమాచారంతో అటవీ శాఖ అధికారులు అక్కడకు చేరుకున్నారు. పరిస్థితిని సమీక్షించిన అధికారులు.. అప్రమత్తంగా ఉండాలని స్థానికులకు సూచించారు. ప్రకాశం జిల్లాలో మరోసారి పెద్దపులి సంచారం కలకలం రేపింది. డోర్నాల మండలం బొమ్మలాపురం గ్రామంలో పెద్దపులి తిరుగుతోందన్న వార్తలు స్థానికులను భయపెడుతున్నాయి. గండిచెరువు సమీపంలో మేతకు వెళ్లిన రెండు ఆవులపై దాడి చేసి చంపేయటంతో స్థానికులు మరింత వణికిపోతున్నారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో ఘటనా స్థలికి చేరుకున్న అటవీ శాఖ అధికారులు.. అక్కడి పరిస్థితిని పరిశీలించారు. పెద్దపులి సంచారం నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. మరోవైపు ఈ ప్రాంతంలో గతంలోనూ పెద్దపులి సంచరం కలకలం రేపింది. అయితే అటవీ ప్రాంతం కావటంతో ఇక్కడ పులులు సంచరిస్తూ ఉంటాయని అధికారులు చెప్తున్నారు. మరోవైపు ఏపీ విషయానికి వస్తే పులుల సంచారం ఎక్కువగా నాగార్జునసాగర్-శ్రీశైలం టైగర్ రిజర్వ్ ప్రాంతంతో పాటుగా, పాపికొండలు వంటి అటవీ ప్రాంతాలలో ఉంది. అలాగే నల్లమల అటవీ ప్రాంతంతో పాటుగా, పల్నాడు, నంద్యాల, కాకినాడ, తూర్పు గోదావరి, అనంతపురం జిల్లాలలో పులుల సంచారం వార్తలు అప్పుడప్పుడూ వస్తూ ఉంటాయి. అలాగే పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అప్పుడప్పుడూ పులులు ఆంధ్రప్రదేశ్‌లోని అటవీ ప్రాంతాలకు వలస వస్తుంటాయి. పులుల సంచారం వార్తలు వచ్చినప్పుడు స్థానికులు భయాందోళనకు గురవుతూ ఉంటారు. ఈ నేపథ్యంలో పులుల సంచారం, తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఎలా వ్యవహరించాలనే దానిపై అటవీ శాఖ అధికారులు వారికి అవగాహన కల్పిస్తుంటారు.

# తెరుచుకున్న డాక్‌యార్డ్ బ్రిడ్జి

విశాఖపట్టణం, నవంబర్ 14,

విశాఖపట్నం ఇండస్ట్రియల్ ఏరియా వాసులకు శుభవార్త. 15 నెలల తర్వాత డాక్‌యార్డ్ బ్రిడ్జి తెరుచుకుంది. భారీ వాహనాలు మినహా అన్ని వాహనాలకు అనుమతి లభించింది. దీనితో ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించే ఇబ్బందులు తొలగిపోయాయి. రూ.30 కోట్లతో నిర్మించిన ఈ వంతెన, సముద్రంపై 330 మీటర్ల పొడవుతో, ప్రత్యేక పెయింట్లతో సురక్షితంగా ఉంది. ఇటీవల బ్రిడ్జిపై ట్రయల్ రన్ కూడా నిర్వహించారు.. అనంతరం వాహనాలను అనుమతిస్తున్నారు. విశాఖపట్నంలో ఇండస్ట్రియల్ ఏరియా వాసులకు శుభవార్త. వంతెన నిర్మాణం కారణంగా 15 నెలలుగా మూసివేసిన మార్గం ఇవాళ తెరుచుకుంది. డాక్‌యార్డ్ బ్రిడ్జిపై పోర్టు అధికారులు అన్ని రకాల వాహనాలకు (భారీ వాహనాలు మినహా) అనుమతి ఇచ్చారు. ఈ వంతెన మూసివేత వల్ల పారిశ్రామిక ప్రాంతాల్లోని ప్రజలు ఎన్నో ఇబ్బందులు పడ్డారు. ప్రత్యామ్నాయ మార్గాల్లో ప్రయాణించాల్సి రావడం వల్ల సమయం, డబ్బు వృథా అయ్యేవి. ఇప్పుడు రహదారి తెరుచుకోవడంతో ఈ సమస్యలు తొలగిపోనున్నాయి. అయితే భారీ వాహనాలకు మాత్రం అనుమతి లేదు. మిగిలిన అన్ని రకాల వాహనాలు ఈ మార్గాన్ని ఉపయోగించుకోవచ్చు. ఈ నిర్ణయం వల్ల స్థానిక ప్రజల ప్రయాణం సులభతరం అవుతుంది. సుమారు 15 నెలల పాటు ఈ రోడ్డు మూసివేయగా.. వంతెన నిర్మాణ పనులు పూర్తవడంతోనే దీనిని తిరిగి ప్రారంభించారు. నేవల్ డాక్‌యార్డ్ వంతెనపై మంగళవారం రాత్రి 9.30 గంటల నుంచి ద్విచక్ర వాహనాలు, కార్ల రాకపోకలను ప్రయోగాత్మకంగా అనుమతించారు. ఈ వంతెన మరమ్మతుల కారణంగా గత ఏడాది ఆగస్టు 1 నుంచి వాహనాల రాకపోకలను పూర్తిగా నిలిపివేశారు. ఇది గాజువాక, సింధియా, పారిశ్రామిక ప్రాంతాలతో పాటు నగరానికి అనుసంధానమయ్యే ముఖ్యమైన మార్గం. ప్రతిరోజూ వేలాది వాహనాలు ఈ వంతెనపై రాకపోకలు సాగిస్తాయి. వంతెన ప్రారంభోత్సవం పలుమార్లు వాయిదా పడుతూ వచ్చింది. ఎట్టకేలకు ప్రారంభమైంది.

ఈ బ్రిడ్జిని పనుల్ని విశాఖపట్నం పశ్చిమం ఎమ్మెల్యే గణబాబు పరిశీలించారు.. ఈ క్రమంలో బ్రిడ్జిపై లోడ్ టెస్ట్ ప్రక్రియను మూడు రోజుల పాటూ నిర్వహించారు. అనంతరం పెయింటింగ్ పనులు పూర్తి చేసి మంగళవారం రాత్రి ట్రయల్ రన్ నిర్వహించి బుధవారం అందుబాటులోకి తెచ్చారు. నేటి నుంచి పూర్తిస్థాయిలో ప్రయాణాలకు అనుమతిస్తున్నారు. ఆగస్టు 1, 2024న వంతెనను మూసివేశారు. ఈ వంతెన నిర్మాణం కోసం ఆగస్టు 1, 2024 నుంచి పనులు మొదలయ్యాయి. తొమ్మిది నెలల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నా, అనుకోని అడ్డంకుల వల్ల ఆలస్యం జరిగింది. ఈ ప్రాజెక్టుకు రూ.30 కోట్ల ఖర్చు అయింది. గుజరాత్‌కు చెందిన హార్డ్‌వేర్ టూల్స్ అండ్ మిషనరీ ప్రాజెక్ట్స్ అనే సంస్థ ఈ నిర్మాణాన్ని పూర్తి చేసింది. వంతెన ప్రారంభానికి ముందు, ఈ నెల 10, 11 తేదీలలో నిపుణులు వంతెనపై లోడింగ్ ట్రయల్ రన్ నిర్వహించారు. వంతెన పటిష్టంగా ఉందని నిర్ధారించుకున్నాకే, ప్రారంభానికి అనుమతి ఇచ్చారు. ఈ పరీక్షల ఫలితాల ఆధారంగా, పోర్టు అధికారులు బుధవారం వంతెనను ప్రజల వినియోగం కోసం తెరుస్తున్నట్లు అధికారికంగా తెలిపారు. సముద్రంపై నిర్మించిన వంతెన 330 మీటర్ల పొడవు, 10.5 మీటర్ల వెడల్పుతో ఉంది. ఈ వంతెన నిర్మాణంలో ఎలక్ట్రో మాగ్నిటెక్ బేరింగులను ఉపయోగించారు. ఇవి ఈ బ్రిడ్జి మరింత బలంగా, సురక్షితంగా ఉండేలా చేస్తాయి. ఈ బ్రిడ్జి సముద్రం పైన ఉండటం వల్ల, గాలిలో ఉండే ఉప్పు కణాల ప్రభావం వంతెన నిర్మాణ సామగ్రిపై పడకుండా జాగ్రత్తలు తీసుకున్నారు. అందుకే, విదేశాల నుంచి తెప్పించిన ప్రత్యేకమైన పెయింట్లను ఇనుముకు వేశారు. రాత్రి వేళల్లో వాహనాలు, ప్రజలు సులభంగా ప్రయాణించడానికి వీలుగా వంతెనపై 15 విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. దీంతో చీకటి పడినా రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది ఉండదు. అంతేకాకుండా, ప్రజలు నడుచుకుంటూ వెళ్లడానికి వీలుగా ప్రత్యేకంగా ఫుట్‌పాత్‌ను నిర్మించారు. ఈ ఫుట్‌పాత్ కిందనే విద్యుత్ కేబుల్స్ వేయడానికి అవసరమైన ట్రాక్‌లను కూడా సిద్ధం చేశారు. ఈ బ్రిడ్జి పై నుంచి ఇండస్ట్రియల్ ఏరియా ప్రజలు ఎస్ఆర్ కంపెనీ మీదుగా కాన్వెంట్ వంతెనకు వెళ్లొచ్చు. అయితే వాహనాలు తిరిగి వచ్చేటప్పుడు జ్ఞానాపురం దాటిన అనంతరం రామ్మూర్తిపంతులు పేట మీదుగా డాక్‌యార్డు క్వార్టర్స్ మార్గంలో బ్రిడ్జిపైకి వస్తారు. అక్కడి నుంచి ఇండస్ట్రియల్ ఏరియాకు చేరుకోవచ్చు. ఈ బ్రిడ్జి అందుబాటులోకి రావడంతో దాదాపు ఆరు కిలోమీటర్ల దూరం కూడా తగ్గనుంది.

===============

# అడ్డంగా బుక్కైన పెద్దిరెడ్డి...

తిరుపతి, నవంబర్ 14,

వైసీపీలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కీలకనేత. ఆయన ఒక రకంగా చెప్పాలంటే.. జగన్ తర్వాత ఆయన మాత్రమేనని అంటారంతా. ఎందుకంటే జగన్ కు అంతా తానే అయి వ్యవహరించేది కూడా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి మాత్రమేనంటారు. అలాంటి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబంపై ఎప్పటి నుంచో కూటమి ప్రభుత్వం ఒక కన్నేసి ఉంచింది. ఇదివరకే ఆంధ్రప్రదేశ్ లిక్కర్ స్కామ్ కేసులో పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి ని స్పెషల్ ఇన్విస్టిగేషన్ అధికారులు అరెస్ట్ చేశారు. దాదాపు 70 రోజులకు పైగానే రాజమండ్రి జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్న మిధున్ రెడ్డి తర్వాత బెయిల్ పై బయటకు వచ్చారు.



మొన్నటి ఎన్నికల్లో చిత్తూరు జిల్లాలో అందరూ ఓడిపోయినా పెద్దిరెడ్డి కుటుంబం మాత్రం ఓటమి చవి చూడలేదు. పుంగనూరు ఎమ్మెల్యేగా పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, తంబళ్లపల్లి ఎమ్మెల్యేగా ఆయన సోదరుడు పెద్దిరెడ్డి ద్వారకానాథ్ రెడ్డి, రాజంపేట పార్లమెంటు సభ్యుడిగా పెద్దిరెడ్డి మిధున్ రెడ్డి విజయం సాధించారు. చిత్తూరు జిల్లాలో ఈ రెండు మాత్రమే వైసీపీకి దక్కాయి. పార్లమెంటు నియోజకవర్గాల్లో వచ్చిన మూడు స్థానాల్లో ఒకటి కడప, మరొకటి అరకు, ఇంకొకటి రాజంపేట మాత్రమే. అలా పాతుకుపోయిన పెద్దిరెడ్డి కుటుంబాన్ని రాజకీయంగా వేళ్లతో సహా పెకిలించడానికి ప్రయత్నాలు మొదలయినట్లే కనిపిస్తుంది. అటవీ భూముల ఆక్రమణ విషయంలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అడ్డంగా బుక్కయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అటవీ భూముల చట్ట ప్రకారం శిక్షలు కూడా భారీగా పడే అవకాశాలుంటాయని న్యాయనిపుణులు చెబుతున్నారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డికి, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు మధ్య వైరం ఈ నాటిది కాదు. తిరుపతి ఎస్వీ యూనివర్సిటీలో ఇద్దరూ చదువుకునే రోజులలో తలెత్తిన వైరం నేటికీ రాజకీయంగా కొనసాగుతూనే ఉంది. ఈ నేపథ్యంలో పెద్దిరెడ్డి కుటుంబం అటవీ భూముల విషయంలో చిక్కుల్లో పడినట్లేనని అంటున్నారు. అందులోనూ ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖను పర్యవేక్షిస్తున్న పవన్ కల్యాణ్ బయటపెట్టిన వీడియోతో దాదాపు 74 ఎకరాల అటవీ భూములను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం ఆక్రమించుకుందన్న ఆరోపణలు వినిపిస్తున్న నేపథ్యంలో ఆయనకు కష్టాలు మొదలయినట్లేనని అంటున్నారు. అందుకోసమే పవన్ కల్యాణ్ ప్రత్యేకంగా చిత్తూరు జిల్లా పర్యటనకు వెళ్లినట్లు కూడా వైసీపీ నేతలు అనుమానిస్తున్నారు. హెలికాప్టర్ లో వెళ్లి వీడియోను చిత్రీకరించడం కూడా పెద్దిరెడ్డి కుటుంబాన్ని ఇరికించడానికేనన్న అభిప్రాయం వైసీపీ నేతల్లో వ్యక్తమవుతుంది. జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే పెద్దాయన పెద్దిరెడ్డి రెడీ అవ్వాల్సిందే అన్నట్లుంది పరిస్థితి.

# 13 కోట్ల రామప్ప ఐలాండ్ కు కొత్త సొబగులు

వరంగల్, నవంబర్ 14,

తెలంగాణ ప్రభుత్వం యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దీని కోసం సుమారు 62 కోట్ల రూపాయలు కేటాయించగా.. తాజాగా రాష్ట్ర ప్రభుత్వం కూడా రామప్ప కోసం భారీగా నిధులు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సాస్కీ పథకం ద్వారా.. ఇక్కడ సరస్సులో ఉన్న ఐలాండ్ సుందరీకరణకు ఏకంగా రూ.13 కోట్లు కేటాయిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.తెలంగాణ ప్రభుత్వం పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. రాష్ట్రంలో పర్యాటక ప్రాంతాలకు కొదవలేదు. అయితే గతంలో వాటిని పెద్దగా పట్టించుకోక అభివృద్ధికి ఆమడ దూరంలో ఆగిపోయాయి. ఈక్రమంలో తెలంగాణలో అధికారంలో ఉన్న రేవంత్ సర్కార్.. పర్యాటక రంగానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. అలానే తెలంగాణలోని కొన్ని పర్యాటక ప్రాంతాలు యునెస్కో గుర్తింపు పొందాయి. అలాంటి వాటి సుందరీకరణకు ప్రభుత్వం భారీగా నిధులు ఖర్చు చేసేందుకు ముందుకు వస్తోంది. దీనిలో భాగంగానే తాజాగా యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇప్పటికే కేంద్రం ప్రభుత్వం రామప్ప ఆలయ అభివృద్ధి కోసం భారీగా నిధులు కేటాయించగా.. ఇప్పుడు రాష్ట్ర ప్రభుత్వం కూడా రామప్ప కోసం పెద్ద మొత్తంలో నిధులు కేటాయించింది.యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప ఆలయ అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధిక ప్రాధాన్యతనిస్తున్నాయి. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం దీని కోసం భారీగా నిధులు కేటాయించింది. ప్రసాద్ పథకం కింద రూ.62 కోట్లతో ఇంటర్‌ప్రిటేషన్ సెంటర్ పనులు జరుగుతున్నాయి. ఇదిలా ఉండగా.. తాజాగా తెలంగాణ ప్రభుత్వం.. సాస్కీ పథకం ద్వారా రామప్ప సరస్సులోని దీవి సుందరీకరణ కోసం రూ.13 కోట్లు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. మంత్రి సీతక్క ఈ పనులను ప్రారంభించారు. వచ్చే సంవత్సరం అనగా 2026, మార్చి చివరి నాటికి దీవి సుందరీకరణ పనులు పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు. రామప్ప సరస్సు మధ్యలో ఏడు ఎకరాల విస్తీర్ణంలో ఈ దీవి విస్తరించి ఉంది. దీన్ని అభివృద్ధి చేసి.. పర్యాటకుల కోసం ఆకర్షణీయంగా తీర్చిదిద్దనున్నారు. బోటింగ్ పాయింట్ నుంచి సుమారు 2 కిలోమీటర్ల దూరంలో ఈ దీవి ఉంది. ఇక్కడకి పర్యాటకులను ఆకర్షించడం కోసం ఈ దీవిలో అనేక సౌకర్యాలు కల్పించనున్నారు.సుందరీకరణ పనుల్లో భాగంగా.. ఈ దీవిలో సుమారు 30 అడుగుల ఎత్తైన శివపార్వతుల విగ్రహాలు ఏర్పాటు చేయనున్నారు. అత్యాధునిక సదుపాయాలతో కూడిన రెస్టారెంట్, సీతాకోక చిలుకల గార్డెన్ కూడా నిర్మిస్తున్నారు. బోటింగ్ పాయింట్ నుంచి ఐలాండ్ వరకు నిర్మాణ సామగ్రిని తరలించడానికి ఆంధ్రప్రదేశ్ నుంచి రెండు ప్రత్యేక బోట్లు, లారీలను తెప్పించారు. ఈ దీవిలో పిల్లలు ఆడుకోవడానికి ఆట వస్తువులు, నీటిలో ఆడుకునేందుకు పరికరాలు, ఆహ్లాదకరమైన వాతావరణం కోసం పది పగోడాలు, పచ్చదనంతో కూడిన నడక మార్గాలు, విశ్రాంతి గదులు, క్యాంటీన్, తాగునీటి సదుపాయాలు కల్పించబోతున్నారు.

# ఎమ్మెల్యేల పంచాయితీలకు బాధ్యులెవరు

విజయవాడ, నవంబర్ 14

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇప్పుడు పదే పదే ఎమ్మెల్యేల పనితీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ కూడా ఎమ్మెల్యేలు సివిల్ తగాదాల్లో తలదూర్చడాన్ని తప్పుపడుతున్నారు. ఇలా కూటమిలోని ప్రధాన పార్టీలకు చెందిన పెద్దలే పార్టీ గాడి తప్పినట్లు ఒప్పుకున్నట్లయిందన్న కామెంట్స్ వినపడుతున్నాయి. అయితే పక్కదారి పడుతున్న ఎమ్మెల్యేలను సెట్ చేయడానికే చంద్రబాబు కానీ, పవన్ కల్యాణ్ కానీ ఈ వ్యాఖ్యలు చేస్తుండ వచ్చు. ఎమ్మెల్యేలపై ప్రజల్లో వ్యతిరేకత వస్తే ప్రభుత్వం ఎన్ని మంచి పనులు చేసినప్పటికీ ఎన్నికల్లో పనిచేయదు. ఖచ్చితంగా అది ప్రభుత్వంపైనే ప్రభావం చూపుతుంది. ఈ విషయం చంద్రబాబుకు తెలియంది కాదు. ఎమ్మెల్యేలు పనితీరు ఎంత ముఖ్యమో.. ప్రభుత్వంలో ఉన్న ముఖ్యుల పనితీరు కూడా అంతే ముఖ్యమన్నది మాత్రం గుర్తుంచుకోవాలి. ఇప్పటికే ఎన్నికలు జరిగి రెండేళ్లు దాటి పోయింది. ఇప్పుడు కూడా ప్రతిదీ గత ప్రభుత్వంపై నెపాన్ని మోపి కాలం గడిపేద్దామంటే కుదరని పని. అదే సమయంలో మంచి పనులు అంటే.. ఏంటి? వంద మందిలో పది మందికి మంచి జరిగితే తొంభయి మందికి అది వ్యతిరేకమవుతుంది. గత వైసీపీ ప్రభుత్వం కూడా సంక్షేమాన్ని విస్తృతంగా చేసినా పదకొండు సీట్లకే పరిమితమవ్వడానికి ప్రధాన కారణం మెజారిటీ ప్రజలకు ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రయోజనాలు దక్కకపోవడంతో పాటు సమస్యలు పరిష్కారం కాకుండా ఉండటమేనన్నది వేరే చెప్పాల్సిన పనిలేదు.. తాము సంక్షేమాన్ని, అభివృద్ధిని సమపాళ్లలో తీసుకెళుతున్నామని చెబుతున్నప్పటికీ రహదారులు బాగుంటేనే ఫీల్ గుడ్ కొంత వరకైనా వస్తుంది. అలాగే ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్ లో రైతులు సంతోషంగా ఉంటేనే వారు మళ్లీ ప్రభుత్వం వైపు మొగ్గు చూపుతారు. అలాగే నిరుద్యోగులు, మహిళల విషయంలోనూ అదే జరుగుతుంది. అందుకని సంక్షేమ పథకాలను కొందరికే ఇచ్చి తాము బాగా చేస్తున్నామని జబ్బలు చరుచుకుంటూ, ఎమ్మెల్యేల పనితీరును తప్పుపడుతూ కూర్చుంటే చివరకు పుట్టి మునిగేది ఖాయమన్నది గతంలో అనేక ఎన్నికల ఫలితాలు చాటి చెప్పాయి. ఎమ్మెల్యేలు సక్రమంగా చేసినా పక్క వాడికి అందిన పథకం తమకు దక్కకపోతే ఖచ్చితంగా వ్యతిరేకత వస్తుంది. అది ముఖ్య నేతలు గమనించాలని కిందిస్థాయి నేతలు కోరుతున్నారు. అలాగే కార్యకర్తలు కూడా పార్టీ నిలదొక్కుకోవడానికి, ప్రభుత్వం మరోసారి అధికారంలోకి రావడానికి కీలకమని గుర్తించాల్సి ఉంటుంది.

# సస్పెన్స్‌కు తెరదించిన మంత్రి లోకేశ్..

**ఏపీకి రూ.1.1 లక్షల కోట్ల మెగా ఇన్వెస్ట్‌మెంట్**

**ఏపీకి రూ.1.1 లక్షల కోట్ల పెట్టుబడితో రానున్న బ్రూక్‌ఫీల్డ్**

**మంత్రి నారా లోకేశ్ అధికారికంగా వెల్లడి**

పునరుత్పాదక ఇంధనం, సోలార్ తయారీ రంగాల్లో ప్రధానంగా పెట్టుబడులుడేటా సెంటర్లు, పోర్టులు, రియల్ ఎస్టేట్‌లోనూ విస్తరణఈ పెట్టుబడితో ఏపీ గ్లోబల్ హబ్‌గా మారుతుందన్న లోకేశ్‌ఆంధ్రప్రదేశ్‌కు భారీ పెట్టుబడి రాబోతోందంటూ రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ నిన్న చేసిన ట్వీట్‌తో నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ప్రముఖ అంతర్జాతీయ సంస్థ బ్రూక్‌ఫీల్డ్ అసెట్ మేనేజ్‌మెంట్ రాష్ట్రంలో ఏకంగా 12 బిలియన్ డాలర్లు (సుమారు రూ.1.1 లక్షల కోట్లు) పెట్టుబడి పెట్టేందుకు ముందుకొచ్చిందని ఆయన అధికారికంగా ప్రకటించారు. ఈ చరిత్రాత్మక పెట్టుబడితో ఏపీ ప్రగతి పథంలో మరో ముందడుగు వేయనుందని ఆయన స్పష్టం చేశారు.

# టీడీపీకి వైసీపీ కోవర్టుల టెన్షన్

కడప, నవంబర్ 14,

ఏపీలో కూటమి అధికారంలోకి వచ్చి 17 నెలలు అవుతుంది. గతంలో ఎన్నడూ లేని విధంగా తెలుగుదేశం పార్టీ ఘన విజయం సాధించింది. రాష్ట్రంలో దాదాపు అన్ని ప్రాంతాల్లో ఆ పార్టీ హవా నడిచింది. జనసేనతో పాటు బిజెపితో పొత్తు చాలా రకాలుగా కలిసి వచ్చింది. రాయలసీమలోనూ తెలుగుదేశం పార్టీ ప్రభంజనం సృష్టించింది. కడప లాంటి జిల్లాలో సైతం టిడిపి హవా స్పష్టంగా కనిపించడం విశేషం. రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి ఈసారి చెక్ పెడుతూ టిడిపి సత్తా చాటింది. కానీ ఈ అరుదైన అవకాశాన్ని కొనసాగించే ఛాన్స్ చేజారిపోయినట్టు కనిపిస్తోంది. టిడిపిలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కోవర్టు లు అధికమైనట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు ముందు, తరువాత చేరిన వారితో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతున్నాయి. అలా చేరిన వైసీపీ నేతలపై ఎక్కువగా అవినీతి ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇలానే కొనసాగితే మాత్రం తెలుగుదేశం పార్టీకి వచ్చే ఎన్నికల్లో ఇబ్బందికరమే. ఉమ్మడి కడప జిల్లాలో పది అసెంబ్లీ సీట్లకు గాను ఏడింట తెలుగుదేశం పార్టీ విజయం సాధించింది. అయితే రాజశేఖర్ రెడ్డి కుటుంబానికి తట్టుకుని గెలవడం ఆశామాషి కాదు. 2014లో ఇక్కడ తెలుగుదేశం పార్టీ కేవలం ఒక్క స్థానంలో మాత్రమే విజయం సాధించింది. 2019లో అయితే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ క్లీన్ స్వీప్ చేసింది. అటువంటి చోట 2024 ఎన్నికలు వచ్చేసరికి సీన్ మారిపోయింది. 10 సీట్లకు గాను ఏడు చోట్ల విజయం సాధించింది. అయితే ఆ పట్టు నిలుపుకునేందుకు టిడిపి ప్రయత్నిస్తోంది. కానీ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చిన చాలామంది నేతల తీరుతో పరిస్థితి చేయి జారిపోతోంది. చాలామంది నేతల అవినీతి రోజురోజుకు పెరుగుతోంది. దాని ప్రభావం స్పష్టంగా వచ్చే ఎన్నికలపై పడుతుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఉమ్మడి కడప జిల్లాలో రాయచోటి, మదనపల్లి, తంబళ్లపల్లె, రైల్వే కోడూరు నియోజకవర్గాల్లో ఇబ్బందికర పరిస్థితులు ఉన్నాయి. ఈ నాలుగు నియోజకవర్గాల్లో వైసిపి కోవర్టులు అధికంగా ఉన్నారు. వారు ఇప్పుడు పార్టీకి చేటు తెస్తున్నారు. ఒకవైపు టిడిపిని బలహీనపరచడం ఒక ఎత్తు అయితే.. అవినీతి పనులు చేసి పార్టీకి చెడ్డ పేరు తీసుకురావాలన్నది వీరి ముఖ్య ఉద్దేశ్యంగా తెలుస్తోంది. వ్యాపారాలు రిత్యా కొందరు, వైసీపీ హయాంలో చేసిన తప్పిదాలకు ఇబ్బందులు వస్తాయని మరికొందరు టిడిపి గూటికి చేరారు. వారికి పార్టీ సిద్ధాంతాలపై కానీ.. పార్టీపై కానీ మంచి అభిప్రాయం లేదు. అటువంటి వారితో పార్టీ సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటోంది. పార్టీ హై కమాండ్ చక్కదిద్దకపోతే మాత్రం ఇబ్బందికర పరిస్థితులు ఎదురయ్యే అవకాశం ఉంది. చూడాలి టీడీపీ హై కమాండ్ ఎలాంటి యాక్షన్ లోకి దిగబోతుందో..

# ఆళ్లకు జగన్ షాక్..

గుంటూరు, నవంబర్ 14,

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నేతలకు భయం వెంటాడుతోంది. కేసులతోపాటు అరెస్టులు జరుగుతుండడంతో దూకుడు కలిగిన నేతలు అజ్ఞాతంలోకి వెళ్ళిపోతున్నారు. కనీసం మీడియా ముందుకు వచ్చి మాట్లాడేందుకు కూడా భయపడిపోతున్నారు. వైసీపీ



హయాంలో రాజకీయ ప్రత్యర్థులను వెంటాడి.. ఒక ఆట ఆడేసుకున్న నేతలు సైతం ఇప్పుడు కనిపించకుండా పోతున్నారు. అటువంటి వారిలో మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఒకరు. వైసీపీ కీలక నేత, ఆ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి సోదరుడు రామకృష్ణారెడ్డి. ఈ ఇద్దరు సోదరులు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో చాలా యాక్టివ్ గా పని చేసేవారు. అయితే తమను జగన్మోహన్ రెడ్డి రాజకీయంగా వాడుకున్నారే తప్ప.. తమకు ఎటువంటి ప్రయోజనాలు కల్పించలేదన్న ఆందోళన, ఆవేదన ఆ ఇద్దరు నేతల్లో ఉన్నట్లు తెలుస్తోంది. మొన్న ఆ మధ్యన అయోధ్య రామిరెడ్డి పార్టీ మారుతారని కూడా పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. కానీ అటువంటిదేమీ లేకుండా పోయింది. అయితే ఆళ్ల రామకృష్ణారెడ్డి మాత్రం ప్రస్తుతం అజ్ఞాతంలో ఉన్నారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉన్నారు. అరెస్టుల భయంతోనే ఆయన దూరంగా ఉన్నట్లు ప్రచారం సాగుతోంది.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావం నుంచి పనిచేస్తూ వస్తున్నారు ఆళ్ల రామకృష్ణారెడ్డి. అందుకే జగన్మోహన్ రెడ్డి 2014లో పిలిచి మంగళగిరి టిక్కెట్ ఇచ్చారు. ఎమ్మెల్యేగా గెలిచారు కూడా. అయితే మంగళగిరి ప్రాంతాన్ని రాజధానిగా ఎంపిక చేసింది చంద్రబాబు ప్రభుత్వం. కానీ ఆ సమయంలో మంగళగిరి ఎమ్మెల్యేగా ఉన్న ఆళ్ల రామకృష్ణారెడ్డి చాలా దూకుడుగా వ్యవహరించారు. అప్పటి చంద్రబాబుపై కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేసేవారు. పెద్ద ఎత్తున కేసులు వేసేవారు. 2019 వరకు అదే దూకుడు కనబరిచారు. 2019లో రెండోసారి వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేసి గెలిచారు రామకృష్ణారెడ్డి. జగన్ పిలిచి మంత్రి పదవి ఇస్తారని భావించారు. కానీ జగన్ మాత్రం పట్టించుకోలేదు. దాదాపు పది సంవత్సరాలు పాటు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి సేవలు అందిస్తే.. 2024 ఎన్నికలకు ముందు టిక్కెట్ లేదని తేల్చేశారు జగన్మోహన్ రెడ్డి. మంగళగిరి టిక్కెట్ దక్కకపోయేసరికి తీవ్ర మనస్థాపానికి గురయ్యారు రామకృష్ణారెడ్డి. వెంటనే షర్మిల పిలుపుమేరకు కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు. కానీ అక్కడ ఎన్నో రోజులు ఉండలేకపోయారు. తిరిగి జగన్ గూటికి వచ్చేసారు. అయితే ఆ ఎన్నికల్లో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోవడంతో ఫుల్ సైలెంట్ అయ్యారు ఆళ్ల రామకృష్ణారెడ్డి. అయితే చంద్రబాబుతో పాటు టిడిపి నేతలపై కేసుల విషయంలో ముందుండే వారు రామకృష్ణారెడ్డి. ఇప్పుడు కూటమి అధికారంలోకి రావడం, కేంద్రంలో ఎన్డీఏ కీలక భాగస్వామి కావడంతో తన అరెస్ట్ ఉంటుందని అనుమానిస్తున్నారు. అందుకే అజ్ఞాతంలోకి వెళ్లిపోయినట్లు తెలుస్తోంది. మరోవైపు జగన్మోహన్ రెడ్డి సైతం ఆళ్ల రామకృష్ణారెడ్డిని మోసం చేసినట్లు ప్రచారం నడుస్తోంది. మంగళగిరి నుంచి తప్పించిన రామకృష్ణారెడ్డి తనకు సత్తెనపల్లి నియోజకవర్గ బాధ్యతలు అప్పగించాలని కోరినట్లు తెలుస్తోంది. అయితే ఇప్పటికే సత్తెనపల్లి టిక్కెట్ విషయంలో మాజీమంత్రి అంబటి రాంబాబుకు హామీ ఇచ్చారు జగన్. ఆ హామీ తప్పితే ఇబ్బందికర పరిస్థితులు వస్తాయని తెలుసు. అందుకే ఆళ్ల రామకృష్ణారెడ్డికి నో చెప్పినట్లు సమాచారం. అందుకే ఇక రాజకీయాల నుంచి పూర్తిగా తప్పుకునేందుకు ఆల రామకృష్ణారెడ్డి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. మరి అందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# ట్రెండింగ్ లో బాయి లోన బల్లి పలికే

హైదరాబాద్, నవంబర్ 14,

ప్రస్తుతం సోషల్ మీడియాను షేక్ చేస్తున్న వాటిలో ఫోక్ సాంగ్స్ మొదటి స్థానంలో ఉన్నాయి. సినిమా ఇండస్ట్రీలో ఎలాంటి ఆల్బమ్స్ అయితే వస్తాయో ఫోక్ ఇండస్ట్రీ లో సైతం గొప్ప పాటలు వస్తున్నాయి. ఒక పాటను మించి మరొక పాట రావడంతో సోషల్ మీడియాలో వైరల్ గా మారి చాలామంది ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ఇక ఇలాంటి క్రమంలోనే సూపర్ సక్సెస్ అయిన ఫోక్ సాంగ్స్ ను సినిమాల్లో వాడుకుంటున్న సందర్భాలు చాలానే ఉన్నాయి. ఫోక్ సాంగ్స్ పడటంలో తనకంటూ ఒక సపరేట్ క్రేజ్ ను సంపాదించుకున్న మంగ్లీ తన వాయిస్ తోనే కాకుండా తన స్టెప్పులతో కూడా ప్రేక్షకులను అలరిస్తోంది. ఇక ఫోక్ ఇండస్ట్రీలో తన




పాటతో ఆటతో ఆకట్టుకుంటున్న మంగ్లీ నుంచి మరొక కొత్త పాట వచ్చింది. 'బాయి లోన బల్లి పలికే' అనే సాంగ్ కు సంబంధించిన మేకింగ్ వీడియో ఇప్పుడు సోషల్ మీడియా విపరీతంగా వైరల్ అవుతోందిఈ వీడియో సాంగ్ కనుక వచ్చినట్లయితే మాత్రం యూట్యూబ్ మొత్తం షేక్ అవుతుందని చెప్పడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదు. ఆ ట్యూన్ కు తగ్గట్టుగా లిరిక్స్ అందించినట్టుగా తెలుస్తోంది? ప్రతి లిరిక్ లో కూడా తెలంగాణ భావాలు కనిపిస్తున్నాయి. ఫోక్ హిస్టరీ లోనే ఇలాంటి ఒక సాంగ్ రాలేదంటూ చాలామంది కామెంట్స్ చేస్తున్నారు.ఇక ఈ వీడియో సాంగ్ కి కనుక గొప్ప గుర్తింపు లభిస్తే మాత్రం ఇంకా చాలా గొప్ప ఫోక్ సాంగ్స్ పుట్టుకొచ్చే అవకాశం ఉంది. ఇంకా మంగ్లీ నుంచి ప్రతి సంవత్సరం ఒకటి రెండు ఫోక్ సాంగ్స్ వస్తున్నాయి. ఇక ఇలాంటి క్రమంలోనే ఆమె చేస్తున్న సాంగ్స్ కి ప్రేక్షకుల నుంచి విశేషమైన స్పందన వస్తోంది. ఇటు ఫోక్ సాంగ్స్ చేస్తూనే దేవుళ్ళ పాటలను కూడా పాడుతూ ప్రేక్షకులను అలరిస్తోంది. మంగ్లీ అంటే ప్రేక్షకుల్లో ఫోక్ సింగర్ గా ఒక ప్రత్యేకమైన గుర్తింపు పడిపోయింది. అప్పుడప్పుడు సినిమాల్లో పాటలు పాడుతున్నప్పటికి ఆమెకు ఫోక్ సింగర్ గానే మంచి ఐడెంటిటి దక్కుతోంది. ఇక దీన్ని కాపాడుకుంటూ ముందుకు వెళితే ఆమె ఫోక్ సింగర్ గా టాప్ రేంజ్ లో ముందుకు దూసుకెళ్లడం పక్కా అనేది కన్ఫామ్ గా తెలిసిపోతోంది? ఇక ఇలాంటి సాంగ్స్ రావడం వల్లే ఫోక్ ఇండస్ట్రీ కూడా ముందుకు వెళ్తోంది. అలాగే వీటి వల్ల మన పల్లె పాటలని, మట్టి వాసనని వెలికి తీసి చూసినా భావం కలుగుతోంది?

# నీల్ బత్తె సన్నాట సినిమాను చిన్నారులు ఆదర్శంగా తీసుకోండి కలలు కనండి.. కష్టపడండి.. వాటిని సహకారం చేసుకోండి

### తల్లిదండ్రులు ఉపాధ్యాయుల నమ్మకాన్ని నిలబెట్టాలి.. చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి

కరీంనగర్, నవంబర్ 14(భారతశక్తి ప్రతినిధి):

"నీల్ బత్తె సన్నాట" అనే హిందీ సినిమాను చిన్నారులు ఆదర్శంగా తీసుకొని లక్ష్యాన్ని సాధించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపు నిచ్చారు. ఈ సినిమాలో తల్లి పాత్రలో ఒక పనిమనిషి ఉంటుందని ఆమె కష్టపడుతూ తన కూతుర్ని ఐఏఎస్ చదివిస్తుందన్నారు. సహజంగా డాక్టర్ కూతురు డాక్టరు ఇంజనీరు కూతురు ఇంజనీరుగా అవుతుంటారని పనిమనిషి కూతురు ఐఏఎస్ వరకు చదివించడం అద్భుతమనీ, లక్ష్య సాధనకు ఈ సినిమా ప్రేరణగా నిలుస్తుందన్నారు. శుక్రవారం కరీంనగర్ ఫిలిం భవన్ లో ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మూడు రోజులపాటు జరిగే చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జ్యోతి ప్రజ్వలన చేసి చిల్డ్రన్స్ ఫిలిం ఫెస్టివల్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ "నీల్ బత్తె సన్నాట" అనే హిందీ సినిమాను కేజీబీవీ తో పాటు ప్రభుత్వ పాఠశాలల్లో ప్రదర్శిస్తున్నామని దీనిపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు. ఆ సినిమాలో కూతుర్ని చదివించేందుకు ఒక తల్లి పడ్డ కష్టం అంతా ఇంత కాదన్నారు. చదువు రాని తల్లి తన





కూతురితో పదో తరగతి వరకు చదువుతుందన్నారు. ఈ సినిమాను విద్యార్థులు తల్లిదండ్రులు అందరూ చూడాలని కోరారు. చిన్నారులు తల్లిదండ్రుల కష్టం విలువ తెలుసుకోండి.. కలలు కనండి..కష్టపడండి.. వాటిని సహకారం చేసుకోండి.

జీవితంలో ఉన్నత భవిష్యత్తును నిర్మించుకోవాలని జిల్లా కలెక్టర్ పేర్కొన్నారు. చిన్నప్పటినుంచి విద్యార్థులు మంచి సంస్కారం అలవర్చుకొని ఉత్తమ పౌరులుగా ఎదగాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పిలుపునిచ్చారు. తల్లిదండ్రులు తమ పిల్లలు మంచి పొజిషన్లో ఉండాలనీ కోరుకుంటారని వారి నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు మంచి పేరు తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యార్థులకు చిన్నప్పటినుంచే లక్ష్యాన్ని సాధించే వరకు నిరంతరం పరీక్ష ఉంటుందని వాటిని అధిగమించుకుంటూ ముందుకెళ్లాలని పేర్కొన్నారు. చిన్నారులు జీవితాన్ని ఎంజాయ్ చేయాలని చెడు అంశాలను పట్టించుకోకుండా మంచి ఆలోచనలు చేస్తూ మంచిని ఆస్వాదిస్తూ చదువుకోవాలన్నారు. చిన్న వయసులోనే లక్ష్యాన్ని సాధించి దాన్ని నెరవేర్చేందుకు క్రమశిక్షణతో ముందుకెళ్లాలన్నారు. తల్లిదండ్రులు ఉపాధ్యాయులు పిల్లల ఎదుగుదల కోసం నిరంతరం కష్టపడుతుంటారని వారి నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. సమాజంలో మంచి సంస్కారమంతమైన పౌరులుగా ఎదగాలని పేర్కొన్నారు. పిల్లల భవిష్యత్తు బాగుండాలని తల్లిదండ్రులు ప్రతిరోజు కష్టపడుతూ చదివిస్తున్నారని వారి కష్టాన్ని గుర్తించి విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని సూచించారు. ఈ సందర్భంగా మూడు రోజులపాటు వివిధ రకాల సినిమాలను ప్రదర్శించనున్నారు.

అంతకుముందుకు జిల్లా కలెక్టర్ పమేలా సత్పతికి విద్యార్థులు ఘన స్వాగతం పలికారు. అనంతరం జిల్లా కలెక్టర్ ఆలపించిన చిన్నారి పిచ్చుక వీడియో ప్రదర్శనతో పాటు పంచతంత్ర బాలల చిత్రాన్ని ప్రదర్శించారు. కార్యక్రమంలో భగవతి స్కూల్ విద్యార్థులు ఈ చిత్రాన్ని వీక్షించారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఫిలిం సొసైటీ అధ్యక్షుడు పొన్నం రవిచంద్ర, అడ్వైజర్ వరాల మహేష్, ప్రధాన కార్యదర్శి లక్ష్మీ గౌతమ్ ఉపాధ్యక్షుడు సయ్యద్ ముజఫర్ భగవతి విద్యాసంస్థల చైర్మన్ రమణారావు, అన్నవరం దేవేందర్, కందుకూరి అంజయ్య, వెంకటేశం, దశరథం, సురేష్, చెన్న అనిల్ కుమార్, పి ఎస్. రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

# జైష్-ఇ ఉగ్రకుట్రను భగ్నం చేసిన తెలుగు ఐపీఎస్

శ్రీనగర్, నవంబర్ 14,

ఒక చిన్న పోస్టర్ మీద రాసిన హెచ్చరిక ఒక పెద్ద ఉగ్రవాద కుట్రని బహిర్గతం చేసింది. జమ్మూ కాశ్మీర్ పోలీసు విభాగంలో సీనియర్ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ (ఎస్పీ)గా పనిచేస్తున్న తెలుగు ఐపీఎస్ అధికారి డా. జీవీ సందీప్ చక్రవర్తి నాయకత్వంలో జైష్-ఇ-మహమ్మద్ ఉగ్రవాద మాడ్యూల్‌ను ధ్వంసం చేసిన సంఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఆంధ్రప్రదేశ్ కర్నూల్‌కు చెందిన ఈ తెలుగు ఐపీఎస్ అధికారి తొలుత వైద్యుడు. ఆ తర్వాత పోలీసు అధికారిగా మారిన ధీరుడు. ఆయన అప్రమత్తత, వేగంగా స్పందించే గుణం భారీ ఉగ్ర కుట్రను బయటపెట్టింది. వైట్ కోట్ (వైద్యులు) టెర్రర్‌గా వ్యవహరిస్తున్న జైష్ మాడ్యూల్ ఉగ్రవాదాన్ని వెలుగులోకి తేవడంలో డా. సందీప్ చక్రవర్తి కీలక పాత్ర పోషించారు. అక్టోబర్ 19న శ్రీనగర్‌లోని నౌగామ్-బున్పోరా ప్రాంతంలో జైష్-ఎ-మహమ్మద్ పేరిట పోస్టర్లు వెలిసాయి. ఈ పోస్టర్లలో భద్రతా దళాలను హెచ్చరిస్తూ.. "తీవ్రమైన పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది" అని రాసి ఉంది. 2019లో ఆర్టికల్ 370 రద్దు చేసినప్పటి నుంచి అలాంటి పోస్టర్లు చాలా అరుదుగా మాత్రమే కనిపించేవి. ఈ నేపథ్యంలో ఎస్పీ చక్రవర్తి దీన్ని తేలిగ్గా తీసుకోలేదు. 'కమాండర్ హంజాలా భాయ్' అనే జైష్ ఉగ్రవాది సంతకంతో ఉన్న ఈ పోస్టర్లు ఒక పెద్ద కుట్రకి సూచనగా భావించారు. వెనువెంటనే, ఎక్స్‌ప్లోసివ్ సబ్‌స్టాన్సెస్ యాక్ట్, ఆర్మ్స్ యాక్ట్‌ల కింద కేసు నమోదు చేసి, సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా ముగ్గురు ఓవర్‌గ్రౌండ్ వర్కర్లను (ఓజీడబ్ల్యూలు) అరెస్ట్ చేశారు. విచారణలో భాగంగా మౌల్వీ ఇర్ఫాన్ అహ్మద్‌ను ప్రశ్నించగా.. మల్టీ-స్టేట్ (జైష్) నెట్‌వర్క్‌ను బహిర్గతమైంది. ఇది జమ్మూ కాశ్మీర్, హర్యానా, ఉత్తరప్రదేశ్‌లలో వ్యాపించి ఉంది. తదుపరి దశలో పుల్వామా డాక్టర్ ముజమ్మిల్ అహ్మద్ గనై (ఫరీదాబాద్ మెడికల్ కాలేజీలో పనిచేస్తున్నవాడు), క్వాజిగుండ్‌కు చెందిన డాక్టర్ ఆదీల్ అహ్మద్ రతర్, లఖ్‌నౌకు చెందిన డాక్టర్ షాహీన్ సయీద్‌లను అరెస్ట్ చేశారు. మౌల్వీ ఇర్ఫాన్ ఇంటిపై జరిపిన దాడిలో టెలిగ్రాం ఛానల్ ద్వారా పాకిస్తాన్‌లోని జైష్ ఉగ్రవాది ఉమర్ బిన్ ఖత్తాబ్‌తో సంబంధాలను గుర్తించారు. మొత్తం 9 మంది అరెస్టులతో పాటు, 2,900 కేజీలకు పైగా పేలుడు పదార్థాలు, బాంబ్ తయారీ సామగ్రి, రెండు ఏకే సిరీస్ రైఫిల్స్ పట్టుకున్నారు. ఇది రెడ్ ఫోర్ట్ సమీపంలో జరిగిన బ్లాస్ట్‌కు, దీని వెనుక ఉన్న సీరియల్ బ్లాస్ట్ ప్లాన్‌కు కీలక ఆధారంగా మారింది. ఈ కుట్ర రెండు సంవత్సరాల నుంచి రూపొందిందని, ఆపరేషన్ సిందూర్ తర్వాత ఢిల్లీలో బహుళ బ్లాస్ట్‌లు జరపాలని జైష్ ప్లాన్ చేసిందని పోలీసులు తెలిపారు. పుల్వామా డాక్టర్ ఉమర్ మొహమ్మద్ రెడ్ ఫోర్ట్ బ్లాస్ట్‌లో ఉపయోగించిన కారును నడిపినట్టు సీసీటీవీ ద్వారా గుర్తించారు. మృతదేహానికి తల్లిదండ్రులతో నిర్వహించిన టెస్టు కూడా ఈ విషయాన్ని ధృవీకరించింది.

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌లో జన్మించిన డా. జీవీ సందీప్ చక్రవర్తి తండ్రి డా. జీవీ రామగోపాల్ రావు (ప్రభుత్వ ఆసుపత్రిలో ఆర్‌ఎంఓ), తల్లి పీసీ రంగమ్మ (ఆరోగ్య శాఖ అధికారి)లు పబ్లిక్ సర్వీస్‌లో ఉన్నారు. 2010లో కర్నూల్ మెడికల్ కాలేజీ నుంచి ఎంబీబీఎస్ పూర్తి చేసి, ఒక సంవత్సరం ప్రాక్టీస్ చేసిన తర్వాత 2014లో ఐపీఎస్‌లో చేరాడు. జమ్ము-కాశ్మీర్‌లో పూంచ్‌లో ఏఎస్పీ, కూప్వారాలో ఎస్పీ, కుల్గామ్, అనంతనాగ్, శ్రీనగర్‌లో ఎస్పీలుగా పనిచేశాడు. ఆపరేషన్ మహాదేవ్‌లో పహల్గామ్ దాడి చేసిన ముగ్గురు ఉగ్రవాదులను ఎదుర్కొని హతమార్చిన జమ్ము-కాశ్మీర్ పోలీసు టీమ్‌కు నాయకత్వం వహించారు. ఆరు ప్రెసిడెంట్స్ పోలీస్ మెడల్స్ (గాలెంట్రీ కోసం), నాలుగు జెకె పోలీస్ మెడల్స్ (మెరిటోరియస్ సర్వీస్ కోసం) పొందాడు. 2025 ఆగస్టు 14న ఆరో గాలెంట్రీ మెడల్ అందుకున్నాడు. ఏడఐ పోలీసులలో 'ఆపరేషన్స్ స్పెషలిస్ట్'గా పిలుస్తారు. అతని వ్యూహాత్మక మేధస్సు, వెనువెంటనే స్పందించే తత్వం ఈ ఆపరేషన్‌లో కీలకం.

# పాక్ వైపే చూపిస్తున్న నాలుగు వేళ్లు

శ్రీనగర్, నవంబర్ 14,



భారత్ అంటే చాలు కళ్ళల్లో నిప్పులు పోసుకుంటుంది పాకిస్తాన్. మన దేశ ప్రగతిని.. సాధిస్తున్న ఎదుగుదలను ఏమాత్రం ఓర్వలేదు. మనతో నిత్యం కవ్వింపులకు పాల్పడుతూనే ఉంటుంది. సరిహద్దుల్లో రక్తపుటేరులు పారిస్తూనే ఉంటుంది. అభివృద్ధిలో.. అక్షరాస్యతలో.. మిగతా విషయాలలో మన దేశంతో పోల్చి చూస్తే ఎక్కడో ఉండే పాకిస్తాన్.. ఉగ్రవాదం విషయంలో మాత్రం మొదటి స్థానంలో ఉంటుంది. పైగా ఉగ్రవాద సంస్థలను పెంచి పోషిస్తూ పాకిస్తాన్ ప్రజల టాక్స్ లను సైతం ఉగ్రవాదుల పోషణ కోసం వెచ్చిస్తూ ఉంటుందిమన దేశంలో గతంలో జరిగిన.. ప్రస్తుతం చోటు చేసుకున్న బాంబు పేలుళ్ల వెనక కచ్చితంగా పాకిస్తాన్ హస్తం ఉంటుంది. మన దేశాన్ని నాశనం చేయడానికి.. అన్ని విధాలుగా ఇబ్బంది పెట్టడానికి పాకిస్తాన్ ఇతర శక్తులతో ఖచ్చితంగా చేయి కలుపుతుంది. తను బాగుపడకపోయినా పర్వాలేదు కానీ.. భారత్ పెరుగుతుంటే మాత్రం తట్టుకోలేదు.. పైగా అత్యంత క్రూరమైన విధానాలకు పాల్పడుతూ ఉంటుంది.. పాకిస్తాన్ మనతో విడిపోయిన నాటి నుంచి ఇప్పటివరకు ఒక ఉగ్రవాదం మినహా మిగతా ఏ విషయంలోనూ అంతగా అభివృద్ధి సాధించలేదు.. ప్రజల బాగోగులు ఏమాత్రం పట్టించుకోని అక్కడి పరిపాలకులు.. ఉగ్రవాద కార్యకలాపాలలో మాత్రం ఉత్సాహంగా ఉంటారు.. తాము సంపాదించుకోవడానికి.. భారీగా వెనకేసుకోవడానికి ఏమాత్రం వెనకాడని పాకిస్తాన్ పరిపాలకులు.. ప్రజల బాగోగులను మాత్రం కనీసం పట్టించుకోరు.. భారత్ అంటే చాలు అగ్గిమీద గుగ్గిలం లాగా రెచ్చిపోతారు.. ఒకవేళ భారత్ గనుక దాడి చేస్తే విక్టిమ్ కార్డు ప్లే చేస్తారు. తాజాగా ఢిల్లీలో బాంబు పేలుడు చోటుచేసుకుంది. ఈ ఘటనలో 12 మంది చనిపోయారు. 20 మందికి పైగా గాయపడ్డారు. వారంతా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. అయితే ఈ పేలుడుకు పాకిస్తాన్ ప్రేరేపిత ఉగ్రవాద సంస్థ జై షే మహమ్మద్ కారణమని ఇప్పటికే భారత ఇంటలిజెన్స్ వర్గాలు ఒక అంచనాకు వచ్చాయి. దీనికి సంబంధించి అత్యంత లోతుగా దర్యాప్తు జరుగుతోంది. మరోవైపు ప్రధానమంత్రి నరేంద్ర మోడీ కూడా ఉగ్రవాదులకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు.. ప్రపంచంలో ఎక్కడ ఉన్నా సరే బయటికి తీసుకొచ్చి కఠిన శిక్ష విధిస్తామని హెచ్చరించారు. ఇది ఇలా సాగుతుండగానే పాకిస్తాన్ మరో విధంగా మాట్లాడింది. ఢిల్లీలో చోటు చేసుకున్న పేలుడుకు సంబంధించి పాకిస్తాన్ మంత్రి ఖవాజా ఆసిఫ్ నెత్తి మాసిన వ్యాఖ్యలు చేశారు. " నిన్నటి వరకు అది గ్యాస్ సిలిండర్ పేలుడు. ఇప్పుడేమో విదేశాల కుట్ర దాగి ఉందని భారత్ ఆరోపిస్తోందని" ఆయన పేర్కొన్నారు. రాజకీయ ప్రయోజనాల కోసం భారత్ ఈ ఘటనను వాడుకుంటున్నదని ఓ టీవీ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు.. త్వరలో పాకిస్తాన్ పై భారత్ ఆరోపణలు చేసిన ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. అంతే కాదు తమ వరకు భారత్ వస్తే పరిణామాలు వేరే విధంగా ఉంటాయని ఆయన హెచ్చరించారు. అసిఫ్ చేసిన వ్యాఖ్యల పట్ల భారతీయులు మండిపడుతున్నారు.. ఇలాంటి వ్యాఖ్యలు చేయడం పాక్ పాలకులకు అలవాటేనని.. ఆపరేషన్ సిందూర్ మొదలైనప్పుడు పాక్ మేకపోతు గాంభీర్యం ప్రదర్శించిందని.. ఆ తర్వాత ఎలా మాట్లాడిందో అందరికి తెలుసని నెటిజన్లు పేర్కొంటున్నారు.

# మంచిర్యాల కాంగ్రెస్ లో గలాటలు

అదిలాబాద్, నవంబర్ 14,

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి కాంగ్రెస్ లో ఇటీవల వరుసగా చోటుచేసుకున్న పరిణామాలు తీవ్ర చర్చనీయాశంగా మారాయి. ఈ నేపథ్యంలో పార్టీ ప్రతిష్టను బజారుకీడ్చాయి. ఇలాంటి సంఘటలు పార్టీ శ్రేణుల్లో తీవ్ర గందరగోళం రేపాయి. తల నొప్పిగా మారిన అసమ్మతిపై ఎమ్మెల్యే ప్రధానంగా దృష్టి పెట్టారని సమాచారం. బెల్లంపల్లిలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను అమ్మకం కోసం ఓ కాం గ్రెస్ యువ నేత మహిళా నేత (కొమురక్క) తో మంతనాల వ్యవహారంపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ సీరియస్‌గా ఉన్నట్టు తెలుస్తోంది. వారి సంభాషణ వీడియో బెడిసికొట్టి కాంగ్రె స్ పార్టీ, ముఖ్యంగా ఎమ్మెల్యే, అతని పీఏల పరువు ప్రతిష్టకి భంగం చేసిన యువ నేతపై చర్యలు తీసుకోవాలని యోచిస్తున్నట్లు సమాచారం. ఇటీవల ఈ విషయంపై స్వయంగా ఎమ్మెల్యే పీఏ కొమురక్కతో మాట్లాడిన ఆడియో కూడా వైరల్ అయ్యింది. ఇప్పుడి ఇదే పట్టణంలో సంచలనమైంది. రూ. 3 లక్ష లు ఇస్తే డబుల్ బెడ్రూం ఇళ్లు రెండు ఇప్పి ద్దాం.., ఎవరైనా మీ వార్డులో ఉంటే చెప్పు అని కొమురక్కతో అన్న మాటల ఆడియో బయటకు ఎలా వెళ్ళిందనే దానిపై ఆరా తీయడం ఆసక్తిగా మారింది...ఈవిషయంపై ఎమ్మెల్యే గడ్డం వినోద్ చాలా కోపంగా ఉన్న ట్టు కూడా అర్థమవుతుంది. అందుకే పీఏ రంగంలోకి దిగారు. కొమురక్కకు కాల్ చేసి జరిగిన విషయం తెలుసు కున్నారు. సదరు యువనేతను సార్ (ఎమ్మెల్యే), మీతో(పీఏ) టచ్‌లోనే ఉంటారు కదా..? మీ బలంతోనే కదా ఆయన అలా చేశారు... ఇందులో నా నా పాత్రేమి లేదు. అతని మాటలు నమ్మితే మోసపోయేదాన్ని అని కూడా ఆమె వాపోయారు...మీకు దగ్గరనే భావంతోనే ఆయన అలా వ్యవహరించాడనీ మొఖం పట్టుకుని పీఏను నిలదీసింది.

# బ్రిటన్ లో వలస వ్యతిరేక ర్యాలీలు

లండన్, నవంబర్ 14,


మా దేశంలో మేమేం ఉండాలి.. మా దేశం మాకే సొంతం కావాలి.. అన్న నినాదంతో నిన్నటి వరకు అమెరికాలో జరిగిన నిరసనలు ఇప్పుడు యునైటెడ్ కింగ్డమ్ లోనూ పెల్లుబికుతున్నాయి. గత రెండు నెలల నుంచి బండల్లో వలసవాదుల వ్యతిరేకంగా నిరసనలు హోరెత్తుతున్నాయి. బ్రిటన్ దేశంలోకి అక్రమంగా కొందరు వలసలు వచ్చారని.. వారిని వెంటనే వెనక్కి పంపాలని లండన్ ప్రధాన వీధుల్లో భారీ ప్రదర్శన చేపడుతున్నారు. విదేశీయులను దేశం నుంచి బయటకు పంపాలనే ఉద్దేశంతో యాంటీ ఇమిగ్రేషన్ కార్యకర్త, అతివాద నాయకుడు టామీ రాబిన్సన్ పిలుపుమేరకు 'యునైటెడ్ ద కింగ్డమ్ ర్యాలీ'పేరుతో చేపట్టిన ప్రదర్శన ఉద్రిక్తంగా మారిన విషయం తెలిసిందే. అయితే ఆ తర్వాత కూడా ర్యాలీలు కొనసాగుతుండడం గమనార్హం. కొన్ని సంవత్సరాలుగా ఇతర దేశాల నుంచి బ్రిటన్ లోకి వలసవాదులు వస్తున్నారని కొందరు ఆరోపిస్తున్నారు. వీరు ఎక్కువగా బోటు ద్వారా దేశంలోకి వస్తున్నట్లు చెబుతున్నారు. ఇలా విదేశీయులు ఎక్కువ కావడంతో దేశంలో ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణంగా ఒత్తిడిలో పెరుగుతున్నాయి. అంతేకాకుండా 2025 అక్టోబర్ 29న బ్రిటన్, వియత్నాం మధ్య ఒక ఒప్పందం నమోదయింది. వియత్నాం నగరంలోని వలస కారులను బ్రిటన్ తీసుకోవడమే ఈ ఒప్పందం.. ఇదే ఆగస్టులో ఫ్రాన్స్ తో మరో ఒప్పందం జరిగింది. దేశంలో వలస కారులు పెరిగిపోవడంతో ఇక్కడి వారికి ఉద్యోగ అవకాశాలు, వ్యాపార లాభాలు కోల్పోతున్నామని కొందరు ఆందోళన చెందుతున్నారు. అంతేకాకుండా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలపై వ్యతిరేక ప్రదర్శనలు చేస్తున్నారు. యూకే ప్రధాని కీర్ స్టార్మర్ మాత్రం వలస కారుల వ్యతిరేక ప్రదర్శనలు సహించబోమ్ అని అంటున్నారు. దీంతో ఆందోళనకారులు ప్రధానిపై విమర్శలు చేస్తూ వలస కారులను తిరిగి పంపేయండి అంటూ నినాదాలు చేస్తున్నారు. అయితే ఇందులో భాగంగా సెప్టెంబర్ లో నిర్వహించిన ప్రదర్శన ఉద్రిక్తంగా మారింది. ఒకవైపు వలస కారులకు వ్యతిరేకర ప్రదర్శన జరుగుతుంటే మరోవైపు జాత్యాహంకారం అంటూ చేసిన ప్రదర్శన తో ఘర్షణ వాతావరణం నెలకొంది. దీంతో కొంతమంది గాయపడ్డారు. అయితే ఈ వలసవాదుల వ్యతిరేక ప్రదర్శనలకు నిరసనగా ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకుంటుందోనని కొందరు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు విదేశాల నుంచి వచ్చి స్థిరపడిన వారు.. మరోవైపు వలసవాదులకు వ్యతిరేకంగా ప్రదర్శనలు చేసిన వారి మధ్య ఉద్రిక్తత ఏర్పడడంతో.. కొందరు సామాన్యులపై కూడా దాడులు చేస్తున్నారు. అంతేకాకుండా స్థానిక ప్రజల మధ్య విభేదాలు ఏర్పడే అవకాశం ఉందని తెలుస్తోంది. ఈ తరుణంలో వలసవాదుల విషయంలో ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోవాలని అంటున్నారు. లేకుంటే పరిస్థితి చేయి దాటిపోయి దేశం అల్లకల్లోలంగా మారే ప్రమాదం ఉందని ఆందోళన చెందుతున్నారు.

# గ్రాండ్ విక్టరీ తో ఇక కాంగ్రెస్ కు తిరుగులేదు

### -స్థానిక ఎన్నికల్లోను జూబ్లీహిల్స్ ఫలితమే పునరావృతం
### -కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల

కరీంనగర్, నవంబర్ 14(భారతశక్తి ప్రతినిధి):

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ గ్రాండ్ విక్టరీ సాధించడంతో ఇక రాష్ట్రంలో కాంగ్రెస్ కు తిరుగులేదని కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు పేర్కొన్నారు. అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు లేదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే లక్ష్యంగా మరింత రెట్టింపు ఉత్సాహంతో ముందుకెళ్తారని తెలిపారు. శుక్రవారం వెలిచాల రాజేందర్ రావు మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్ గడ్డ కాంగ్రెస్ అడ్డ అని అక్కడి ప్రజలు నిరూపించారనీ, కాంగ్రెస్ ప్రభుత్వం పై విశ్వాసంతోనే కాంగ్రెస్ పార్టీ అభ్యర్థికి పట్టం కట్టారని ఆనందం వ్యక్తం చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో 25 వేల మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొందిన నవీన్ యాదవ్ కు హార్థిక శుభాకాంక్షలు తెలిపారు. బీఆర్ఎస్ అభ్యర్థి సింపతి ఏమాత్రం పని చేయ లేదని ప్రజలు ఆదరించలేదని పేర్కొ న్నారు. రేవంత్ రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక జరిగిన రెండు ఉప ఎన్నికల్లో నూ కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడం రికార్డు అన్నారు. నవీన్ యాదవ్ అతని తండ్రి చిన్న శ్రీశైలం యాదవ్ పై బీఆర్ఎస్ నేతలు విష ప్రచారం చేశారనీ, వాటిని జూబ్లీహిల్స్ ప్రజలు తిప్పి కొట్టారని బీఆర్ఎస్ నేతలకు తగిన గుణపాఠం చెప్పారని మండిపడ్డారు. నవీన్ యాదవ్ గెలుపు కోసం కృషి చేసిన ముఖ్యమంత్రి పిసిసి అధ్యక్షుడు మంత్రులు ఎమ్మెల్యేలు ప్రతి ఒక్కరికి రాజేందర్ రావు కృతజ్ఞతలు తెలిపారు. కాంగ్రెస్ అభ్యర్థి విజయానికి జూబ్లీహిల్స్ లో అన్ని వర్గాల ప్రజలు మైనార్టీలు సినీ పరిశ్రమకు చెందిన వారు ప్రతి ఒక్కరు కృషి చేయడం అభినందనీ యమని పేర్కొన్నారు. ఇక రాబోయే రోజుల్లో మరింత రెట్టింపు ఉత్సాహంతో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తారని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ జూబ్లీహిల్స్ ఫలితాలు పునరావృతం అవుతాయనీ, ఎన్నిక ఏదైనా కాంగ్రెస్ పార్టీదే గెలుపు అని రాష్ట్రంలో తిరుగు లేదని పేర్కొన్నారు.



# దాతృత్వ స్ఫూర్తిని చాటిన గీతం బీ-స్కూల్ విద్యార్థులు

## నల్లగండ్లలోని శిశు మంగళ్ అనాథాశ్రమ విద్యార్థులతో ఆహ్లాదంగా ఓ రోజు

సంగారెడ్డి,భారతశక్తి ప్రతినిధి, నవంబర్ 14 :



బాలల దినోత్సవాన్ని శుక్రవారం గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్, హైదరాబాదు విద్యార్థులు వినూత్నంగా నిర్వహించారు. ప్రతి యేడాది మాదిరే, ఈసారి కూడా 'జాయ్ ఆఫ్ గివింగ్' (ఇవ్వడంలోనే ఆనందం) పేరిట నల్లగండ్లలోని శిశు మంగళ్ అనాథాశ్రమ విద్యార్థులను గీతంకు ఆహ్వానించి, రోజంతా వారిలో ఉత్సాహాన్ని నింపడమే గాక, దయ, దాతృత్వ స్ఫూర్తిని చాటారు. వారిలో కొంగొత్త ఆశలను రేకెత్తించారు.శిశు మంగళ్ కు చెందిన ముగ్గురు స్వచ్ఛంద సేవకుల నేతృత్వంలోని 47 మంది బాలలను ఎంబీఏ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు గీతం ప్రాంగణానికి ఆహ్వానించి, వారితో కలిసి ఆనందంగా, వినోదాత్మకంగా, అర్థవంతమైన కార్యక్రమాలతో రోజంతా గడిపారు. ఆ బాలల కోసం ఆకర్షణీయమైన ఆటలు, సాంస్కృతిక కార్యక్రమాలను ఎంబీఏ విద్యార్థులు నిర్వహించారు. తాము అనాథలం కాదు, మనకోసం ఎందరో ఉన్నారనే ఐక్యతా వాతావరణాన్ని సృష్టించడమే గాక, వివిధ పోటీలలో గెలుపొందిన వారందరికీ ఆకట్టుకునే బహుమతులను పంపిణీ చేశారు.ఈ కార్యక్రమం ఎంబీఏ విద్యార్థులలో సానుభూతి, సామాజిక బాధ్యత, నాయకత్వం యొక్క విలువలను పెంపొందించడానికి తోడ్పడింది. వారు తమ ఆదర్శనీయమైన పనులు, సంభాషణల ద్వారా సానుకూలతను ప్రేరేపించడమే గాక, సమాజాభివృద్ధికి గీతం యొక్క నిరంతర నిబద్ధతను పునరుద్ఘాటించారు.ఈ కార్యక్రమ ప్రారంభోత్సవంలో గీతం హైదరాబాదు అదనపు ఉపకులపతి ప్రొఫెసర్ డీ.ఎస్.రావుబీ రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మబీ బీ-స్కూల్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా పాల్గొని, విద్యార్థుల చొరవను ప్రశంసించారు. ఇంత మంచి సంప్రదాయాన్ని నిర్విఘ్నంగా కొనసాగిస్తున్నందుకు అభినందించారు. కీలకమైన నాయకత్వ లక్షణం- కరుణ యొక్క ప్రాముఖ్యతను వారు ప్రముఖంగా ప్రస్తావించారు.ఈ 'జాయ్ ఆఫ్ గివింగ్' కార్యక్రమాన్ని జీఎస్ బీ అధ్యాపకురాలు డాక్టర్ నాగప్రియ, విద్యార్థి నిర్వాహకులు దీక్ష, షేక్ అంజుమాతో కలిసి సమన్వయం చేశారు.బాలల సంక్షేమం, విద్య పట్ల గీతం యొక్క అచంచలమైన అంకితభావంలో భాగంగా, శిశు మంగళ్ బాలలందరికీ స్వెట్టర్లు, స్టేషనరీ, టీ-షర్టులను పంపిణీ చేశారు. దీనికి అదనంగా, విద్యార్థులు, అధ్యాపకులు కలిసి సమిష్టిగా లక్ష రూపాయలను విరాళంగా అందించారు. ఇది అర్థవంతమైన, స్థిరమైన సమాజ కార్యక్రమాల ద్వారా యువ జీవితాలను సానుకూలంగా ప్రభావితం చేయాలనే గీతం లక్ష్యాన్ని ప్రతిబింబిస్తోంది.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ కుమార్ యాదవ్

## భారీ మెజార్టీతో గెలవడంతో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో సంబురాలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 14: జూబ్లీహిల్స్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించినందున కామారెడ్డి కాంగ్రెస్ కార్యకర్తలు జిల్లా కార్యాలయంలో బాణాసంచా కాలుస్తూ, కాంగ్రెస్ పార్టీ శ్రేణులు సంబురాలు నిర్వహించాయి. పెద్ద ఎత్తున నేతలు, కార్యకర్తలు అక్కడికి చేరుకుని పరస్పరం మిఠాయిలు పంచుకున్నారు.



ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ,జూబ్లీహిల్స్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించింది. ఇందుకు కాంగ్రెస్ పార్టీ గత రెండు సంవత్సరాలుగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ప్రజలు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయడం జరిగినది, అదేవిధంగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ప్రభుత్వ సలహాదారులు మహ్మద్ అలీ షబ్బీర్ మైనార్టీ వర్గాలను గాని బీసీలను గాని ఎస్సీలను గాని ఎస్టీలను గాని అన్ని వర్గాల ప్రజలను ఆకర్షించే విధంగా ఎన్నికల ప్రచారం నిర్వహించి పార్టీగెలుపుకు దోహదపడడం జరిగినది. స్థానిక సంస్థ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ బలపరిచిన అభ్యర్థులు విజయం సాధించడం ఖాయమని అన్నారు.

ఈ కార్యక్రమంలో గూడెం శ్రీనివాస్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు గోనే శ్రీనివాస్, నియోజకవర్గ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు గుడుగుల శ్రీనివాస్, పంపరి లక్ష్మణ్ మాజీ కౌన్సిలర్లు కాళ్ళగణేష్, అంజద్, లడ్డు, రాజా గౌడ్, గోసంగి సత్యం, అతిక్, ఖదీర్, జమీల్ కిరణ్, కైఫ్, భూమని బాలరాజు, సిద్దిఖ్, రాజిరెడ్డి రఫిక్, సాజిద్, లక్క పత్తిని గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

# వాసన.. కంపు వాసన.!

## చేపల మార్కెట్ నిర్వాహకుల ఇష్టారీతి

వేములవాడ, నవంబర్ 14(భారత శక్తి) : దక్షిణ కాశీగా పేరుగాంచిన వేములవాడ శ్రీ రాజేశ్వర ఆలయం నిత్యం భక్తులతో రద్దీగా ఉంటుంది, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుండి రాజన్న దర్శనానికి రోజుకు వేలాదిమంది భక్తులు ప్రధాన రహదారి గుండా వస్తుంటారు, వీరితోపాటు స్థానికులతో ప్రధాన రహదారి ప్రయాణికులతో నిత్యం రద్దీగా ఉంటుంది,మెయిన్ రహదారి బ్రిడ్జి వద్ద చేపల మార్కెట్ నిర్వాకం చిరు వ్యాపారులకు, ప్రయాణికులకు,భక్తులకు ఆగ్రహానికి గురిచేస్తుంది, బ్రిడ్జి నుండి వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.చేపల వ్యర్థాలను రాత్రిపూట బ్రిడ్జి కల్వర్టుల కింద పారేసి వెళ్తున్నారు. మరుసటి రోజు ఆ వ్యర్థాలు కుళ్లిపోయి బ్రిడ్జి కల్వర్టు నుంచి దుర్వాసన వెదజల్లుతుంది.దీంతో చిరు వ్యాపారులు,ముక్కు మూసుకొని వ్యాపారాలు చేయలేక కంపు వాసన వెదజల్లడంతో అనారోగ్యం పాలవుతున్నారు, భక్తులకు, ప్రయాణికులు బ్రిడ్జి నుండి అటు వైపు వెళ్లే రహదారిపై వస్తున్న దుర్వాసనను భరించలేక ముక్కు మూసుకోని వెళ్తున్నారు. మున్సిపల్ ట్రాక్టర్ వాహనాలు అటువైపున రాకపోవడంతో చేపల మార్కెట్ నిర్వాహకులు అర్ధరాత్రి చేపల వ్యర్థాలను రోడ్డు పక్కనే బ్రిడ్జి కింద పారేస్తున్నారు. గత రెండు నెలల నుండి వాసనతో కంపు కొట్టడం పట్ల వ్యాపారస్తులు, భక్తులు తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో పారిశుధ్య లోపం రోగాల వడి ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి రోడ్డుపైనే వ్యర్థాలు వేసే చేపల మార్కెట్ నిర్వాహకులపై చర్యలు తీసుకొని బ్రిడ్జి కింద వ్యర్థ ప్రదర్థాలను తీసివేసి శుభ్రం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

# మహిళల భద్రత కోసం ముందస్తు భద్రతా చర్యలు - నిర్మల్ షీ టీమ్ విస్తృత పహారా

## -పార్కులు నుంచి కాలేజీల వరకు ప్రత్యేక నిఘా

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 14 (భారత శక్తి): మహిళల రక్షణ కొరకు నిర్మల్ పోలీసు ఎల్లప్పుడూ ముందుంటుందని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల అన్నారు.




నిర్మల్ జిల్లాలో మహిళలపై జరిగే నేరాలను అరికట్టడం, మహిళలు అధికంగా ఉండే ప్రదేశాల్లో భద్రతను బలోపేతం చేయడం లక్ష్యంగా నిర్మల్ షీ టీమ్ బృందం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తోంది.జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రదేశాల్లో మహిళలు, బాలికలపై ఎలాంటి నేరాలు జరగకుండా ముందస్తు చర్యల్లో భాగంగా షీ టీమ్ బృందాలు పార్కులు, స్కూళ్లు, కాలేజీలు, దేవాలయాలు, మార్కెట్లు, బస్ స్టాండ్లు, పబ్లిక్ ప్లేసులు వంటి ప్రాంతాల్లో విస్తృత పర్యటనలు నిర్వహిస్తున్నాయి. ఈ సందర్శనల్లో భాగంగా అవగాహన కార్యక్రమాలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ మహిళల భద్రత, సైబర్ సెక్యూరిటీ, ఈవ్‌టీజింగ్ నివారణ చర్యలపై ప్రజలకు సూచనలు చేస్తున్నారు.అకతాయిలను నియంత్రించడానికి షీ టీమ్ ప్రత్యేక పహారా కొనసాగిస్తూ, అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి,వెంటనే అదుపులోకి తీసుకొని మైనర్ ఆకతాయిలయితే,తల్లిదండ్రుల సమక్షంలో కౌన్సిలింగ్ నిర్వహిస్తారు.మేజర్లపై మాత్రం సంబంధిత చట్టాల ప్రకారం పెట్టీ కేసులు నమోదు చేసి తగిన చర్యలు తీసుకుంటోంది.ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ నిర్మల్ జిల్లాలో మహిళల భద్రత ఎల్లప్పుడూ మా తొలి ప్రాధాన్యం ఉంటుంది.మహిళల రక్షణ కోసం షీ టీమ్ ఎప్పుడూ అలర్ట్‌గా పనిచేస్తుంది. మహిళలపై వేధింపులు, అనుమానాస్పద వ్యక్తులు లేదా ఆకతాయిలు ఎక్కడైన గమనించిన వెంటనే డయల్ 100 లేదా షీ టీమ్ హెల్ప్‌లైన్ 87126 59550 కు సమాచారం ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

# గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి

## - జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్

## - ఘనంగా ప్రారంభమైన గ్రంథాలయ వారోత్సవాలు

సంగారెడ్డి, భారతశక్తి ప్రతినిధి, నవంబర్ 14:



బాలల దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా శాఖ కేంద్ర గ్రంథాలయంలో 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలను శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన జవహర్లాల్ నెహ్రూ డాక్టర్ ఎస్ ఆర్ రంగనాథన్ సరస్వతి దేవి చిత్రపటాలకు సంస్థ అధ్యక్షులు సిబ్బందితో కలిసి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గ్రంధాలయాలు మంచి స్థితిలో ఉన్నాయని వాటిని పాఠకులు వినియోగించుకోవాలని సూచించారు. పాఠకులకు అందుబాటులో ప్రతి పుస్తకం గ్రంథాలయంలో లభిస్తుందన్నారు. విద్య ఉద్యోగాలకు సంబంధించిన అన్ని పుస్తకాలు కేవలం గంధాలయంలోనే లభిస్తాయన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఒక మంచి పుస్తకం మంచి మిత్రుడితో సమానమని కొనియాడారు. పాఠకుల ఆసక్తులకు మేరకు కావాలనుకున్న పుస్తకాలను అందుబాటులో ఉంచుతామన్నారు. కార్యక్రమంలో రచయిత రాజశేఖర్ రెడ్డి రచించిన పర్సనాలిటీ డెవలప్మెంట్ పుస్తకాన్ని గ్రంథాలయానికి బహుకరించారు. ఈ కార్యక్రమంలో బాలుర ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు నరేంద్ర సాహితీ పాఠశాల బాలికలు గ్రంథాలయ పాఠకులు సిబ్బంది శ్రీనివాస్ ప్రశాంత్ శోభారాణి వరలక్ష్మి సావిత్రి కృష్ణమూర్తి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

# మహబూబాబాద్ ఐయంఏ అధ్యక్షులుగా డాక్టర్ బానోత్ జగదీశ్వర్

ఖమ్మం బ్యూరో, భారత శక్తి, నవంబర్ 14: మహబూబాబాద్ ఐయంఏ (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) నూతన అధ్యక్షునిగా ప్రముఖ పిల్లలవైద్యనిపుణులు, జిల్లా ఆసుపత్రి ఆర్ఎంఓ డాక్టర్ జగదీశ్వర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మహబూబాబాద్ జిల్లాకేంద్రంలోని ఐయంఏ హాల్ లో జరిగిన ఈ ఎన్నికలకు ఎన్నికలఅధికారిగా డాక్టర్ జె ప్రమోద్ రెడ్డి వ్యవహరించారు. ఏకగ్రీవంగా ముగిసిన ఈ ఎన్నికలలో డాక్టర్ బానోత్ జగదీశ్వర్ అధ్యక్షునిగా, డాక్టర్ సందీప్ దేవ్ కార్యదర్శిగా, డాక్టర్ ఎ అర్జున్ కోశాధికారిగా, డాక్టర్ సూర్యకుమారి మహిళా ప్రతినిధి గా ఎన్నికయ్యారు.

# బ్లూ కోల్ట్స్ లో పురుషులతో రాణిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు

## -ఆత్మస్థైర్యంతో ముందుకు సాగుతున్న మహిళా పోలీసులు

## -పోలీసులకు సహకరిస్తున్న అన్నీ వర్గాల ప్రజలు

## సిపి గౌష్ ఆలం

కరీంనగర్, నవంబర్14(భారతశక్తి ప్రతినిధి):



నేరాల నియంత్రణ, సమాచారం అందిన వెంటనే నేరస్థలానికి చేరుకొని సత్వర సేవలందించడం కోసం కరీంనగర్ కమీషనరేట్ లో 2016 డిసెంబర్ 04 వ తేదీన హైదరాబాద్ పోలీసు కమీషనరేట్ తరహా బ్లూ కోల్ట్స్ సేవలు కరీంనగర్ పోలీసు కమీషనరేట్ వ్యాప్తంగా అప్పటి పోలీసు కమీషనర్ వి. బి. కమలాసన్ రెడ్డి ప్రారంభించారు. ఈ విభాగం ఏర్పాటుకు ముందు ఎక్కడైనా నేరం జరిగితే , పోలీసులకు సమాచారం తెలిసి వారు సంఘటనా స్థలానికి చేరుకోవడానికి అరగంట నుండి గంట సమయం పట్టేది. ఈ సమస్యను నివారించి, ప్రజలకు అత్యవసర సమయాల్లో, క్షణాల్లో నేరాలు జరిగిన సంఘటనా స్థలానికి పోలీసులు చేరుకునేలా బ్లూ కోల్ట్స్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చారు. అయితే ఈ సేవలు ప్రారంభించి పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చిన అనంతరం పోలీసులు అత్యవసర సమయాల్లో బాధితులను చేరుకునే సమయము దూరాన్ని బట్టి 05 నుండి 10 నిమిషాలకు తగ్గింది. ప్రస్తుతం కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా బ్లూ కోల్ట్స్ పోలీసులు స్పందించి, సంఘటన స్థలానికి చేరుకునే సమయం సగటున 07 నిమిషాలుగా వుంది.

ఈ బ్లూ కోల్ట్స్ విభాగానికి చెందిన పోలీసులు తమ విధుల్లో భాగంగా వారి వారి పరిధిల్లోని అన్ని వర్గాల ప్రజలను సమావేశపరిచి (కమ్యూనిటీ మీటింగ్స్) ప్రస్తుతం సమాజంలో రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలు వాటి బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఒకవేళ నేరానికి గురైతే వెంటనే మొదటి గంటలోపే (గోల్డెన్ అవర్ లో) 1930 కి ఫోన్ చేసి తస్కరించబడిన సొమ్మును ఫ్రీజ్ చేసేలా చర్యలు తీసుకునే అంశాలతో పాటు, మాదక ద్రవ్యాల దుర్వినియోగం వలన కలిగే నష్టాలూ , రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నియమాలు తప్పనిసరిగా పాటించడం, మద్యం సేవించి వాహనాలు నడపడం వలన కలిగే నష్టాలూ, మహిళల భద్రత, ఒంటరిగా ప్రయాణ సమయాలలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, సోషల్ మీడియా వేదికగా జరిగే మోసాలపై, నేరాల నియంత్రణ కొరకు పోలీసులు తీసుకుంటున్న చర్యలు మరియు కమీషనరేట్ వ్యాప్తంగా పోలీసులు తీసుకుంటున్న సంస్కరణల గురించి ప్రజలకు వివరించడం జరుగుతుంది. అంతేకాకుండా నేరాల నిరయంత్రణ మరియు ఛేదనలో సీసీ కెమెరాల ప్రాముఖ్యతను స్థానిక ప్రజలకు వివరించడం, వాటి ఏర్పాటుకు కృషి చేస్తారు.


గతంతో పోలిస్తే పోలీసుశాఖలో మహిళా పోలీసుల సంఖ్య క్రమంగా పెరగడం జరిగింది. అందుకుగాను మహిళా పోలీసుల వృత్తి నైపుణ్యం పెంపొందించేందుకుగాను పోలీసు స్టేషన్లో నిర్వహించే విధులతోపాటూ, క్షేత్రస్థాయిలో సైతం విధులు నిర్వహించాలని ప్రస్తుత పోలీసు కమీషనర్ గౌష్ ఆలం నిర్ణయించారు. అందులో భాగంగా గత సెప్టెంబర్ నెల 26వ తేదీ నుండి కమీషనరేట్ వ్యాప్తంగా మహిళా పోలీసులను బ్లూ కోల్ట్స్ విధుల్లో వినియోగించే కార్యక్రమాన్ని సీపీ అధికారికంగా ప్రారంభించారు. మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసులు విధుల్లో భాగంగా నిర్వహిస్తున్న స్థానిక సమావేశాలు సత్ఫలితాలిస్తున్నవని, అన్నీ వర్గాల ప్రజలు పోలీసులకు సహకరిస్తున్నారని తెలిపారు. మహిళా పోలీసు కానిస్టేబుళ్లు, పురుష పోలీసులతో సమానంగా రాణిస్తున్నారన్నారు. పాయింట్ బుక్ చెకింగ్స్ , రౌడీ షీటర్లు, హిస్టరీ షీటర్ల కదలికలపై ఆరాతీయడం, విలేజ్ పోలీసు అధికారిణిగా రాణించడం, గ్రామ పంచాయితీల వద్ద, పబ్లిక్ ప్లేసుల్లో పోలీసుల ద్వారా పొందే సేవలను గోడపత్రికలు అతికించి స్థానిక ప్రజలకు తెలియజేయడం చేస్తున్నారని సీపీ తెలిపారు.

సీపీఆర్ విధానం పై శిక్షణ

ఇటీవల వయసుతో సంబంధం లేకుండా గుండెపోటుకు గురై మరణిస్తున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు నిత్యం చూస్తూనే వున్నాము. అది దృష్టిలో ఉంచుకుని కమీషనరేట్ లో పనిచేస్తున్న మహిళా పోలీసు అధికారులు, సిబ్బంది అందరికీ గత నెల సెప్టెంబర్ 26వ తేదీన డి. ఎం.హెచ్ . ఓ. ఆధ్వర్యంలో ప్రభుత్వ వైద్యుల సమక్షంలో కమీషనరేట్ కేంద్రంలోని అస్త్ర కన్వెన్షన్ హాలు నందు అకస్మాత్తుగా గుండెపోటు సంభవించిన వ్యక్తికి ప్రథమ చికిత్సలో భాగంగా సీపీఆర్ నిర్వహించే విధానంపై పూర్తి స్థాయిలో శిక్షణ అందించామని సీపీ తెలిపారు. క్షేత్ర స్థాయిలో విధులు నిర్వహించే మహిళా బ్లూ కోల్ట్స్ పోలీసులు పూర్తి స్థాయిలో సుశిక్షితులుగా తీర్చిదిద్ది విధుల్లో చేర్చామని సీపీ తెలిపారు. అటువంటి సంఘటన ఎదురైతే బాధితులకు సీపీఆర్ నిర్వహించి ప్రాణాలను కాపాడే నైపుణ్యం వారికీ ఉందని సీపీ ఆశాభావం వ్యక్తం చేసారు. రానున్న రోజుల్లో కమీషనరేట్ ప్రజలకు మరింత నాణ్యమైన పోలీసు సేవలు అందించేందుకు మరింత కృషి చేస్తామన్నారు.

# సస్య తల్లి పిల్లల హాస్పిటల్ ను ప్రారంభించిన సీనియర్ వైద్యులు సుధాకర్ రెడ్డి

ఉమ్మడి వరంగల్ బ్యూరో(భారత శక్తి)నవంబర్14:



హనుమకొండ బాలసముద్రం లోని రాడార్ డైయాగ్నస్టిక్స్ పక్కన నూతనంగా నిర్వాహకులు తండా రంజిత్ కుమార్, గీతాంజలి దంపతులు ఏర్పాటు చేసిన సస్య తల్లి పిల్లల హాస్పిటల్ ను ముఖ్య అతిథిగా విచ్చేసిన సీనియర్ వైద్యులు సుధాకర్ రెడ్డి రిబ్బన్ కట్ చేసి శుక్రవారం ప్రారంభించారు.ఈ సందర్భంగా చిన్న పిల్లల వైద్యులు డాక్టర్లు చెరుకు నవీన్ రెడ్డి,ప్రియదర్శిని రెడ్డి మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు సుఖ ప్రసవాల కోసం సస్య తల్లి పిల్లల హాస్పిటల్ ను సంప్రదించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డాక్టర్లు,బంధుమిత్రులు, సిబ్బంది,తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేయాలి: జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి

కడప, నవంబర్ 14(భారత శక్తి) : జిల్లాలో సహకార సంఘాలను బలోపేతం చేయడంలో మరింత కృషి చేయాలని జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సభ్యులులను జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి ఆదేశించారు.

కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాలులో జిల్లా కలెక్టర్ డా.శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జిల్లా సహకార అభివృద్ధి కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ సహకార బ్యాంకుల్లో స్వయం సహాయక సంఘాల ఆర్థిక అభివృద్ధికి సహకారం అందించాలన్నారు. రైతు సంఘాలకు అన్ని విధాలా ప్రోత్సాహం అందించాలన్నారు. జిల్లాలో డిసిసిబి అనుబంధంగా నడుస్తున్న ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు ప్రాజెక్ట్ యొక్క కంప్యూటరైజేషన్, ఎంపీఎఫ్ సి గోడౌన్ల నిర్మాణం, కామన్ సర్వీసు సెంటర్ల నిర్వహణ, పెట్రోల్ ఔట్ లెట్స్ నిర్వహణ, ప్రధాన మంత్రి భారతీయ జన ఔషధీ కేంద్రాల (పిఎంబీజే ఏకే)నిర్వహణపై ప్రోత్సాహం తదితర అంశాల్లో జిల్లా సహకార కేంద్రం నిర్వహణ, అభివృద్ధి పురోగతిపై సమీక్షించి జిల్లా కలెక్టర్ పలు సూచనలిచ్చారు.



అనంతరం అఖిలభారత సహకార వారోత్సవాలకు సంబంధించిన పోస్టర్ ను జిల్లా కలెక్టర్ డిసిబి అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో డీసీవో వెంకట సుబ్బయ్య, డిసిబి సీఈవో రాజామణి, నాబార్డు ఎజిఎం విజయవిహారీ, డీసీవో సుభాషిణి, డిపివో రాజ్యలక్ష్మి, జిల్లా వెటర్నరీ, మార్కెటింగ్, ఆప్కాబ్ అధికారులు, బ్యాంకు అధికారులు అనుబంధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# టెంపుల్ టూరిజం,ఎకో టూరిజంపై ప్రత్యేక దృష్టి: జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

వైయస్సార్ కడప జిల్లా, నవంబర్ 14(భారత శక్తి) : వచ్చే సం. జనవరి నెలలో గండికోట ఉత్సవాలు- 2025 నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు.

స్థానిక కలెక్టరేట్ లోని బోర్డు మీటింగ్ హాలులో జిల్లా టూరిజం కమిటీ జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తో పాటు జెసి అదితి సింగ్,డి ఎఫ్ ఓ వినీత్ కుమార్ లు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ గండి కోట ఉత్సవాలను జనవరి నెలలో వారం రోజులపాటు నిర్వహించేందుకు ప్రణాళికల రూపొందించాలని అధికారులను ఆదేశించారు.ఇందులో మొదటి నాలుగు రోజులు ప్రమోషనల్ ఈవెంట్స్ నిర్వహించాలని మిగతా మూడు రోజులు ముఖ్యమైన ఈవెంట్స్ నిర్వహించాలని సూచించారు. ముఖ్యమైన ఈవెంట్లలో భాగంగా నిర్వహించే ప్రదర్శనల్లో జాతీయ స్థాయిలో పేరు పొందిన మ్యూజిక్,డాన్స్ బృందాలను ఆహ్వానించాలన్నారు.

గండికోట ఉత్సవాల్లో భాగంగా సెల్ఫ్ హెల్ప్ గ్రూపు సంఘాలతో కడప జిల్లా స్ట్రీట్ ఫుడ్ ఏర్పాటు చేసే విధంగా ప్లాన్ చేయాలన్నారు. అలాగే ఎగ్జిబిషన్ ఏర్పాటుకు ప్రణాళికలు రూపొందించాలన్నారు.గండికోట ఉత్సవాల నేపథ్యంలో గండికోట ప్రాంత పరిసర ప్రాంతాలను విద్యుత్ లైట్లతో అలంకరించాలని అన్నారు. మౌలిక వసతులు టాయిలెట్స్ పారిశుద్ధ్య అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అలాగే గండికోట టూరిజంకు ప్రత్యేకంగా ఆహ్వానం బోర్డులను శాశ్వత ప్రాతిపదిక ఏర్పాటు చేయాలన్నారు. మైలవరం బోటింగ్,



అడ్వెంచర్ ఆక్టివిటీస్ పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు.అలాగే గండికోట చరిత్రపై సురభి నాటక బృందంతో ప్రత్యేకంగా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు సన్నాహాలు చేయాలన్నారు.గండికోట ఉత్సవాలను ప్రమోట్ చేసే విధంగా బైక్,సైక్లింగ్ వంటి ఈవెంట్లతో పాటు బెంగళూరులో ప్రమోషనల్ ఈవెంట్ కు ప్రణాళికలు చేయాలన్నారు.

జిల్లాను పర్యాటక హబ్ గా తీర్చిదిద్దే విధంగా కృషి చేయాలని అధికారులకు సూచించారు.టెంపుల్ టూరిజం, ఎకో టూరిజం కి మంచి అవకాశాలున్నాయని, ఈ నేపథ్యంలో పర్యాటకులకు మధురానుభూతులు మిగిల్చేలా పర్యాటక టూరిజంను అభివృద్ధి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు,కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి, జమ్మలమడుగు ఆర్డీవో సాయి శ్రీ, జిల్లా పర్యాటకశాఖ అధికారి సురేష్, డిఆర్డిఏ పిడి రాజ్యలక్ష్మి, కిరణ్ కుమార్,డిఆర్ఓ విశ్వేశ్వర నాయుడు ఇతర జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# జిల్లా ప్రజలకు త్వరలో అధునాతన విమానయాన సేవలు: కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి

కడప, నవంబర్ 14(భారత శక్తి) : జిల్లా ప్రజలకు త్వరలో అధునాతన విమానయాన సర్వీసులు చేరువ కానున్నాయని కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి పేర్కొన్నారు.

శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లోని విజిఆర్ఎస్ హాలులో ఎయిర్ పోర్ట్ అడ్వైజరీ కమిటీ మీటింగ్ జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా కడప పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్ రెడ్డి తోపాటు జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి, జిల్లా ఎస్పీ షెల్కె నచికేత్ విశ్వనాథ్, కేఎంసి కమిషనర్ మనోజ్ రెడ్డి, ఎయిర్ పోర్ట్ డైరెక్టర్ సుజిత్ కుమార్ పోదార్ లు హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి కడప ఎయిర్ పోర్ట్ అభివృద్ధి పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఎయిర్ పోర్టు నూతన టర్మినల్ బిల్డింగ్ కు నూతన రహదారుల ఏర్పాటు, అధునాతన స్నాక్ బార్ %ఠ% ఫుడ్ ఫెసిలిటీ, ఎయిర్ పోర్ట్ వద్ద బస్ స్టాప్ ఏర్పాటు, మెరుగైన కార్గో సర్వీసులు, వాణిజ్య పరంగా చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ఫ్లయింగ్ ట్రైనింగ్ ఆర్గనైజేషన్ (ఎఫ్.టీ.ఓ.) ఎయిర్ క్రాఫ్ట్ మెయింటెనెన్స్, రిపేర్ %ఠ% ఓవరాల్ (ఎం.ఆర్.ఓ.) తదితర అంశాలపై ఎయిరోడ్రమ్ చైర్మన్, కమిటీ సభ్యులతో కలిసి సమీక్షించారు.

ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ కడప విమానాశ్రయ అభివృద్ధిలో భాగంగా గతంలో చేసిన ప్రతిపాదన ఆమోదం మేరకు ఎయిర్ పోర్ట్ విస్తరణకు 75 ఎకరాల భూసేకరణ, నైట్ ల్యాండింగ్ కోసం సదుపాయాలు, న్యూ టెర్మినల్ బిల్డింగ్ ప్రజలకు అందుబాటులోకి రానున్నాయని ఈ విషయం జిల్లా ప్రజలకు శుభపరిణామం అన్నారు. అంతే కాకుండా ప్రయాణీకుల అవసరాలను ఎప్పటికప్పుడు గుర్తించేలా ఎయిర్ పోర్టులో ఒక ప్యాసింజర్స్ సలహాల బాక్సును ఏర్పాటు చేయాలని సూచించారు. ఎయిర్ పోర్టు ఎంట్రన్స్ వద్ద బస్ స్టాప్ ను ఏర్పాటు చేయాలని కమిటీ దృష్టికి తెచ్చారు.

అంతేకాకుండా ఎయిర్ పోర్టు ప్రధాన ద్వారం నుండి టెర్మినల్ భవనం వరకు ప్రయాణీకులను చేర్చేందుకు ఎంపీ నిధుల ద్వారా ఆరు సీట్ల బ్యాటరీ కార్ ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

ప్రస్తుతం హైదరాబాద్ వెళ్ళాలంటే ఎప్పుడూ టికెట్స్ ఫుల్ అవుతున్న సందర్భాలు ఉన్నాయని ఆ పరిస్థితిని అధిగమించేందుకు అదనంగా ఇంకో విమాన సర్వీసును కూడా అందించేందుకు ఇండిగో ఎయిర్ లైన్స్, కేంద్ర ప్రభుత్వాన్ని ఎయిర్ పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా వారిని కూడా కోరుతామన్నారు.

జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పౌర విమానయాన సేవారంగంలో ప్రయాణీకుల అనుభవాలు, సౌకర్యాలను దృష్టిలో ఉంచుకుని భారతీయ విమానాశ్రయాలను ఉన్నత ప్రమాణాలతో అంతర్జాతీయ స్థాయికి



దీటుగా అభివృద్ధి చేస్తోందన్నారు. ఆధునిక జీవనశైలికి అనుగుణంగా విమానాశ్రయాల్లో ప్రయాణీకులకు సౌకర్యాలను మెరుగు పరుస్తోందన్నారు. ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ అభివృద్ధి పనుల్లో భాగంగా.. ఎయిర్ పోర్ట్ అథారిటీ, ఆర్%ఠ%బి, నేషనల్ హైవే, పోలీస్ శాఖలు జాయింట్ కమిటీగా ఏర్పాటై.. అందుకు సంబంధించిన రోడ్డు, రవాణా వ్యవస్థ తదితర మౌలిక సదుపాయాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తుందన్నారు.

మౌలిక సదుపాయాల్లో భాగంగా ప్రధానంగా మెరుగైన రోడ్లు, నిరంతర నీటి సదుపాయాలను కల్పించాలన్నారు. ఏపీఎస్పీఎస్ లో భాగంగా కొరత ఉన్న భద్రతా సిబ్బందిని కూడా పూరించేందుకు సహకారం అందిస్తామన్నారు. ఏరో డ్రమ్ లో భద్రతా వాహనాల ఏర్పాటు కోసం రెవెన్యూ, కడప మున్సిపల్ కార్పోరేషన్, పోలీసు శాఖల సమన్వయం నిర్ణయంతో ముందుకు సాగడం జరుగుతుందన్నారు.

ఎయిర్ పోర్ట్ పరిసరాలను స్వచ్ఛంగా, పరిశుభ్రంగా, ఆహ్లాదకరంగా ఉంచడంలో కడప మున్సిపల్ కమిషనర్, పంచాయతీ రాజ్ శాఖలు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలన్నారు. ఎయిర్ పోర్ట్ నూతన టర్మినల్ భవన నిర్మాణ పనుల్లో భాగంగా పర్యావరణానికి ఎలాంటి అంతరాయం కలగకుండా ఏరో డ్రమ్ నిర్మాణ పనులను చేపట్టేందుకు సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. ఎయిర్ పోర్ట్ అభివృద్ధికి సంబంధించి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల తరపున, జిల్లా యంత్రాంగం తరపున పూర్తి స్థాయి సహాయ సహకారాలు అందిస్తామని జిల్లా కలెక్టర్ తెలిపారు.

జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ మాట్లాడుతూ ఎయిర్ పోర్టు పరిధిలో అన్ని రకాల భద్రతా చర్యలతో పాటు ఎయిర్ పోర్టు ఎదురుగా నేషనల్ హైవే మీద వాహనాల వేగాన్ని అరికట్టే చర్యలను కూడా చేపడతామని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎయిర్ పోర్ట్ డిజిఎం లు రాజేశ్వర్, తిరుమల మురగన్, ఆపరేషన్ ఇంచార్జ్ దామోదర్, సభ్యులు, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉదయించే కిరణాలు బాలలు

ఉదయించే కిరణాలు బాలలు
బడికి వెలుగులు బాలలు
చదువుల తల్లి బిడ్డలు
చిరునవ్వుతో చిందులేస్తుండే బాలలు
సంతోషానికి మారుపేరు బాలలు!!

ప్రగతికి బాటలు బాలలు
భరతమాత ముద్దుబిడ్డలు
ఎదుగుతున్న పిల్లలు
భావితరానికి వెలుగు దివ్వెలు!!
బాలలు బంగారు కిరణాలు
అవనిలో వెలసిన చిరు మొగ్గలు
స్వచ్ఛమైన మనసుకు చిరునామా
బంగారు భవితకు పునాదులు
చిరునవ్వుకు చిరునామా బాలలు!!
బాలల దినోత్సవం, నవంబర్ 14 సందర్భంగా..

రచన:-
దేవులపల్లి రమేశ్
సిద్దిపేట,నంగునూర్
చరవాణి :-9963701294

# చాచాజీ పుట్టినరోజు పిల్లలకు పండుగ రోజు నేడే బాలల దినోత్సవం.

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో, నవంబర్ 14 (భారత శక్తి): బైంసా పట్టణంలోని ఆల్ఫోర్స్ పాఠశాలలో బాలల దినోత్సవం విద్యార్థులు ఘనంగా జరుపుకున్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు వివిధ వేషధారణలు ధరించి ఆట పాటలతో సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు మరియు విద్యార్థులు ఈ రోజు ఉపాధ్యాయుల పాత్ర పోషించారు.



ఈ సందర్భంగా చైర్మన్ నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఈ రోజు భారతదేశ తొలి ప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ వ్రాట్టి నరోజు ఆయనకు పిల్లలు అంటే మహా ఇష్టం ఆయన పుట్టిన రోజు ప్రతి సంవత్సరం విద్యార్థులు బాలల దినోత్సవంగా సెలబ్రేట్ చేసుకుంటారు మరియు జవహర్లాల్ నెహ్రూ గారు దేశం కోసం ఎంతో సేవ చేసి ఎన్నో త్యాగాలు చేసిన చాచాజీ పుట్టిన నవంబర్ 14 రోజు మనం జరుపుకోవడం చాలా ఆనంద దాయకం అని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులు విద్యార్థి విద్యార్థులు పాల్గొన్నారు.

# "రక్తపుటేరులు అవుతున్న రహదారులు"

## ప్రమాదకర మలుపులు.... డ్రైవర్ల నిర్లక్ష్యం.... అతివేగం.....నిద్రలేమి....జాగ్రత్తలు లేకపోవడం..

ఇలా కారణం ఏమైనా కానీ ఎన్నో ప్రాణాలను ప్రమాదాలు బలి గొంటున్నాయి. ఈ మధ్య కాలములో జరుగుతున్న రోడ్డు ప్రమాదాలు ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్నాయి.కారణాలు అనేకం అందులో కొన్ని "మన" నిర్లక్ష్యం వల్ల మాత్రమే జరుగుచున్న ప్రమాదాలు. వీటికి భాద్యులు ఎవరు? మన దేశంలో జరుగుచున్న మరణాల్లో అత్యధికం రోడ్డు ప్రమాదాల వల్ల అని లెక్కలు ఋజువు చేస్తున్నాయి.ఈ మధ్య జరిగిన ప్రమాదంలో ముగ్గురు అక్కాచెల్లెళ్ళు మరణించడం అనేది ఎంతో విచారకరం.ఆ ప్రమాదంలో మరణించిన కుటుంబాలకు ఆసరా ఎలా? ఎన్నో ఆశలు ఆశయాలతో సాఫ్ట్వేర్ ఉద్యోగములో ఉండి పిల్లలకు ఉజ్వల భవిష్యత్ ఇద్దామని భావించిన తల్లితండ్రుల మరణం లోటును పూడ్చేదెవరు.?ఒకప్పుడు ద్విచక్ర వాహనాలు మాత్రమే ప్రమాదాలకు గురిఅయ్యేవి.కానీ నేడు బస్సులు,రైళ్లు,విమానాలు,కార్లు ఇలా ఏ వాహనంలో వెళ్లిన క్షేమంగా తిరిగి వచ్చేవరకు కుటుంబ సభ్యులు ఆందోళన చేందుచున్నారంటే ప్రమాదాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.రోడ్డు ప్రమాదాలు జరగడానికి ఇదే కాకుండా మరెన్నో కారణాలు ఉన్నాయి.కాబట్టి రహదారి భద్రత పై అవగాహన కలిగి ఉండడం వల్ల ప్రమాదాలు జరగకుండా కొంతైనా నిరోధించవచ్చు. మైనర్ లకు వాహనాలు ఇచ్చినందుకు తల్లిదండ్రులపై కేసులు నమోదు కావడమే కాకుండా జైలుకు వెళ్లిన సందర్భాలు ఉన్నవి.ఇంత కఠిన నియమాలు ఉన్నాకూడా అక్కడక్కడ మైనర్లు వాహనాలు నడపడం,ప్రాణాలు కోల్పోవడం చూస్తేనే ఉన్నాము.భారత దేశములో జరుగుచున్న మరణాలను అధ్యయనం చేసిన సంస్థ గణాంకాల ఆధారంగా చూస్తే మనదేశంలో జరుగుచున్న మరణాల్లో ప్రథమ స్థానంలో రోడ్డు ప్రమాదంలో మరణించడం, రెండవ స్థానంలో ఆత్మహత్య లు చేసుకువడం వల్ల మరణాలు జరుగుచున్నట్టు ప్రకటించింది. 40 శాతం మరణాలు రోడ్డు ప్రమాదాల వల్లజరిగితే అందులో అధిక వేగం వల్ల అరవై శాతంకు పైగా మరణాలు జరుగుచున్నట్లు ప్రకటించారు. రోడ్డు ప్రమాదాలు అనేవి మానవ తప్పిదం వల్ల జరుగుచున్నవే. ప్రజలందరికీ అవగాహన కల్పించడం వల్ల రోడ్డు ప్రమాదాలను పూర్తిగా తగ్గించే అవకాశం ఉంది.రోడ్డును ఎప్పటికప్పుడు బాగు చేయడం, మూల మలుపుల వద్ద నెమ్మదిగా వెళ్ళేలా చూడడం వల్ల ప్రమాదాల సంఖ్య తగ్గేలా చూడవచ్చు.మన దేశంలో మోటారు వాహనాలు అధికంగా పెరగడం వల్ల రహదారి ప్రమాదాలు రోజురోజుకు అధికమవుచున్నాయి. వాహనాల సంఖ్య తో పాటు ప్రమాదాల సంఖ్య కూడా పెరగడం విచారకరం. నిత్యజీవితములో సులభంగా వెళ్ళడానికి, సౌకర్యవంతంగా వెళ్ళడానికి మరియు ప్రశాంతంగా వెళ్ళడానికి చిన్న వాహనాలు అవసరం. ప్రస్తుత పరిస్థితిని ఒక్కసారి గమనించినట్లయితే ప్రతి ఒక్క కుటుంబంలో ఇనీసం రెండు వాహనములు ఉన్నాయి. అందువలన రహదారులపై పెరిగిన రద్దీకి తగు విధంగా రోడ్ల నిర్మాణం జరగడంలేదు. నేటి వేగవంతమైన సమాజంలో మానవ తప్పిదం వలన, సరియైన రహదారులు లేకపోవడం వలన, వాహనములు కండీషన్లో లేకపోవడం వలన, అతి వేగంగా వాహనములు నడపడం వలన, డ్రైవర్ల నిర్లక్ష్యము, రహదారి వినియోగదారుల బాధ్యతలేని ప్రవర్తన, రహదారి నియమాలను, సిగ్నల్స్‌ను పాటించక పోవడం, అవగాహన లోపం వంటి కారణముల వలన రహదారి ప్రమాదములు ఎక్కువగా జరుగుతున్నాయి. అంతే కాక ఇసుకలారీలు, కంకర టిప్పర్ల అతివేగం ప్రమాదాలకు కారణం అయిన సందర్భాలు ఉన్నాయి.

రహదారి ప్రమాదాలు నివారణ ఎలా అని మనం ఆలోచించాల్సిన అవసరం ఉంది.కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ప్రమాదాలను కొంతవరకు తగ్గించిన వారం అవుతాము.వాహనాలు నడపడం అనేది ఒక వ్యక్తిగత అనుభవంగా కాక సామాజిక బాధ్యతగా వాహనము నడిపే వారందరూ గుర్తించాలి. రహదారి భద్రతా నియమాలను సక్రమంగా పాటించడము అతి ప్రధానమైన ప్రమాదాల నివారణకు ముఖ్యమైన మార్గం.కొన్ని సూచనలు, నియమాలు పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించవచ్చు.అతివేగం ప్రమాదకరం అనిగుర్తించాలి. ముందుగా బయలుదేరడం వల్ల నెమ్మదిగా వెళ్లిన క్షేమంగా గమ్యం చేరవచ్చని గుర్తించాలి. మద్యం సేవించి వాహనంనడుపకుండా చూసుకోవాలి.ద్విచక్ర వాహనం నడిపేటప్పుడు తప్పకుండా హెల్మెట్ పెట్టుకోవాలి. కారు నడిపేటప్పుడు సీటు బెల్టు తప్పకుండా పెట్టకోవాలి. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా మోటారు వాహనాలు నడుపరాదు. ట్రాఫిక్ నియమాలు పాటించడం వల్ల ప్రమాదాలు నివారించ గలుగుతాము. రోడ్డుపై సంభాషిస్తూ ట్రాఫిక్‌కు అవరోధం కల్పించకుండా ఉండాలి.సెల్ ఫోన్ మాట్లాడుతూ వాహనం నడపవద్దు.వాహనం నడిపేటప్పుడు పక్కవారితో సంభాషించవద్దు. ఇరుకు వంతెనల వద్ద ట్రాఫిక్‌ను గమనించి సహనంతో దాటాలి.కదులుతున్న వాహనం ఎక్కడం కానీ, దిగడం కానీ చేయవద్దు. మోటారు సైకిల్‌పై ఇద్దరికి మించి ప్రయాణించడం ప్రమాదకరం అని గుర్తించాలి.సరియైన సంకేతం ఇవ్వకుండా ఎడమ వైపు లేదా కుడి వైపునకు వాహనాలను తిప్పవద్దు.రాత్రి సమయంలో ఎదురుగా వాహనములు వచ్చినప్పుడు రోడ్డు మీద ప్రమాదాలకు డ్రైవర్ ఎంత కారకుడో పాదచారులు కూడా అంతే కారణమని గుర్తించి తగు జాగ్రత్తలతో నడవాలి.ముందు వెళ్ళే వాహన డ్రైవరు దారి ఇవ్వనిదే ఎడమ వైపు నుంచి దాటే ప్రయత్నం చేయవద్దు. తడిగా ఉన్న, ఆయిల్ పడి ఉన్న ఇసుక, దుమ్ము బురద ఉన్న రోడ్డుపై,రోడ్డు మరమ్మత్తులు జరుగుచున్నప్పుడు వేగంగా వెళ్లట ప్రమాదకరం అని గుర్తించాలి.రోడ్డు నిబంధనలు, సూచనలు డ్రైవర్లకు మాత్రమే కాదని,పాదాచారులు కూడా రోడ్డుకు ఇరువైపులా చూసీ వాహనములు రానప్పుడు, జీబ్రా లైన వద్ద రోడ్డును దాటాలి. రోడ్డుపై ఆటలాడటం, రోడ్డుపైకి అకస్మాత్తుగా రావడం ప్రమాదకరం. కాపలా లేని రైల్వే క్రాసింగ్ రెండు వైపులా చూసి ఏ రైలూ రావడం లేదని నిర్ధారించుకున్న తర్వాతనే రైల్వే లైన్ దాటాలి. సరియైన కండీషన్ లేని వాహనాలు నడుపరాదు. నిర్ధారిత స్థలంలోనే వాహనాలను పార్క్ చేయాలి. రోడ్డుపై రాత్రి వేళల్లో వాహనాన్ని నిలిపి వుంచినపుడు పార్కింగ్ లైట్లు తప్పని సరిగా వేయాలి. ప్రతి వాహనానికి ముందు వెనక రిఫ్లెక్టివ్ రేడియం స్టిక్కర్స్ అంటించాలి. వాహనాలలో ఎక్కువ శబ్దముతో పాటలు పెట్టకూడదు. వాహనం నడుపుచున్నప్పుడు రోడ్డుపై దృష్టి నిలుపాలి. అన్యమనస్కంగా ఉన్నప్పుడు లేదా నిద్రమత్తు కలిగినపుడు వాహనం నడపకూడదు. వాహనం మలుపు తిరుగుతున్నప్పుడు మరియునిలుపుతున్నప్పుడు సరియైన సంకేతాలు ఇవ్వడం వల్ల ప్రమాదాలు నివారించవచ్చు.ఇలా వాహనాల యజమానులు, డ్రైవర్లు రోడ్డు నిబంధనలను సక్రమంగా పాటించి రోడ్డు ప్రమాదాలు నివారించడానికి తోడ్పడవలసిన భాద్యత ఉంది.రోడ్డు మీద వెళుతుంటే కొందరు ఎడమ వైపు నుంచి వచ్చి ఓవర్ టేక్ చేస్తుంటారు. ఇది అమర్యాదకరమే కాకుండా ప్రమాదానికి కూడా కారణమవుతుంది. ఎవరైనా కుడి వైపు నుంచి మాత్రమే ఓవర్‌టేక్ చేయాలన్నది నియమం. ఇది పాటించడం అందరికీ సౌఖ్యం.అలాగే రోడ్డు మీద పాదచారులు నడవటం కోసం ఏర్పా టు చేసిన క్రాసింగ్ దగ్గర వాహనాల స్పీడ్‌ను తగ్గించు కోవాలి.అలా కాకుండా ఎవరికివాళ్ళు దూసుకుపోతా మంటే పాదచారుల పరిస్థితి ఏమిటి అని ఆలోచించి ట్రాఫిక్ రూల్స్ పాటించాలి. కనీస నియమాలు పాటించడం మన బాధ్యత అని గుర్తించి, ట్రాఫిక్ రూల్స్‌ని పాటిస్తు మీ ప్రాణాలు కాపాడుకుంటూ ఇతరుల ప్రాణాలు కూడా కాపాడండి.

"వేగం కన్నా ప్రాణం మిన్న""అతి వేగం ప్రమాదకరం"అని గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

గడప రఘుపతిరావు 9963499282

# “పిల్లలకు చేరలేకపోతున్న నీతి కథలు....”

## “నీతి కథలకు దూరమైన నేటి విద్యార్థులు

మనం పిల్లలకు చెప్పే నీతి కథలు వారికి జీవిత పాఠాలని నేర్పే గొప్ప సాధనాలు. ముఖ్యంగా చిన్న పిల్లల పసి హృదయాలలో మంచి నడవడిని గురించి, ఐకమత్యం గురించి , మంచి చెడులను గురించి, సమయస్ఫూర్తి గురించి, దేశభక్తి మరియు దైవభక్తి గురించి తెలియచేస్తూ,వారి హృదయములో చెరగని ముద్ర వేసేవి మనం చెప్పే “నీతి కథలు”.

పిల్లలకి కథలంటే ఎంతో ఇష్టం.''అనగనగా ఒక రాజు.....”అని మనం కథను చెప్పడం ప్రారంభించగానే వారు కథను వింటూ ఊహాలోకంలో విహరిస్తారు. కథలో అంతర్గతంగా నీతి దాగి ఉంటుంది. మనం చెప్పే కథనే ఎంతో ఆసక్తితో వినటం వలన, అందులోని నీతి వారి మనస్సును హత్తుకు పోయే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కథను వినేటప్పుడు వారు బయటి ప్రపంచాన్ని మర్చి పోతారు.వాళ్ళ ముఖకవళికలు గమనిస్తూ మనం కూడా మన హావభావాలు మార్చుతూ చెపుతున్నప్పుడు వారిలో కలిగే ఆనందం ను మనం వర్ణించలేము.

కానీ నేడు విశ్వవ్యాప్తంగా జరుగుచున్నదేమిటీ... అస్తవ్యస్తమైన ఉమ్మడి కుటుంబాలు, తీరిక లేని పనులు ,ప్రతి క్షణం డబ్బు కోసం ఆరాటం ఇలా జీవితం అంతా ఉరుకులు,పరుగులు. ఈ నేపథ్యంలో పిల్లలు కథలకు దూరం కాకూడదంటే, సాంస్కృతిక వారసత్వంగా వారికి అందుతున్న కథలు కోల్పోకూడదంటే ఆ భాధ్యతను మొదట తల్లిదండ్రులు తర్వాత పాఠశాలలోని ఉపాధ్యాయులు భుజస్కందాల పై వేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. అంటే పిల్లలను టెక్నాలజీ ప్రపంచం లోని ఉంచుతూ కూడా నీతి కథలపై ప్రత్యేక శ్రద్ధ కనబరచవలసిన అవసరం ఎంతైనా ఉంది..

“చూసే” కథనం కంటే, “వినే” కథనంలో పిల్లల “ఊహాశక్తి” ఎక్కువగా ఉంటుంది.తర్వాత ఏమౌతుందోననే కుతూహలం వారిని ఆలోచింపచేస్తుంది.. వారికి మరింతగా ఊహించే అవకాశం కలుగుతుంది. ఒకప్పటి ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఇప్పుడు లేదు. కుటుంబ వ్యవస్థలో పిల్లలకు కథలు చెప్పేంత తీరిక ఎవరికీ ఉండడం లేదు. పిల్లలకోసం కేటాయించే సమయం కూడా లెక్క ప్రకారం, రోజుకి ఇంత అని ఇస్తున్న తల్లిదండ్రులున్న ఈ హైటెక్ యుగంలో పిల్లలకు అందాల్సినంత ఆప్యాయత అందడం లేదు. ఉన్న తక్కువ సమయములో పిల్లలతో అనుబంధాన్ని పెంచేందుకు కథలు చెప్పడం ఎంతగానో తోడ్పడుతుంది. తల్లిదండ్రులు ముందుగా కథలను విని వాటిని తామే హవభావాలతో చెప్పగలిగితే పిల్లలతో కూడా మరింత అనుబంధం పెరుగుతుంది. అంటే పిల్లలకు, తల్లిదండ్రులకు కూడా ఒక ఆప్యాయతతో కూడిన అనుబంధం పెంచడానికి కథలు చెప్పడం తోడ్పడుతుంది.

విశ్వవ్యాప్తంగా ఖ్యాతి గాంచిన మన కథలలో పంచతంత్ర కథలు, పెదరాశి పెద్దమ్మ కథలు, మర్యాద రామన్న కథలు,భట్టి విక్రమార్క కథలు,భేతాల కథలు, కాశిమజిలి కథలు, జానపద కథలు, అంతులేని కథలు ముఖ్యమైనవి.

, ప్రాచీన భారతీయ కథకుల యొక్క సృజనాత్మకతకు, ఊహా శక్తి కి, కథాకథనంనకు సాటిలేని మేటి ఉదాహరణగా ఎన్నో కథలు నిలిచాయి. శతాబ్దాలుగా భారతీయ సాహిత్యంలో చిత్ర విచిత్ర పాత్రలతో, అద్భుత, ఉత్సాహ భరితంగా సాగే ఈ కథలు కేవలం కుతూహలాన్ని రేకెత్తించే ఉల్లాసభరితమైన కాలక్షేప కథలు కావు. నిజానికి ఈ కథలు మానవుల ఊహాశక్తిని తర్కంతో, వివేచనతో పరిచయ చేస్తుంది. ఒక అంశాన్ని వివిధ కోణాల నుండి ఎలా చూడాలో, ఏ మేరకు సమన్వయం చేయాలో, తార్కిక ముగింపు ఎలా ఉండాలో చెపుతాయి. ముఖ్యంగా ఒక సమస్యను విభిన్న కోణాలలో ఆలోచించగల తార్కిక స్థాయిని చిన్నారులలో పెంపొందింపచేస్తాయి. అందుకే ఈ కథలు పండితులకు, పామరులకు, అక్షరాస్యులకు,నిరక్షరాస్యులకు, పిల్లలకు, వయోవృద్ధులకు అనే భేదం లేకుండా అందరికి చెప్పడానికి అనుకూలంగా ఉన్నాయి.

ప్రాచీన భారతీయ కథా కౌశలానికి, భావనా శక్తికి, కల్పనా చాతుర్యానికి నిదర్శనంగా నిలిచిన ఈ కథలు కాలక్రమంలో ఖండంతరాలను దాటి ప్రపంచ నలుమూలల విస్తరించాయి.

“పంచతంత్రం” కథలను పరిశీలిస్తే ప్రతి జంతువు,ప్రతి పక్షి పాత్రలు పాత్రదారులుగా ఉన్నాయి. కానీ కథలు మాత్రం దేనికదే విడికథగా ఉండి, ప్రతికథకూ ప్రారంభమూ, ముగింపూ వేర్వేరు గా ఉంటాయి. ప్రతి కథలో ఒక నీతి లేదా ఒక మంచి తప్పకుండా ఉంటాయి.పిల్లలకు సులభంగా అర్థమై తక్కువ సమయములో ముగిసేలా ఉంటాయి.జంతువులతో పక్షులతో మాట్లాడించి కథను కోనసాగించిన విష్ణుశర్మ, చిన్నయసూరి లకు తెలుగు వారందరు ఋణపడి ఉన్నారు.

ప్రతి కథా యేదో ఒక మంచి విషయాన్ని కచ్చితంగా చెప్పేలా ఉంటుంది . అలా అని జీవిత సత్యాలను చెప్పేవి కాకుండా....వినడానికి ఆశక్తిని కలిగించే కథలు, ధైర్యసాహసాలు,ఐకమత్యమే మహాబలం లాంటి ఇతివృత్తాలను తెలియచేసే కథలు చిన్నారులను ఆకట్టుకుంటాయి.

ఉమ్మడి కుటుంబాలుంటే తాతా, నాన్నమ్మ, అమ్మమ్మ లు కథలు చెప్పేవారు. ప్రస్తుత తరుణంలో తల్లిదండ్రులు ఈ భాధ్యతను స్వీకరించాలి కాబట్టి వీరు చెప్పే కథలు సరళమైన తెలుగు భాషలో ఉంటూ చిన్నారులకు అర్థమయ్యే పదాలు మాత్రమే ఉండాలి. కథలలో వివిధ ప్రాంతాలలో వాడే ప్రత్యేక పదాలు,గ్రామీణ పదాలు,పర్యాయపదాలు,సామెతలు ఉండి చిన్నారులకు కొత్త పదాలను పరిచయం చేస్తుంది.

పది సంవత్సరాల వయసు వాళ్లకు చెప్పే కథలలో , తెలుగు భాషపై ఆసక్తిని పెంచేదిగా,కథనం ఊహకందని రీతిలో సాగేదిగా,సంక్లిష్టమైన పదాలు లేకుండా, తెలుగులో కనుమరుగు అవుతున్న పదాలనూ, జాతీయాలనూ, సామెతలను కలుపుతూ చెప్పడం వల్ల నేటి బాలలకు మన ప్రత్యేక పదజాలం ను కూడా పరిచయం చేసిన వారమవుతాం.

నీతి కథలకొరకు ప్రత్యేకంగా చందమామ,బాలమిత్ర లాంటి మాసపత్రికలు ఉన్నాయి.టెలివిజన్, వీడియో గేములు, కార్టూన్ ఛానల్స్, చేతిలో మొబైల్ లు,ఉచిత ఇంటర్నెట్ ఇవన్నీ లేని రోజుల్లో, పిల్లలకు మరియు పెద్దలకు ఎంతో వినోదాన్ని మరియు, విజ్ఞానాన్ని అందించేది కేవలం “చందమామ” లాంటి మాసపత్రికలు మాత్రమే.

తల్లిదండ్రులు తమ పిల్లలకు ఇచ్చే అమూల్యమైన గొప్ప బహుమతి ఏదైనా ఉందంటే అది “పిల్లలతో” ఎక్కువ సమయం గడపడం మాత్రమే అని గుర్తేరుగాలి. కానీ నేడు అదే లేక పోవడం విచారకరం

ప్రతి ఒక్కరు బిజీ బిజీ అంటూ పిల్లల కోసం కొంత సమయం కూడా కేటాయించలేకపోతున్నారు. గతంలోకి ఒకసారి వెళ్లి చూస్తే.. పని బారం ఉన్నప్పటికీ,రాత్రి సమయాల్లో తప్పకుండా తలిదండ్రులు తమ ఫిల్లలకు కథలు చెప్పుతూ గడిపేవారు.కానీ నేటి యుగంలో పని ఒత్తిడి, కుటుంబ భాధ్యతల మధ్య నలిగిపోతున్న తల్లిదండ్రులు తాము విన్న అ చిన్ననాటి కథలను జ్ఞాపకం చేసుకొని పిల్లలకు చెప్పే ఓపిక,సమయం లేదనుకోవడం విచారకరం. అ మాట కొస్తే కథలు వినడం చిన్నారులకు ఎంత అవసరమో, చెప్పడం అమ్మా నాన్నలకు అంతే అవసరం ఎందుకంటే '' కథలు చెన్పడం మనం ఆపేస్తే, అవి క్రమంగా అంతరించిపోతాయి. అంతరించిపోయిన ఆ కథలతో పాటు మన అస్తిత్వం, మన చరిత్ర అంతరించిపోతుంది. చిన్నపిల్లలకు కథలు చెప్పడం ఎంత ముఖ్యమో ఇంట్లొఉండే పెద్దవారు గుర్తించాల్సిన అవసరం ఉంది.మన భారతీయ చరిత్ర మరియు పురాణాలు పరిశీలిస్తే చిన్నతనంలో వారి తల్లి చెప్పిన కథల వల్ల ప్రేరణ పొందామని ఎందరో గొప్పవారు తెలియచేశారు.

ప్రతి చిన్నారి తెలియని అనేక విషయాలు తెలుసుకోవాలంటే,వారిలో సృజనాత్మకత పెరగాలంటే వారికి కథలు చెప్పడం అనేది ఒక అద్భుతమైన విధానం. నేటి పిల్లలకు అటు పాఠశాల్లో లేదా ఇంట్లో కానీ కథలు వినడానికి అవకాశం లేదు. ఎందుకంటే రెండు సంవత్సరాలు నిండడం తోనే చిన్నారులను పాఠశాలలో చేర్చడం,ర్యాంకులకోసం పరిగెత్తించడం తోనే జీవితం గడిచిపోతుంది.చదువులో ఎన్ని మార్కులు వచ్చాయంటాం కానీ నీకెన్ని కథలు వచ్చు అని మనం అడుగం.

అప్పుడప్పుడు ప్రముఖుల ఉపన్యాసంలో సందర్భానికి తగిన కథను చెప్పేవారు. దీనిని “పిట్టకథ” అని అంటారు. కథలు పిల్లలలో, సాహస వీరుల కథలు, దయాగుణం తెలిపే కథలు, సమస్యను తెలివిగా పరిష్కరించే కథలు, అద్భుతమైన ఊహ ప్రపపంచములోకి తీసుకొని వెళ్లే కథలు, హాస్య భరితమైన కథలు,దేశభక్తి మరియు దైవ భక్తి ని కలిగించే కథలు చిన్నారుల్లో వినోదాన్ని మరియు విజ్ఞానాన్ని పెంపొందిస్తూ వారిని ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దుతున్నాయి.

తెలుగు సాహిత్యంలో మహాభారతము,రామాయణం మరియు భాగవతంలో కూడ అనేక కథలు ఉన్నాయి. చిత్రవిచిత్రాలైన మహిమలతో, మలుపులతో, వినోదభరితంగా ఉండి మంచి నడవడికను తెలియ చేస్తున్నాయి.

కావునా పెద్దలారా....మీరు మీ చిన్నారులకు నీతి కథలు నేర్పిస్తూ,వారిని మిగిలిన పిల్లలకు చెప్పేలా ప్రోత్సహిస్తూ చిన్నారుల ఉజ్వల భవిష్యత్ కు చేయందిస్తారని ఆశిస్తున్నాను.

గడప రఘుపతిరావు

రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత.

9963499282

## వర్కింగ్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ కు దరఖాస్తుల ఆహ్వానం

**- 2026, 2027 సంవత్సరాలకు అక్రిడిటేషన్ కార్డుల జారీ ప్రక్రియ**

**- సమాచార, పౌర సంబంధాల శాఖ సంచాలకులు కేఎస్ విశ్వనాథన్**

విజయవాడ, భారత శక్తి ప్రతినిధి, నవంబర్ 14: రాష్ట్ర, జిల్లా స్థాయిలలో పనిచేస్తున్న పాత్రికేయులకు రెండు సంవత్సరాల (2026, 2027) కాలపరిమితికి సమాచార, పౌర సంబంధాల శాఖ జారీ చేసే నూతన అక్రిడిటేషన్ లకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు సంచాలకులు కె.ఎస్. విశ్వనాథన్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

2026-27 రెండు సంవత్సరాలకు జారీ చేసే అక్రిడిటేషన్స్ కు నిబంధనల మేరకు అర్హత కలిగిన పాత్రికేయుల దరఖాస్తులు ఆన్ లైన్ ద్వారా స్వీకరిస్తారన్నారు. గతంలో జారీ చేసిన అక్రిడిటేషన్ కార్డుల గడువు ఈ ఏడాది నవంబర్ 30 నాటికి ముగుస్తున్నందున నూతన అక్రిడిటేషన్స్ జారీ ప్రక్రియ చేపట్టడం జరిగిందన్నారు.

దరఖాస్తుల నమోదుకు ముందుగా మీడియా సంస్థల వివరాలు పోర్టల్ లో పొందుపరచవలసి ఉన్నందున సంబంధిత పత్రాల డాక్యుమెంట్లను పెన్ డ్రైవ్ లో పొందుపరిచి మరియు జిరాక్స్ కాపీలను సమాచార, పౌర సంబంధాల శాఖ, పండిట్ నెహ్రూ బస్టాండ్, ఎన్టీఆర్ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్, రెండవ అంతస్థులోని విజయవాడ కార్యాలయంలో అందజేయాలన్నారు. అనంతరం పాత్రికేయులు నవంబర్ 14 వ తేదీ నుండి ఆన్ లైన్ వెబ్ సైట్ https://mediarelations.ap.gov.inలో సూచించిన విధంగా సంబంధిత పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందని సంచాలకులు కేఎస్ విశ్వనాథన్ ఆ ప్రకటనలో తెలియజేశారు.

## జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో బాలల దినోత్సవ వేడుకలు

కామారెడ్డి జిల్లా (భారత శక్తి ప్రతినిధి) నవంబర్ 14: బాలల దినోత్సవం సందర్భంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్ కార్యాలయంలో చాచా నెహ్రూ చిత్ర పటానికి జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్, జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు.



# పేదరికం “కౌగిట్లో” ప్రపంచ బాలలు

### (నవంబర్ 14 బాలల దినోత్సవం భారత మాజీప్రధానమంత్రి జవహర్లాల్ నెహ్రూ జయంతి సందర్భంగా)

“నేటి బాలలే రేపటి పౌరులు”బాలలు జాతీయ సంపద, భవిష్యత్తు మానవ వనరులు.వారి శ్రేయస్సు దేశాభివృద్ధికి మూలం అందుకే “నేటి బాలలే రేపటి పౌరులు “అన్నారు పెద్దలు .బాలల సంక్షేమం అభివృద్ధి పైపెట్టుబడి దేశాభివృద్ధికి సూచిక. బాల్యాన్ని ఆనందంగా అనుభవించడం ప్రతిబిడ్డ జన్మ హక్కు .సమాజంలో మంచి పౌరులుగా ఎధుగాలంటె



బాల్యదశ కీలకమైంది.పిల్లల మనసులు చాలా సున్నితమైనవి.బాల్యదశలో వారు ఎదురుకున్న ఇబ్బందులు కష్టాలువారి భవిష్యత్తు జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతాయని మానసిక శాస్త్రవేత్తలు తమ అధ్యయనాల్లో పేర్కొన్నారు .ఇంటిలో బడిలో అహల్లాధకరమైన వాతావరణంలో పిల్లలు పెరగడానికికావలసిన వరిస్థితులు కలిపించి వనరులు సమకూర్చవలసిన బాధ్యత ప్రభుత్వాల మీద సమాజం మీద వుంటుంది.బాలలు బి కరోనా ప్రభావం

కరోనా మహమ్మారి విజృంభణ వల్ల ,ప్రపంచ ఆర్థిక ‘వ్యవస్థ విద్యా వ్యవస్థ తీవ్ర ప్రభావానికి గురైంది.మూతబడిన స్కూల్స్ ఊడిన ఉద్యోగాలు’ స్తంభించిన ప్రజాజీవనం’ మూతబడిన పరిశ్రమలు ‘పెరిగిన నిరుద్యోగం’ తగ్గిన ఆదాయం పిల్లల జీవితాలను ప్రభావితం చేసింది.ప్రపంచ వ్యాప్తంగా కోట్లాది మంది బాలలు మధ్య తరగతి పేద వర్గాలకు చెందిన బాలలు కనీస సౌకర్యాలు లేక ప్రాథమిక అవసరాలు తీర్చుకోలేని కటిన దారిద్ర్యం లోకి నెట్టివేయ బడ్డారనీ ఇటీవల “యూనిసెఫ్” నివేదిక పేర్కొంది.

యూనిసెఫ్ నివేదిక బి బాలల స్థితి

“యూనిసెఫ్ “అధ్యయనం ప్రకారం కోవిడ్ కారణాన అభివృధి చెందిన అభివృధి చెందుతున్న దేశాల్లో బాలలకు కావలసిన విద్యా ‘వైద్య ఆరోగ్య’ గృహ వసతి ‘పోషకాహారం పారిశుద్ధ్యం’ తాగు నీరు అందుబాటులో లేని బాలల సంఖ్య 125 కోట్లు వుండగ వీరికి అధనంగ మరో15 కోట్ల మంది చేరారని ఈ పరిస్థితులు పేదరికం పెరగడానికి దారితీసింది. “ప్రపంచ బాంక్ యూనిసెఫ్ “నివేదిక ప్రకారం భారత దేశంలో 30 శాతం పైగా కఠిన పేదరికంలో బాలలు వున్నారని తేలింది. ప్రపంచ వ్యాప్తంగా జరిగిన గణనీయమైన అభివృధి వల్ల పేదరికం తగ్గినప్పటికీ దారిద్ర్యరేఖకు దిగువన జీవిస్తున్న కుటుంబాలలో బాలలు పేదరికాన్ని అనుభవిస్తుండం శోచనీయం. ప్రపంచ బ్యాంకు నివేదిక ప్రకారం ప్రపంచ దేశాలలో 1981 సం””లో వున్న పేదలు 2010సం” నాటికి పేదలుగానే వున్నారని తేలింది. పేదరికములో జీవిస్తున్న బాలల సంఖ్య మారలేదని “ప్రపంచ బ్యాంకు అధ్యక్షులు జిమ్ యాంగ్ కింగ్” అన్నారు. పేదరికం నిరుద్యోగం బాలకార్మికల సంఖ్యపెరగడానికి దోహదపడిందని ప్రపంచ బ్యాంకు “ఆర్థిక.వేత్త కౌశిక్ బసు “పేర్కొన్నారు. ప్రపంచ వ్యాప్తంగా పరిశీలిస్తే 30 శాతం పైగా అత్యంత పేదరికంలో నివసించే బాలలు భారత దేశములో ఉండడం గమనార్హం. “ఎండింగ్ ఎక్ట్రీమ్ పావర్టీ ఫోకస్ ఆన్ చిల్డ్రన్ “నివేదిక ప్రకారం పేదరికంలో నివసించే పెద్దల కంటే బాలలు రెండు రెట్లు ఎక్కువ వుండే అవకాశం ఉందని తేలింది. జనాభాలో 3.వ వంతు ఉన్న బాలల్లో అందులో సగం మంది పేదరికంలో వున్నట్లు పలు అధ్యయనాలు తెలుపుతున్నాయి.

2013 నాటికి అభివృద్ధి చెందుతున్న దేశాలలో తలసరి ఆదాయం1.90 డాలర్లు సంపాదిస్తున్న కుటుంబాలలో19.5 శాతం బాలలు పేదరికంలో వున్నట్లు తేలింది.7 దశబ్దాల స్వాతంత్ర భారత్ సాధించిన అభివృధి పథకాల ఫలితాలుభారత దేశములో గ్రామీణ ప్రాంతాలలో ఎస్సీ ‘ఎస్టీ ‘పేద బడుగు బలహీన వర్గాలకు అందక పోవటం వల్ల ఈ వర్గాల్లో 80.శాతం బాలలు పేదరికాన్ని అనుభవిస్తున్నారు. అభివృధి చెందిన దేశాలలో 5 యేళ్ల లోపు బాలల్లో ప్రతి ఐదుగురిలో ఒకరు అత్యంత పేదరిక కుటుంబాలలో నివసిస్తున్నారు.కరోనా మహమ్మారి పేద ‘మధ్య ‘అల్ప ‘ఆదాయ దేశాల మీద ఎక్కువ ప్రభావం చూయించింది. ప్రపంచ దేశాలతో పాటు బాలల జనాభా ఎక్కువ ఉన్న దేశాలలో వర్ధమాన దేశాలు భారత దేశం బాలల అభివృధి సంక్షేమ పట్ల ప్రతేక శ్రద్ధ పెట్టాలి.

కరోనా బి బాలల భద్రత.

ప్రపంచ వ్యాప్తంగా కరోనా మహమ్మారి విసిరిన పంజాకు సామాజిక’ ఆర్థిక’ విద్య ‘వైద్య రంగాలు కుదేలైనాయి. పరిశ్రమలు మూతపడ్డాయి ఉద్యోగం లేక అనేక కుటుంబాల ఆదాయాలు తగ్గాయి.ఈ ప్రభావం బాలల మీద పడింది. విద్య’ వైద్య ‘ఆరోగ్య సౌకర్యాలు ప్రాథమిక అవసరాలు తీర్చుకోలేని స్థితిలో బాలలు కూరుకు పోవటంవల్ల వారి శారీరక మానసిక వికాసం కుంటుపడింది.కొరనా వల్ల బాలల్లో లింగపరమైనఅసమానతలు :విద్యా పరమైన అంతరాలు పెరిగాయి.బాలల జీవనం పై కరోనా మహమ్మారి ప్రభావంపై ఇటీవల” సేవ్ ది చిల్డ్రన్”అనే సంస్థ ప్రతేక అధ్యయనాలు చేసిందికోరనా వల్ల 93 శాతం కుటుంభాలు నగానికి పైగాఆదాయం కోల్పోవడంతో ఆరోగ్య సేవలు పొందలేదని 62 శాతం కుటుంబాలు బాలలకు పౌష్టికాహారం అందించలేక పోయాయని.37.శాతం పేద కుటుంబాల బాలలు చదువు కోవడానికి అభ్యసన పరికరాలను కొనలేక పోయారని సర్వేలో తేలింది.కరోనా “లాకడౌన్ ‘వల్ల స్కూల్స్ మూతబడ్డాయి. ఆన్లైన్ భోధన వల్ల టీచర్స్ పర్యవేక్షణ లేకపోవడం వల్ల ప్రతి 10 మంది లో ,8 మంది బాలలు ఏమి నేర్చుకోలేదని గృహ హింస పెరిగిందని ‘బాలికల పై ఇంటి పని పిల్లల సంరక్షణ భారం ఒత్తిడి పెరిగి మానసిక ఆరోగ్యం దెబ్బతిని ప్రతికూల భావనలు పెరిగాయని సర్వే పేర్కొంది. విద్యా రంగములో అత్యవసర పరిస్థితిని పాటించడం వల్ల ఈ సంవత్సరం దాదాపు కోటి మంది పిల్లలు స్కూల్స్ కు తిరిగి రాక పోవచ్చును అన్న అంచనాలు విద్యావేత్తల్లోతీవ్ర ఆందోళన కలిగిస్తుంది. ప్రపంచ బ్యాంక్ అంచనాల ప్రకారం భారత దేశములో కరోనా మహమ్మారి ప్రభావం వల్ల1.2 కోట్ల మంది దారిద్ర్య రేఖకు దిగువన చేరే అవకాశం వుందనీ పేర్కోవడం బాలల భద్రత కు పెను సవాలు గా పరిణమించింది.

ప్రభుత్వాలు బి బాలల అభివృధి

బాలల సర్వతోముఖ అభివృధికొరకు ప్రభుత్వాలు సమగ్రమైన కార్యాచరణ ప్రణాళికలను అమలు చెయ్యాలి.బాలల కనీస అవసరాలు తీర్చి వారి వికాసానికి కృషి చేయడం ప్రభుత్వాల బాధ్యత ఐక్యరాజ్య సమితి బాలల హక్కుల రక్షణ కోసం 1989 నాటి అంతర్జాతీయ ఒడంబికను ప్రపంచ దేశాలు క్షేతరస్థాయిలో పటిష్టంగా అమలు చెయ్యాలి

లిస్టీ శిశు సంక్షేమానికి ప్రాధాన్యతలి కేంద్ర రాష్ట్ర స్థానిక ప్రభుత్వాలు గర్భిణీ స్త్రీల ఆరోగ్య సంరక్షణ మతా శిశు సంక్షేమ పథకాలు ‘ఇమ్యునైజేషన్ పరిశుభ్రమైన నీరు పౌష్టికాహార పంపిణీ ‘ప్రాథమిక.వసతులు ఏర్పాటు చెయ్యాలి.

ప్రభుత్వాలు పేదవర్గాలకు సామాజిక రక్షణ పథకాలు చెయ్యాలి. పేద కుటుంబాలకు నేరుగా నగదు బదిలీ కార్యక్రమాలు సమర్థవంతంగా అమలు చెయ్యాలి.

పేద వర్గాలకు ఉచిత విద్య ‘వైద్యం తాగునీటి సౌకర్యం ‘గృహవసతి ఆరోగ్య సంరక్షణ మౌలిక వసతులు మెరుగు పరచాలి. అవస్థాపన పెట్టుబడులు పెంచాలి.

కరువులు ‘అంటువ్యాధుల నివారణ ‘ఆర్థిక అస్థిరత అరికట్టాలి సుస్తిరాభివృదికి దారితీసే అభివృధి కార్యాచరణకు పూనుకోవాలి . బాలలసర్వతోమఖాభివృద్ధిలక్ష్యంగప్రయోజన కరమైన ఆర్థికవృద్ధిని పెంచే బహుముఖ “అభివృధి వ్యూహాన్ని” అమలు చెయ్యాలి.

2010 నుండి అమలు అవుతున్న ప్రాథమిక నిర్భంధ విద్యా హక్కును అమలుచేయడంలో ప్రభుత్వ యంత్రాంగం ముఖ్య పాత్ర పోషించాలి.గ్రామీణ ప్రాంతాలలో నగరాలలో “మురికి వాడల్లో” నివసించే పేదలను అక్షరాస్యులను చెయ్యాలి . పేదల కుటుంబాల ఆర్థిక స్థితిని మెరుగు పరచాలి. ఉపాధి అవకాశాల కల్పన విస్తరణ పేదరిక నిర్మూలన ఉత్పత్తి ఉత్పాదకత పెంపు ఆదాయ సృష్టి ఆదాయ పంపిణీ ఏకకాలములో జరిగే విధంగా ప్రభుత్వాల పాలన యంత్రాంగం చర్యలు చేపట్టాలి.

మనదేశంలో ప్రభుత్వం పేదరికంనిరుద్యోగం ‘ఆర్థిక ‘అసమానతల ఆకలి చావులు ‘లింగ వివక్ష సమస్యల పరిష్కారానికి కృషి చెయ్యాలి .ఆరోగ్య భీమా పెన్షన్ సౌకర్యాలు కల్పించాలి.

బాలల్లో పౌష్టికాహారం కొరతను అధిగమించేందుకు మధ్యాన్న భోజనం ఉచిత ‘ఆరోగ్య సంరక్షణ పరీక్షలు “విటమిన్ టాబ్లెట్స్” ఉచితంగా అందించాలి. బాలల హక్కుల రక్షణ లో పౌరసమాజం స్వచ్ఛంద సంస్థలు క్రియాశీలక పాత్ర పోషించాలి.

రాజ్యాంగం బాలల హక్కుల రక్షణ

మహిళా శిశు సంక్షేమ శాఖ కార్మిక మంత్రిత్వ శాఖ సమిష్టిగా బాలల అభివృధి సంక్షేమ చట్టాలను పథకాలను ప్రజల్లోకి తీసుకవెళ్ళాలి పేద వర్గాల ప్రజలను సామాజిక ఆర్థిక అభివృధి ప్రణాళికలో భాగస్వాములను చెయ్యాలి. భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 23 ప్రకారం అన్ని రకాల బలవంతపు వెట్టి చాకిరీ ప్రమాదకరమైన గనుల్లో పనుల్లో బాలల చేత పని చేయించడం నిషేధాన్ని అమలు చేసి రాజ్యాంగంలోని ఆర్టికల్ 39 ప్రకారం బాలలకు స్వేచ్ఛ ‘గౌరవం అహల్లాధకరమైన వాతావరణంలో బాలలకు ఎదిగే అవకాశాలు కల్పించే బాధ్యత ప్రభుత్వం తీసుకోవాలి.

పేదవర్గాల బాలకు ఉచితంగా డిజిటల్ టెక్నాలజీ పరికరాలు అందించాలి .బాలల హక్కుల సంరక్షణ చట్టాలు సమర్ధ వంతంగాఅమలు చెయ్యాలి.

“బాలల అభివృద్ధే దేశాభివృద్ధి” లక్ష్యంగా ప్రభుత్వాలు సమగ్రమైన అభివృధి వ్యూహలతో బాలలకు బంగారు భవితను కలిపించాలి

నేదునూరి కనకయ్య

అధ్యక్షులుతెలంగాణ ఎకనామిక్ ఫోరం హైదరాబాద్
9440245771

# విరబూసిన కాగితం పూలు!

**కొన్ని రకాల మొక్కలు నర్సరీల్లోనూ ఉద్యానవనాల్లోనూ విరబూస్తాయి. ఇంట్లో పెంచితే సరిగ్గా పూయవెందుకు అన్న సందేహం చాలామందికి వస్తుంటుంది. ముఖ్యంగా బోగన్‌విలియా వంటి మొక్కలు ఆకు కనిపించకుండా పూయడం చూస్తుంటాం. వాటినలా చూసి ఇంట్లోనూ పెంచితే బాగుణ్ణు అనుకుంటాం. పైగా ఈమధ్య వీటిల్లో పొట్టి వెరైటీలు బోలెడు రంగుల్లోనూ దొరుకుతున్నాయి. దాంతో వీటిని కుండీల్లో పెంచుకోవాలని చాలామంది ఆసక్తి కనబరుస్తున్నారు. అందుకే...**









సారవంతమైన మట్టి, వెడల్పాటి కుండీ, నీళ్లు బయటికి పోయే మార్గం... వీటన్నింటితోపాటు ఏ మొక్కకైనా కావాల్సింది సూర్యకాంతి. బోగన్‌విలియా లేదా కాగితపూల మొక్కలకీ ఇది ఎంతో అవసరం. కనీసం ఆరు గంటలైనా ఉండాలి. కాబట్టి ఎండ బాగా వచ్చే చోటే కుండీ పెట్టాలి. ఈ రకం మొక్కల్ని పెంచేటప్పుడు సమపాళ్లలో మట్టి, ఇసుక కంపోస్ట్ వేయాలి. ముద్దలా ఉండే బంకమట్టి లాంటిది వేయకూడదు. ఇది నీటిని ఎక్కువగా నిల్వ చేసుకోవడంతో పువ్వులు తక్కువగానూ ఆకులు ఎక్కువగానూ వస్తాయి. మట్టి పైభాగం కొన్ని అంగుళాలు మాత్రమే తడిచేలా నీళ్లు పోయాలి. ఎక్కువగా పోసినా పువ్వులు సరిగ్గా రావు. వేసవిలో మరీ ఎండిపోకుండా కొంచెంకొంచెం తడిపినా చలికాలంలో మాత్రం వారం పదిరోజులకోసారి అంటే, మట్టి పూర్తిగా ఎండాక మాత్రమే పోయాలి. నాలుగు లేదా ఆరు వారాలకోసారి కొద్దిగా ఎరువు వేస్తూ ఎప్పటికప్పుడు కొమ్మల్ని కత్తిరించాలి. అప్పుడే పువ్వులు బాగా వస్తాయి. చూశారుగా మరి... గులాబీ, తెలుపు, నారింజ, పసుపు, ఎరుపు... ఇలా కాగితం పూల మొక్కల్లో రంగులకు కొదవే లేదు. రెండుమూడు రంగుల్లో విరిసేవీ ఉంటున్నాయి. కాబట్టి ఎంపిక మీదే మరి!













# కేక్... డోనట్... వేఫల్స్ అన్నీ ఇంట్లోనే!


**బయట దొరికే డోనట్... కేక్... వేఫల్స్‌ని చూస్తే తినకుండా మనం ఉండగలమా! తీరా తిందామంటే వాటిలో ఎన్ని ప్రిజర్వేటివ్స్ కలిపారో అనే భయం. వీటినే పిల్లలూ తింటే ఎన్ని అనారోగ్యాలో. వద్దని వాళ్లని ఎంత ఆపినా ఆగుతారా? వాటన్నింటిని దూరం చేసేలా ఇంట్లోనే నచ్చిన రుచులు, ఆకారాల్లో తయారుచేసుకునేలా వచ్చేశాయి ఈ బేకరీ పరికరాలు...**

### యమ్మీ యమ్మీ డోనట్...

స్కూల్ నుంచి రావడంతోనే 'అమ్మా ఈరోజు స్పెషల్‌గా స్నాక్స్ ఏం చేశావ్' అంటూ మొదలుపెడతారు పిల్లలు. వాళ్లకీ ఎప్పుడూ ఒకే తరహాలో చేసి పెడితే ఏం బావుంటుంది? అందుకే... ఈ 'ఆటోమేటిక్ డోనట్ మేకర్'ని తెచ్చుకుని చూడండి. బేకరీ స్టైల్లో యమ్మీ యమ్మీ మినీ డోనట్స్ ఇంట్లోనే చేసి చిన్నారులకి పెట్టొచ్చు. దీనిలో నాన్‌స్టిక్ బేకింగ్ ట్రే ఉండటం వల్ల పిండి అంటుకుంటుందనే భయం లేదు. బ్యాటర్‌ని కలిపి ట్రేలో వేసి బేకింగ్ సమయాన్ని ఒకసారి సెట్ చేసుకుంటే చాలు. డోనట్స్ తయారైన తర్వాత దానంతటదే ఆఫ్ అయిపోతుంది. మొదటిసారి చేసేవాళ్లకీ సులువుగానే ఉంటుంది.

### వేడి వేడి పాన్‌కేక్...

చిన్నారులతో పొద్దున్నే టిఫిన్ తినిపించాలంటే అమ్మలకి పెద్ద పనే కదా. పెట్టింది ఓ పట్టాన తినరు. చపాతీ వద్దు. ఇడ్లీ నాకు ఇష్టం ఉండదు. ఇలాంటి మాటలు రాకుండా వారిని మెప్పించేందుకు వచ్చిందే ఈ 'పాన్‌కేక్ పాన్'. జంతువులు, పువ్వులు, స్మైలీ బొమ్మలతో దొరుకుతుంది. రకరకాల ఆకారాలతో పాన్‌కేకులు చేసి పెట్టారంటే 'నచ్చలేదు' మాటే రాదు. ఫినాలిక్ హ్యాండిల్, అల్యూమినియంతో తయారైన ఈ పాన్ గ్యాస్, ఎలక్ట్రిక్ స్టవ్‌లపైనా కూడా పనిచేస్తుంది. పెనం వేడెక్కిన తర్వాత మిశ్రమాన్ని నచ్చిన ఆకారాల్లో పోసి దోసెను తిరగేసినట్లు తిరగేస్తే సరి పాన్ కేకు రెడీ అవుతుంది.



### క్రంచీ క్రంచీ వేఫల్స్...

క్రిస్పీగా ఉండే వేఫల్స్ ఒక్కొక్కరు ఒక్కోలా తినడానికి ఇష్టపడతారు. కొందరు తేనె, పీనట్ బటర్‌తో లేదా షుగర్ సిరప్‌లో ముంచి తింటే, చాక్లెట్, ఐస్‌క్రీమ్‌ని దానిలో నింపి ఆస్వాదిస్తారు ఇంకొందరు. వేఫల్స్ చిప్స్, క్రిస్పులు (బిస్కెట్ తరహావి) మినీ కోన్స్‌ని తినే వేఫల్స్ ప్రేమికులకోసం వచ్చినదే 'వేఫల్ బౌల్ మేకర్'. నాలుగు అంగుళాల మందం, నాన్‌స్టిక్ గ్రిడ్‌తో తయారయ్యింది ఈ మేకర్. విద్యుత్‌తో పనిచేస్తుంది. ముందుగా సిద్ధం చేసుకున్న పిండిని ఈ బౌల్‌లో వేసి మూతపెట్టాలి. దీనికి ఇండికేటర్ లైట్ ఉండటంవల్ల వేఫల్ బేక్ అవ్వగానే దానంతటదే ఆగిపోతుంది. ఇలా తయారైన వాటిలో మనకు నచ్చిన ఫ్రూట్స్, స్వీట్లు వంటివి సర్వ్ చేసుకుని వాటితో పాటు కప్పుల్ని కూడా తినేయొచ్చన్నమాట. ఈ పరికరాలు మీకూ నచ్చాయా అయితే ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లోనూ అందుబాటులో ఉన్నాయ్ ఓసారి చూసేయండి.










# ఎగ్జిట్ పోల్స్.. గెలిచినట్లా? ఓడినట్లా?

బిహార్ ఎన్నికల ఫలితాలను అంచనా వేయడంలో ఎగ్జిట్ పోల్స్ నిర్వహించిన సర్వే సంస్థలు సఫలమయ్యాయా? ఎప్పటిలానే బిహార్ ఫలితాన్ని అంచనా వేయడంలో విఫలమయ్యాయా? అంటే రెండింటికీ అవుననే సమాధానం వస్తోంది. ఎందుకంటే అన్ని సంస్థలూ బిహార్‌లో ఎన్డీయే కూటమి విజయాన్ని అంచనా వేసినప్పటికీ.. 200 సీట్లు దాటుతాయని ఏ సర్వే సంస్థా అంచనా వేయకపోవడం గమనార్హం. బిహార్‌లో 243 స్థానాలకు రెండు దఫాల్లో జరిగిన ఎన్నికల్లో



ఈసారి ఎన్డీయేదే విజయం అని దాదాపు అన్ని సర్వే సంస్థలూ తేల్చిచెప్పాయి. అన్ని సర్వేలను పరిగణనలోకి తీసుకుంటే ఎన్డీయేకు కనిష్ఠంగా 130 స్థానాలు గరిష్ఠంగా 167 స్థానాలు వస్తాయని పేర్కొన్నాయి. మహాగఠ్‌బంధన్‌కు కనిష్ఠంగా 70 స్థానాలు, గరిష్ఠంగా 108 స్థానాలు వస్తాయని చెప్పాయి. కానీ, వాస్తవ ఫలితం అందుకు భిన్నంగా వచ్చింది. ఎన్డీయే ఏకంగా 200 స్థానాలు దాటగా..ఎంజీబీ కేవలం 35 స్థానాల్లోపే పరిమితమైంది.

**అప్పుడూ అంతే!**

దేశంలో ఏమూల ఎన్నికలు జరిగినా సర్వే సంస్థలు తమ అంచనాలను వెలువరించడం సర్వసాధారణం. చాలాసార్లు వాస్తవ ఫలితాలను అవి ప్రతిఫలిస్తుంటాయి. బిహార్ ఓటర్ల నాడి పట్టుకోవడంలో మాత్రం సర్వే సంస్థలు గతంలోనూ దెబ్బతిన్నాయి. 2015 అసెంబ్లీ ఎన్నికల్లో జేడీయూఆర్జేడీకాంగ్రెస్ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్‌కు, ఎన్డీయే మధ్య గట్టి పోటీ ఉంటుందని సర్వే సంస్థలు అంచనా వేశాయి. అందుకు భిన్నంగా 178 స్థానాల్లో మహాగఠ్‌బంధన్ ఘన విజయం సాధించింది. 2020లో ఆర్జేడీ నేతృత్వంలోని మహాగఠ్‌బంధన్ విజయాన్ని అన్ని సంస్థలూ అంచనా వేయగా.. జేడీయూ భాజపా నేతృత్వంలోని ఎన్డీయే కూటమి 125 స్థానాల్లో విజయం సాధించి ప్రభుత్వాన్ని నెలకొల్పింది. తాజాగా మరోసారి ఎగ్జిట్ పోల్స్ 'ఎగ్జాక్ట్ రిజల్ట్స్'ను అంచనాలను అందుకోవడంలో విఫలమయ్యాయి.

## ఎన్డీయే డబుల్ సెంచరీ..
# బిహార్‌లో భారీ విజయం

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి కనీవినీ ఎరుగని రీతిలో భారీ విజయం సాధించింది. ఏకంగా 200కుపైగా స్థానాలను కైవసం చేసుకుని.. డబుల్ సెంచరీ కొట్టింది. 202 స్థానాల్లో విజయఢంకా మోగించింది. గెలుపు ప్రభంజనంతో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మరోసారి సిద్ధమైంది. ఎన్డీయే కూటమిలోని భాజపా (89), జేడీయూ (85), ఎల్‌జేపీ (ఆర్‌వీ) (19), హెచ్ఏఎం(5), ఆర్ఎల్ఎం (4) సీట్లలో విజయం సాధించాయి. ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌధరీ, విజయ్ కుమార్ సిన్హాతో పాటు జానపద గాయనీ మైథిలీ ఠాకూర్, శ్రేయసి సింగ్, ప్రేమ్ కుమార్, బిజేంద్ర ప్రసాద్ యాదవ్ తదితర కీలక నేతలు గెలుపొందారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి 125 సీట్లు సాధించింది. ఇందులో భాజపా (74), జేడీయూ (43), వీఐపీ (04), హెచ్ఏఎం (04) స్థానాల్లో గెలుపొందాయి. ఈసారి నీతీశ్ కుమార్ పార్టీ భారీగా పుంజుకుంది. 2020 ఎన్నికలతో పోలిస్తే దాదాపు రెట్టింపు సీట్లలో (85) విజయం సాధించడం గమనార్హం. కాషాయ పార్టీ సైతం



15 సీట్లు అదనంగా తన ఖాతాలో వేసుకుంది. మరోవైపు, ప్రతిపక్ష మహాగఠ్‌బంధన్ ఘోర ఓటమిని చవిచూసింది. 2020 ఎన్నికల్లో 110 స్థానాల్లో విజయం సాధించగా.. ఈసారి 35 సీట్లకే పరిమితమైంది. ఆర్జేడీ 2020 ఎన్నికల్లో 75 సీట్లు సాధించగా.. ఈసారి 25 స్థానాల్లోనే గెలిచింది. ఏకంగా 50 సీట్లు కోల్పోయింది. కాంగ్రెస్ 19 నుంచి ప్రస్తుతం ఆరు స్థానాలకే పరిమితమైంది. రాష్ట్ర ఎన్నికలకు సంబంధించి పార్టీ చరిత్రలోనే ఇది రెండో పేలవ ప్రదర్శన. 2010లో హస్తం పార్టీకి నాలుగు సీట్లే వచ్చాయి. వామపక్షాలు కూడా ఈసారి మూడు స్థానాలే దక్కించుకున్నాయి.

# ఉప ఎన్నికల్లో.. అధికార పార్టీలదే పైచేయి

బిహార్ అసెంబ్లీ ఎన్నికలతోపాటు దేశవ్యాప్తంగా 8 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఉప ఎన్నికలు జరగ్గా.. చాలా చోట్ల అధికార పార్టీలే విజయం సాధించాయి. బిహార్‌లో అధికార ఎన్డీయే పక్షం భారీ మెజార్టీ సాధించి.. మరోసారి విజయ దుందుభి మోగించింది. తెలంగాణాలోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ గెలుపొందగా.. ఆయా రాష్ట్రాల ఉప ఎన్నికల ఫలితాలు ఇలా ఉన్నాయి. పంజాబ్‌లోని తరన్ తారన్ అసెంబ్లీ స్థానంలో ఆమ్‌ఆద్మీ పార్టీ అభ్యర్థి హర్మీత్ సింగ్ సంధు విజయం సాధించారు. శిరోమణి అకాలీదళ్ అభ్యర్థి సుఖ్‌విందర్ కౌర్‌పై 42,649 ఓట్ల మెజార్టీ సాధించారు. ఎమ్మెల్యే డాక్టర్ కాశ్మీర్ సింగ్ సోహల్ మరణంతో ఈ సీటు ఖాళీ అయ్యింది. రాజస్థాన్‌లోని అంతా ఉప ఎన్నికలో కాంగ్రెస్‌కు అభ్యర్థి ప్రమోద్ జైన్ గెలుపొందారు. భాజపా అభ్యర్థి సుమన్‌పై విజయం సాధించారు. స్థానిక ఎమ్మెల్యే కన్వర్‌లాల్‌పై అనర్హత వేటు పడడంతో ఈ స్థానంలో ఉప ఎన్నిక జరిగింది. ఒడిశాలోని నువాపడా ఉప ఎన్నికలో అధికార భాజపా అభ్యర్థి జయ్ ఢొలాకియా విజయం సాధించారు. ఎమ్మెల్యే రాజేంద్ర ఢొలాకియా మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమయ్యింది. ఝార్ఖండ్‌లోని ఘట్‌శిలా స్థానంలో ఝార్ఖండ్ ముక్తి మోర్చా అభ్యర్థి సోమేష్ చంద్ర సోరెన్ విజయం సాధించారు. ఎమ్మెల్యే రామ్‌దాస్ సోరెన్ మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది. జమ్మూకశ్మీర్‌లోని రెండు చోట్ల ఉప ఎన్నిక జరగ్గా..



నాగ్రోటా అసెంబ్లీ స్థానంలో భాజపా అభ్యర్థి దేవయానీ రాణా విజయం సాధించారు. స్థానిక ఎమ్మెల్యే దేవేందర్ సింగ్ రాణా మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక జరిగింది. బద్గాంలో పీపుల్స్ డెమోక్రటిక్ పార్టీ (పీడీపీ) అభ్యర్థి ఆగా సయ్యద్ ముంతజీర్ మెహదీ గెలుపొందారు. గత ఎన్నికల్లో రెండోచోట్ల పోటీ చేసిన ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా.. బద్గాం స్థానాన్ని ఖాళీ చేయడంతో ఉప ఎన్నిక జరిగింది. మిజోరంలోని డంపా స్థానానికి జరిగిన ఉప ఎన్నికలో ఎంఎన్ఎఫ్ అభ్యర్థి లాల్‌థాంగ్లియానా విజయం సాధించారు. ఎమ్మెల్యే లాల్రింట్లుంగా సైలా మరణంతో ఇక్కడ ఉప ఎన్నిక అనివార్యమైంది.

## ఫలితాలు ఆశ్చర్యపరిచాయి..
## ఈ ఎన్నికల్లో మొదట్నుంచీ అన్యాయమే: రాహుల్



దిల్లీ: బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ స్పందించారు. ఈ ఎన్నికలు మొదటినుంచి న్యాయంగా జరగలేదని ఆరోపించారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ఆశ్చర్యానికి గురిచేశాయన్నారు. మహాగఠ్‌బంధన్‌పై విశ్వాసంతో ఓట్లు వేసిన లక్షలాది మంది బిహార్ ప్రజలకు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలుపుతూ 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. రాజ్యాంగం, ప్రజాస్వామ్య పరిరక్షణ కోసమే ఈ పోరాటమన్నారు. కాంగ్రెస్, ఇండి కూటమి ఈ ఫలితాలను లోతుగా సమీక్షించి.. ప్రజాస్వామ్య పరిరక్షణకు తమ ప్రయత్నాలను మరింత సమర్థంగా కొనసాగిస్తాయని పేర్కొన్నారు. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార ఎన్డీయే కూటమి ప్రభంజనం సృష్టించగా.. మహాగఠ్‌బంధన్ కేవలం 35 లోపు సీట్లకే పరిమితమై చతికిలపడిన విషయం తెలిసిందే.

## ఓట్లు పడినా.. సీట్లు కోల్పోయి..!
# ఆర్జేడీ-కాంగ్రెస్‌లకు '2010 సీన్' రిపీట్

బిహార్‌లో లాలూ ప్రసాద్ నేతృత్వంలోని రాష్ట్రీయ జనతాదళ్ (RJD) కొన్నేళ్లుగా అధికారానికి దూరమైనప్పటికీ.. యాదవ్ ముస్లిం వర్గం మద్దతుతో స్థిర ఓటు బ్యాంకును కొనసాగిస్తోంది. 2005 నుంచి ఇప్పటివరకు చూస్తే ప్రతి అసెంబ్లీ ఎన్నికల్లో 18 నుంచి 23శాతం ఓట్లు పొందుతోంది. ఈ ఎన్నికల్లోనూ 23శాతం ఓట్లు సాధించింది. భారీగా సీట్లు కోల్పోయినప్పటికీ.. ప్రత్యర్థుల కంటే ఈ పార్టీకే ఓట్లు ఎక్కువగా రావడం గమనార్హం. జేడీయూకు 19.26 శాతం, భాజపాకు 20.7శాతం, కాంగ్రెస్‌కు 8.7శాతం చొప్పున ఓట్లు వచ్చాయి. 2010 ఫలితాలు రిపీట్.. ఈ అసెంబ్లీ ఎన్నికల్లో ఆర్జేడీ స్థిరమైన ఓట్ల శాతం పొందినప్పటికీ.. సీట్లు మాత్రం భారీగా కోల్పోయింది. 2005లో ఆర్జేడీ 75 స్థానాల్లో గెలుపొందగా.. 23.4శాతం ఓట్లు పొందింది. 2010లో కేవలం 22 స్థానాల్లో విజయం



సాధించింది. 2015లో 80, 2020 ఎన్నికల్లో 75 స్థానాల్లో విజయం సాధించగా ఈ సారి 26 స్థానాలకే పరిమితమైంది. 2010 తర్వాత ఈ స్థాయిలో సీట్లు కోల్పోవడం ఇదే తొలిసారి. ఇక్కడ కాంగ్రెస్ పరిస్థితి కూడా ఈసారి మరింత దిగజారింది. 2015 (27), 2020 (19) లలో కాస్త మెరుగైన ఫలితాలు సాధించిన కాంగ్రెస్ ఈసారి కేవలం ఆరు స్థానాలతోనే సరిపెట్టుకుంది. 2010లో ఈ పార్టీ కేవలం నాలుగు చోట్ల గెలుపొందింది. ఈసారి 8.7 శాతం ఓట్లతో ఓటు బ్యాంకును కాపాడుకునే ప్రయత్నం చేసింది. మొత్తంగా రెండు పార్టీలకు దాదాపు 2010 నాటి ఫలితాలే రిపీట్ అయినట్లు స్పష్టంగా తెలుస్తోంది.





## ఇదో గుణపాఠం.. కాంగ్రెస్‌కు కొత్త వ్యూహాలు అవసరం: డీకే శివకుమార్

బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో విపక్ష 'ఇండియా' కూటమి (మహాగఠ్‌బంధన్)కి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. గత ఎన్నికలతో పోలిస్తే ఈసారి పెద్దఎత్తున సీట్లు కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ఈ క్రమంలోనే బిహార్ ఫలితాలపై కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ స్పందించారు. భవిష్యత్తు ఎన్నికల కోసం కాంగ్రెస్‌తోపాటు 'ఇండియా' కూటమి కొత్త వ్యూహాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. తాజా ఫలితాలను తమ పార్టీకి, మిత్రపక్షాలకు ఓ గుణపాఠంగా పేర్కొన్నారు. ''బిహార్ ఫలితాలు.. ప్రజలు ఇచ్చిన తీర్పు. మాకు ఒక గుణపాఠం లాంటిది. కాంగ్రెస్ పార్టీకి, 'ఇండియా' కూటమికి కొత్త వ్యూహాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. దీని కోసం కసరత్తు చేస్తాం'' అని డీకే శివకుమార్ మీడియాతో మాట్లాడారు. బిహార్‌లో మహిళల ఓట్ల శాతం పెరుగుదల, వారికి రూ.10 వేల చొప్పున ఆర్థిక సాయం వంటివి ఎన్డీయే విజయానికి దోహదం చేశాయా? అనే ప్రశ్నపై బదులిస్తూ.. ''దీన్ని అధ్యయనం చేయాల్సిన అవసరం ఉంది. నా వద్దకు ఇంకా వివరణాత్మక నివేదిక రాలేదు. తర్వాత మాట్లాడతాను'' అని చెప్పారు.

* **'ఎస్ఐఆర్'దే అసలు ఆటంతా...: అఖిలేశ్ యాదవ్**

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ద్వారా మొత్తం ఆట నడిపించారంటూ ఎన్డీయేపై ఎస్పీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ ఆరోపణలు చేశారు. ఈ ఎన్నికల కుట్ర ఇప్పుడు బయటపడినందున.. తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తర్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో ఇది సాధ్యం కాదని వ్యాఖ్యానించారు. ఇకపై వారి ఆటలు సాగనివ్వబోమన్నారు. ''సీసీటీవీ మాదిరి మా వద్ద 'పీపీటీవీ' ఉంది. 'పీడీఏ ప్రహరీ టీవీ' (పీడీఏ కాపలాదారు టీవీ) అప్రమత్తంగా ఉండి భాజపాను అడ్డుకుంటుంది'' అని ట్వీట్ చేశారు.

## మహిళలే గేమ్ ఛేంజర్స్
# మొన్న మధ్యప్రదేశ్, మహారాష్ట్ర.. నేడు బిహార్!



బిహార్‌లో ఎన్డీయే ప్రభుత్వం రికార్డు విజయాన్ని నమోదు చేసింది. నీతీశ్ కుమార్ నేతృత్వంలో ఎన్నికలకు వెళ్లిన కూటమికి ఓటర్లు అఖండ విజయం చేకూర్చారు. 20 ఏళ్లుగా అధికారంలో ఉన్నా ప్రజావ్యతిరేకతను దాటడంలో నీతీశ్ సఫలమయ్యారు. మరీ ముఖ్యంగా మహిళల ఓట్లను ఆకర్షించడంలో కూటమి విజయం సాధించింది. ముఖ్యంగా ఎన్నికలకు కొన్ని రోజుల ముందు ప్రకటించిన 'రోజ్‌గార్ యోజన' (అర్హత కలిగిన మహిళలకు రూ.10వేల చొప్పున ఇవ్వడం) బాగా పనిచేసిందని రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. గతంలో మధ్యప్రదేశ్, మహారాష్ట్ర వంటి రాష్ట్రాల్లో చేసిన ఈ ప్రయోగం.. ఇప్పుడు బిహార్‌లోనూ 'గేమ్ ఛేంజర్'గా నిలిచిందంటున్నారు.

**తొలుత మధ్యప్రదేశ్‌లో..**

ఎన్నికల్లో గెలుపునకు మహిళల ఓట్లు చాలా కీలకం. ఎన్నికల సమయంలో వారి మనసు గెలిచిన వారి విజయానికి తిరుగుండదనేది రాజకీయ విశ్లేషకులు చెప్పేమాట. ఈ ఫార్ములా మధ్యప్రదేశ్‌లో బాగా పనిచేసింది. ఆ ఎన్నికల్లో శివరాజ్ సింగ్ ప్రభుత్వంపై వ్యతిరేకత ఉన్నప్పటికీ.. ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన 'లాడ్లీ బహన్ యోజన' ప్రయోగం సత్ఫలితాలను ఇచ్చింది. పేద మహిళల ఖాతాల్లో నెలకు రూ.1250 చొప్పున జమ చేసేందుకు ఉద్దేశించిన ఈ స్కీమ్‌ను ఎన్నికలకు కొద్ది రోజుల ముందు ప్రారంభించారు. ఆ ఎన్నికల్లో భాజపా విజయానికి దోహదం చేసింది. అదే ఊపుతో సార్వత్రిక ఎన్నికల్లోనూ 29 లోక్‌సభ స్థానాల్లో భాజపా క్లీన్‌స్వీప్ చేయగలిగింది.

**మహారాష్ట్రలోనూ సంజీవని**

సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీయే కూటమికి మహారాష్ట్రలో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. మొత్తం 48 లోక్‌సభ స్థానాలకు గానూ 30 స్థానాల్లో ఇండియా కూటమి విజయం సాధించింది. ఎన్డీయే కూటమి (మహాయుతి) కేవలం 17 స్థానాలకే పరిమితమైంది. అసెంబ్లీ ఎన్నికల్లోనూ అదే సీన్ రిపీట్ అవుతుందని భావించారంతా. కానీ, గతేడాది చివర్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి భారీ విజయం సాధించింది. ఎన్నికలకు ముందు ప్రవేశపెట్టిన 'లాడ్కీ బహిన్ యోజన' పేరిట మహిళల ఖాతాల్లో రూ.1500 వేసే పథకాన్ని తీసుకురావడం 'మహాయుతి' విజయంలో కీలక భూమిక పోషించింది.

**బిహార్‌లోనూ కీలకంగా**

తాజాగా బిహార్‌లోనూ ఇదే పథకం సత్ఫలితాలను ఇచ్చిందని చెబుతున్నారు రాజకీయ విశ్లేషకులు. ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన పేరిట సుమారు 75 లక్షల మంది మహిళల బ్యాంకు ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున నగదు బదిలీ చేశారు. మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు తాత్కాలిక సాయంగా ఈ మొత్తాన్ని అందిస్తున్నామని, రూ.2 లక్షల వరకు రుణం కూడా ఇస్తామని నీతీశ్ ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఎన్నికల్లో మహిళా ఓటింగ్ శాతం పెరగడానికి ఇదీ ఓ కారణమని చెబుతున్నారు. బిహార్‌లో మొత్తం ఓటింగ్ 66.91 శాతం నమోదు కాగా.. మహిళా ఓటింగ్ శాతం 71.6 శాతంగా నమోదైంది. మహిళలను ఆకట్టుకునేందుకు తేజస్వి యాదవ్ కూడా రూ.30 వేలు ఇస్తామని ప్రకటించినప్పటికీ పెద్దగా ప్రభావం లేకపోయింది.


# జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ విజయకేతనం..

* రేవంత్ ప్రజాపాలనకు ఇది ప్రజలు ఇచ్చిన తీర్పు..
* కాంగ్రెస్ గెలుపుతో సంబరాలు నిర్వహించిన శ్రేణులు...
* టపాసులు కాల్చి మిఠాయిలు పంచిన నాయకులు...
* ప్రజలు ఇచ్చిన తీర్పుకు ధన్యవాదాలు : చిలుక మధుసూదన్ రెడ్డి.

హైదరాబాద్, నవంబర్ 14 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ దాదాపు 25 వేల మెజారిటీ తో గెలుపొందడం పట్ల గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి ఆధ్వర్యంలో అనాజ్ పూర్ గ్రామ పంచాయితీ వద్ద కాంగ్రెస్ పార్టీ శ్రేణులు నాయకులు ర్యాలీ నిర్వహించి టపాసులు కాల్చి...ప్రజలకు మిఠాయిలు పంచి సంబరాలు జరుపుకున్నారు.. ఇది రేవంతన్న పాలనకు జూబ్లీహిల్స్ ప్రజలు ఇచ్చిన సరైన తీర్పు అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీకి కాలం



చెల్లిందని....బీజేపీ పార్టీని తెలంగాణ ప్రజలు నమ్మే స్థితిలో లేరని అన్నారు.. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్ముతున్నారని, సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని, ఇంకో 10 సంవత్సరాలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పార్టీ అధికారంలో ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకులు..కార్యకర్తలు పాల్గొన్నారు..



## సంబురాలు జరిపిన
# మాజీ మేయర్ చిగిరింత పారిజాత

బడంగ్ పేట్, నవంబర్ 14 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజార్టీతో గెలవడంతో మహేశ్వరం నియోజకవర్గంలోని బాలాపూర్ నివాసంలో స్వీట్లు పంచుకుని సంబరాలలో పాల్గొన్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి మాజీ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి. ఈ సందర్భంగా మాజీ మేయర్ మాట్లాడుతూ, గెలుపులో భాగస్వామ్యమైన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు, నాయకులకు శుభాకాంక్షలు అలాగే ధన్యవాదాలు తెలిపారు. ప్రజాస్వామ్య బద్ధంగా జరిగే ఎన్నికల్లో ఎన్ని తప్పుడు ప్రచారాలు చేసినా పెయిడ్ సర్వేలను ప్రజల్లోకి పంపి అయోమాయానికి గురిచేసినా జూబ్లీహిల్స్ ప్రజలు స్పష్టమైన నిర్ణయాన్ని ఓటు రూపంలో చూపించారని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న మంచి పనులను గుర్తించి తీర్పు ఇవ్వడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి డైరెక్టర్ పన్నాల రాజేందర్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు వంగేటి ప్రభాకర్ రెడ్డి, పెద్దబావి సుదర్శన్ రెడ్డి, ఏఐసీసీ విచార్ విభాగ్ కో ఆర్డినేటర్ బోయపల్లి రాఘవేందర్ రెడ్డి, నాయకులు తుళ్ల సునీత గౌడ్, నయన చారి, గిరి ముదిరాజ్, రాకేష్, అరుణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లయన్స్ క్లబ్ కిడ్స్ వేర్ స్టూడియో
# ప్రారంభించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, నవంబర్ 14 (భారత శక్తి): బి.ఎన్. రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని బిడిరెడ్డి గార్డెన్ రోడ్డులోని లయన్ క్లబ్ కిడ్స్ వేర్ స్టూడియో నూతనంగా ప్రారంభించబడింది.ఈ స్టోర్‌ను ఎల్బీనగర్ ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి శుభారంభం చేశారు.ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు బుడిద సాయి కృష్ణ యాదవ్ మరియు బోలుసాని నిఖిల్ కుమార్ మాట్లాడుతూ, పిల్లల కోసం నాణ్యమైన,ఆధునిక శైలిలోని దుస్తులను సరసమైన ధరల్లో అందించాలనే లక్ష్యంతో ఈ స్టోర్‌ను ప్రారంభించామని తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి కొత్త వ్యాపారాలు ప్రాంతీయ అభివృద్ధికి తోడ్పడతాయని,యువత వ్యాపారాల్లో ముందుకు రావడం ప్రశంసనీయమని తెలిపారు. ప్రాంత ప్రజల కోసం సులభంగా చేరుకునే ప్రదేశంలో ఆధునిక సౌకర్యాలతో రూపొందించడం జరిగిందన్నారు.





## చిత్రా లేఅవుట్ లో
# చాచా నెహ్రూ జయంతి వేడుకలు

ఎల్బీనగర్, నవంబర్ 14 (భారత శక్తి): ఆర్కేపురం డివిజన్ పరిధిలోని చిత్ర లే అవుట్ చిల్డ్రన్స్ పార్క్ నందు భారతదేశ తొలి ప్రధాన మంత్రి జవహర్ లాల్ నెహ్రూ జయంతి పురస్కరించుకొని యస్ఆర్ఆర్ చారిటబుల్ ట్రస్ట్, చిత్ర లే అవుట్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో చాచా నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ముందుగా చిత్ర లే అవుట్ అధ్యక్షులు పి. ఇంద్రసేనా రెడ్డి అతిథులకు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో లింగ ప్రకాష్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 301 మాట్లాడుతూ, పిల్లలచే చాచా నెహ్రూగా అభిమానించబడే నెహ్రూ పుట్టినరోజున దేశ మంతటా బాలల దినోత్సవం జరుగుతుందని తెలిపారు. తదుపరి చక్రపాణి రిజయిన్ చైర్మన్. 9.మాట్లాడుతూ,గాంధీకి అభిమాన నాయకులైన నెహ్రూ స్వాతంత్ర భారత ప్రధానిగా 1947ఆగష్టు 5న బాధ్యతలూ చేపట్టారని వివరించారు. అనంతరం బాల బాలికలకు "చాచా నెహ్రూ చెకుముకి అవార్డులూ, మేడల్స్ ప్రదానం చేశారు.ఈ రోజు ప్రపంచ మదుమేహ దినోత్సవం సందర్భంగా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం మెడికొవర్ హాస్పిటల్ సికింద్రాబాద్ వారిచే నిర్వహించడం జరిగింది. దాదాపు 150 కాలనీ వాసులు, వాకర్స్ వైద్య పరీక్షలు జరిపించు కున్నారు. ఈ కార్యక్రమంలో బి.గంగాధర్ రెడ్డి ఎలక్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ 301(2026) పాల్గొన్నారు. అనంతరం యస్. రామ చంద్ర రావు చైర్మన్, యస్. ఆర్. ఆర్. చారిటబుల్ ట్రస్ట్. & చిత్ర లే అవుట్ వాకర్స్ క్లబ్ ప్రధాన కార్యదర్శి వచ్చినటువంటి పెద్దలకు, చిత్ర లే అవుట్ వాకర్స్ క్లబ్ సభ్యులకు, కాలనీవాసులకు చిన్నారులకు,ఈ కార్యక్రమం విజయవంతం చేసినందుకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

## అనాథ విద్యార్థి గృహంలో
# చాచా నెహ్రూ జయంతి వేడుకలు

ఎల్బీనగర్, నవంబర్ 14 (భారత శక్తి): ఆర్కేపురంలోని అనాథ విద్యార్థి గృహంలో శుక్రవారం ఉదయం స్టేషనరీ కంపెనీలు అయిన నటరాజు & అప్సర హైదరాబాద్ ప్రతినిధి జగదీశ్వర్ ఆధ్వర్యంలో చాచా నెహ్రూ పుట్టిన రోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జగదీశ్వర్ గృహ విద్యార్థులకు రకరకాల ఆటలు నిర్వహించారు.ఈ పుట్టిన రోజు వేడుకలలో, ఆటలలో పాల్గొన్న ప్రతి గృహ విద్యార్థికి డ్రాయింగ్ బుక్స్, స్కెచ్ పెన్స్,క్రేయాన్స్ బాక్సులు, స్కేల్స్, రబ్బర్లు, పెన్సిల్లు, షార్పెనెర్స్



కలిగిన స్టేషనరీ కిట్స్ ను అందచేశారు. అనాథ గృహ విద్యార్థులకు స్టేషనరీ కిట్స్ ను అందచేసిన నటరాజు, అప్సర కంపెనీలకు గృహ అధ్యక్షులు మార్గం రాజేష్, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

# దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమే

* ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాలతోనే సాధ్యం..
* వెల్లడించిన కూనంనేని సాంబశివరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి
* సీపీఐ మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా సమితి సమావేశం..
* నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో కె.శ్రీనివాస్ అధ్యక్షతన కార్యక్రమం..



హైదరాబాద్, నవంబర్ 14 (భారత శక్తి): భారత దేశంలో ప్రత్యామ్నాయం కమ్యూనిజమేనని,ప్రజా సమస్యల పరిష్కారం ఎర్రజెండాలతోనే సాధ్యమని భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) రాష్ట్ర కార్యదర్శి,శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు అన్నారు. సీపీఐ మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా సమితి సమావేశం ఈసీఐఎల్ లోని నీలం రాజశేఖర్ రెడ్డి భవన్ లో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కె. శ్రీనివాస్ అధ్యక్షతన జరగగా, కూనంనేని ముఖ్య అతిధిగా హాజరయ్యారు. ఈ సమావేశం సందర్భంగా సీపీఐ రాష్ట్రకార్యదర్శి,శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు. మాట్లాడుతూ,ప్రపంచ వ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు కమ్యూనిజంపై ప్రజల నమ్మకం పెరుగుతున్న సూచనలు కనిపిస్తున్నాయని దానికి నిదర్శనం వరుసగా శ్రీలంక దేశంలో,న్యూయార్క్ లో కమ్యూనిజం అధికారంలోకి రావడం,ఇప్పుడు నేపాల్ లో అన్ని కమ్యూనిస్టులు ఐక్యం నిదర్శనమని అన్నారు. మూడోసారి అధికారంలోకి వచ్చిన మోడీ ప్రభుత్వం ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఇస్తామని, రైతుల ఆదాయం రెట్టింపు, ధరలు తగ్గిస్తాం, ఏటా 2 కోట్లు ఉద్యోగాలు ఇస్తాం లాంటి ప్రజాకర్షక నినాదాలతో అధికారంలోకి వచ్చిన బీజేపీ అవేమి అమలు చేయలేదన్నారు. దేశంలో ప్రజల మధ్య మత విద్వేషాలు, భావోద్వేగాలు రెచ్చగొడుతూ వరుసగా అధికారం నిలబెట్టుకుంటున్నదని ఆరోపించారు. 6 దశాబ్దాలుగా ప్రజల, కార్మికుల త్యాగాలతో నిర్మించిన ప్రభుత్వ రంగ సంస్థలను ఎల్ఐసి, బ్యాంకులు, టెలికాం, గనులు, చివరికి రక్షణ రంగ పరిశ్రమలను సైతం ప్రైవేట్ కు కట్టబెట్టిన చరిత్ర బీజేపీదేనని వారు ఉద్ఘాటించారు. దేశ సంపదను అదానీ, అంబానీ, కార్పొరేట్ పెట్టుబడిదారులకు దోచిపెడుతున్నారని, సంపన్నులు మరింత సంపన్నులవుతుంటే. పేదలు మరింత పేదలుగా అవుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. రైతులను, కార్మికులను పెట్టుబడిదారులకు కట్టుబానిసలుగా మార్చే చట్టాలు తెచ్చారని, వీటి రద్దుకొరకు సిపిఐ పోరాడుతున్నదన్నారు. దేశంలో కమ్యూనిస్టుల ఐక్యత, వామపక్ష ప్రజాతంత్ర శక్తుల ఐక్యత గురించి సిపిఐ నిరంతరం కృషి చేస్తున్నదని అందుకే రానున్న రోజుల్లో ప్రజలను కమ్యూనిస్టు భావజాలం వైపు ఆకర్షితులను చేయడానికి పోరాటాలు నిర్మిస్తామని వారు అన్నారు. ఖమ్మంలో డిసెంబర్ 26న సీపీఐ వందేళ్ల పండగను నిర్వహించనున్నట్లు, ఈ ముగింపు సభకు 40 దేశాల నుంచి వామపక్ష ప్రతినిధులు హాజరవుతారని, ఐదు లక్షల మంది హాజరుకానున్నారని అన్నారు.ఈ ముగింపు సభకు రాష్ట్రం నలుమూలల నుండి లక్షలాదిగా తరలిరావాలని వారు పిలుపునిచ్చారు. కేంద్ర విధానాలతో రైతులకు గిట్టు బాటు ధర లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పంటలకు గిట్టుబాటు ధర వచ్చే విధంగా కేంద్రం చర్యలు తీసుకోవాలని కోరారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు ఎక్కువ.. బీజేపీయేతర పాలిత రాష్ట్రాలకు తక్కువగా నిధులు ఇస్తున్నారని విమర్శించారు. దీంతో అనేక రాష్ట్రాల్లో అభివృద్ధి కుంటుపడుతుందన్నారు. రాష్ట్రంలో బీజేపీని అడ్డుకోవడానికి కాంగ్రెస్తో పొత్తు పెట్టుకున్నామని, తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాకుండా అడ్డుకున్నామన్నారు. రాష్ట్రంలో ప్రజావ్యతిరేక విధానాలను కాంగ్రెస్ అవలంభించినప్పుడు వాటిని సరిదిద్దడానికి ప్రయత్నిస్తున్నామన్నారు. అధికార కాంగ్రెస్తో పొత్తు ఉన్నా ప్రజా సమస్యలపై పోరాటం ఆపడం లేదని. ప్రజాసమస్యలపై నిరంతరం పోరాటం చేస్తామన్నారు. ఈ సందర్భంగా సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వీఎస్. బోస్,జాతీయ సమితి సభ్యులు యూసఫ్ మాట్లాడుతూ సీపీఐ శత జయంతి వేడుకలను భారీ ఎత్తున ప్రజలతో మమేకమై విజయవంతం చేయడానికి సీపీఐ శ్రేణులు అహర్నిశలు పనిచేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్,రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు దామోదర్ రెడ్డి,సాయిలు గౌడ్,కల్లూరు ధర్మేంద్ర, జిల్లా కార్యవర్గ సభ్యులు శంకర్, లక్ష్మి,స్వామి,కిషన్,శంకర్ రావ్,హరినాథ్ రావ్,కృష్ణ,సత్యప్రసాద్,యాదయ్య గౌడ్,లొట్టి ఈశ్వర్, సల్మాన్ బేగ్, పరమేశ్వర, మాధవి, ప్రమీల, రమేష్, నరేంద్ర ప్రసాద్, బాబు తదితరులు పాల్గొన్నారు

## బీపీటీ, బీఎస్సీ ఎంఎల్టీ, అల్లైడ్ హెల్త్ కోర్సులకు
# ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువు పెంపు

హైదరాబాద్, నవంబర్ 14 (భారత శక్తి): కాళోజీ నారాయణరావు హెల్త్ యూనివర్సిటీ (కేఎన్ఆర్ యూహెచ్ఎస్) బీపీటీ, బీఎస్సీ ఎంఎల్టీ, బీఎస్సీ అల్లైడ్ హెల్త్ సైన్సెస్ కోర్సులలో 202526 విద్యా సంవత్సరానికి కన్వీనర్ కోటా కింద ప్రవేశాల కోసం ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ గడువును పొడిగించింది. ఇంతకుముందు ఈ నెల 14న మధ్యాహ్నం 3 గంటల వరకు మాత్రమే రిజిస్ట్రేషన్లకు చివరి తేదీగా ప్రకటించారు. ఇప్పుడు ఈ నెల 18వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తు చేసుకోవచ్చని యూనివర్సిటీ ప్రకటించింది. యూనివర్సిటీలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో ప్రవేశం కోరుకునే అభ్యర్థులు వెబ్‌సైట్ https:// alliedhs.tsche.in ద్వారా నిర్దేశిత గడువులోపు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ చేసి, అవసరమైన సర్టిఫికేట్లు అప్‌లోడ్ చేయాలని యూనివర్సిటీ సూచించింది. రిజిస్ట్రేషన్ లేదా అప్లికేషన్ సబ్మిషన్‌లో సాంకేతిక సమస్యలు ఎదురైతే 9392685856, 7842136688, 9059672216 నంబర్లకు సంప్రదించవచ్చు. వెబ్ ఆప్షన్లకు సంబంధించిన టెక్నికల్ ఇష్యూల కోసం tsparamed.tech@gmail.com కు మెయిల్ చేయొచ్చు. ఇతర వివరాలకు 7901098840, 9490585796 నంబర్లలో సంప్రదించవచ్చు.

# అభివృద్ధికి మార్గాలు ఇవే: సీఎం చంద్రబాబు

అమరావతి, నవంబర్ 14 (భారత శక్తి): పెట్టుబడులు, నూతన ఆవిష్కరణలు, భాగస్వామ్యాలే రాష్ట్ర అభివృద్ధికి మూలస్తంభాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. విశాఖపట్నంలో జరుగుతున్న 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు ప్రారంభ ప్లీనరీలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. సీఐఐ భాగస్వామ్య సదస్సును కేవలం పెట్టుబడుల కోసం మాత్రమే చూడొద్దని నెట్వర్కింగ్ కోసం, మేధోపరమైన చర్చల కోసం, ఆవిష్కరణల కోసం ఏర్పాటు చేశామని అన్నారు. సౌదీ, రష్యా, యూకే, ఆస్ట్రేలియా, జర్మనీ, శ్రీలంక, జపాన్, కెనడా తదితర దేశాల ప్రతినిధులు ఈ సదస్సుకు హాజరు కావటం సంతోషాన్ని కలిగిస్తోందన్నారు. పరస్పరం పెట్టుబడుల భాగస్వామ్యంతోనే అభివృద్ధి సాధించగలమనే విషయాన్ని గుర్తించాలని సీఎం కోరారు. సింగపూర్ చాలా చిన్న దేశమైనా అమరావతి మాస్టర్ ప్లాన్ రూపొందించి ఇచ్చిందని తెలిపారు.

*** ఏపీ ప్రకృతిసాగులో అగ్రస్థానం... పర్యాటక రంగంలో పెట్టుబడులకు అనుకూలం**

ఆర్గానిక్ ఉత్పత్తిగా అరకు కాఫీ గ్లోబల్ బ్రాండ్‌గా ఎదిగిందని, ఆక్వా ఉత్పత్తులు, ప్రకృతి వ్యవసాయంలోనూ ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉందని సీఎం వివరించారు. "ఖనిజాలు, రేర్ ఎర్త్ మినరల్స్ విషయంలో కొత్త టెక్నాలజీలతో పని చేసే సంస్థలతో భాగస్వాములయ్యేందుకు ఏపీ




సిద్ధంగా ఉంది. ఏపీలోని సుదీర్ఘ తీరప్రాంతం, గండికోట, అరకు లాంటి ప్రకృతి అందాలు పర్యాటక రంగంలో పెట్టుబడులు పెట్టేవారికి అనుకూలమైన ప్రదేశాలు. అలాగే కొత్తగా భారతీయ రుచులకు సంబంధించిన రంగాల్లోనూ విస్తృత అవకాశాలు వినియోగించుకోవచ్చు. ఏపీలోని వివిధ ప్రాంతాల్లోని సంప్రదాయాలు, చేతివృత్తులను ప్రోత్సహించేందుకు ఎక్స్‌పీరియన్స్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నాం. డేటా లేక్, రియల్ టైమ్ డేటా ద్వారా త్వరితగతిన నిర్ణయాలు తీసుకోగలుగుతున్నాం. సాంకేతికత సాయంతో అతి తక్కువ నష్టంతోనే ప్రకృతి విపత్తులను సమర్థంగా ఎదుర్కొంటున్నాం. నూతన ఆవిష్కరణలు, యువతకు నైపుణ్యాల కోసం రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ఏర్పాటు చేశాం" అని ముఖ్యమంత్రి వివరించారు.

*** అందుబాటులో 50 వేల ఎకరాలు**

ఆంధ్రప్రదేశ్‌లో పరిశ్రమలు, ప్రాజెక్టుల ఏర్పాటు కోసం 50 వేల ఎకరాల ల్యాండ్ బ్యాంక్ అందుబాటులో ఉంచామని సీఎం చంద్రబాబు అన్నారు. మానవాళి సంక్షేమం కోసం అంతా కలిసి పనిచేద్దామని దేశవిదేశాలకు చెందిన ప్రతినిధులకు, పారిశ్రామిక వేత్తలకు పిలుపునిచ్చారు. భారతదేశంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో సుస్థిరమైన ప్రభుత్వం ఉందని అన్నారు. బీహార్ రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో ఎన్డీఏ మళ్లీ విజయం సాధించిందని, ఎన్డీఏపై నమ్మకం ఉంచిన ప్రజలకు సీఎం ధన్యవాదాలు తెలిపారు. ఈ సదస్సుకు ఆర్మేనియా, సింగపూర్, మారిషస్, నేపాల్, అంగోలా, వెనిజులా దేశాలకు చెందిన మంత్రులు యూఎన్‌ఓ ప్రతినిధులు కూడా హాజరయ్యారు.

## "కర్మ హిట్స్ బ్యాక్"... జూబ్లీహిల్స్ ఫలితాల నేపథ్యంలో కవిత ఆసక్తికర ట్వీట్

హైదరాబాద్, నవంబర్ 14 (భారత శక్తి): జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ఫలితాలు వెలువడిన అనంతరం తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఒక ఆసక్తికరమైన ట్వీట్ చేశారు. "కర్మ హిట్స్ బ్యాక్" అంటూ ఆమె 'ఎక్స్' వేదికగా చేసిన ఈ ట్వీట్ ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. ఎవరి పేరును గానీ, ఏ పార్టీ పేరును గానీ, ఏ అంశాన్ని గానీ ప్రస్తావించకుండా ఆమె కేవలం మూడు పదాల్లో ట్వీట్ చేయడం గమనార్హం. జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితాలు వెలువడిన తరుణంలో ఆమె ఈ ట్వీట్ చేయడం రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ భారీ మెజారిటీతో విజయం సాధించారు. బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతా గోపీనాథ్ సుమారు 24 వేలకు పైగా ఓట్ల తేడాతో ఓటమి పాలయ్యారు. బీఆర్ఎస్ ఓటమి నేపథ్యంలోనే కవిత ఈ ట్వీట్ చేశారని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

## కేసీఆర్ గురించి అందుకే మాట్లాడను
# జూబ్లీహిల్స్ ఫలితంపై రేవంత్ రెడ్డి స్పందన

హైదరాబాద్, నవంబర్ 14 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల ఫలితంపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్పందించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం సాధించిన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపు తమ బాధ్యతను మరింతగా పెంచిందని అన్నారు. రెండేళ్లు పూర్తి చేసుకున్న తమ పాలనకు ప్రజలు ఆమోదం తెలిపారని పేర్కొన్నారు.

**కేసీఆర్ క్రియాశీలకంగా లేరు**

రాజకీయాల్లో కేసీఆర్ క్రియాశీలకంగా లేనందున తాను ఆయన గురించి మాట్లాడనని స్పష్టం చేశారు. ఆరోగ్యం అంతంత మాత్రంగా ఉన్న నాయకుడిని విమర్శించడం భావ్యం కాదని అన్నారు. అయితే కేటీఆర్‌కు అహంకారం పోలేదని, హరీశ్ రావు అసహనం తగ్గించుకోవాలని హితవు పలికారు. వారి తీరు మారకుంటే ప్రజలు ఎలా అంగీకరిస్తారన్న విషయం అర్థం చేసుకోవాలని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలపై కూడా రేవంత్ రెడ్డి స్పందించారు. మంత్రుల అభిప్రాయాలను తీసుకుని స్థానిక సంస్థల ఎన్నికలపై నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

## బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సత్తా చాటిన మజ్లిస్ పార్టీ.. కొచ్చధామన్ సీటు గెలుపు

బీహార్, నవంబర్ 14 (భారత శక్తి): తెలంగాణ రాష్ట్ర రాజకీయాల్లో కీలక పాత్ర పోషిస్తున్న అసదుద్దీన్ ఒవైసీ నేతృత్వంలోని మజ్లిస్ పార్టీ బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో తన ఖాతాను తెరిచింది. ముస్లిం జనాభా అధికంగా ఉన్న సీమాంచల్ ప్రాంతంలో మజ్లిస్ పార్టీ పలు స్థానాల్లో ఆధిక్యంలో కొనసాగుతూ, ఒక స్థానంలో విజయం సాధించింది. కొచ్చధామన్ నియోజకవర్గం నుంచి మజ్లిస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసిన ఎండీ సర్వార్ ఆలమ్ గెలుపొందారు. సర్వార్ ఆలమ్ తన సమీప ఆర్జేడీ అభ్యర్థి ముజాహిద్ ఆలమ్‌పై 20 వేలకు పైగా ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు. సర్వార్ ఆలమ్‌కు 81,860 ఓట్లు రాగా, ఆర్జేడీ అభ్యర్థి ముజాహిద్ ఆలమ్‌కు 58,839 ఓట్లు, బీజేపీ అభ్యర్థి బినాదేవికి 44,858 ఓట్లు వచ్చాయి. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీజేడీయూ ఆధ్వర్యంలోని ఎన్డీయే కూటమి అద్భుత విజయాన్ని నమోదు చేస్తున్న విషయం తెలిసిందే. 243 స్థానాలకు గాను ఈ కూటమి 200కి పైగా సీట్లలో విజయం సాధించే అవకాశం ఉంది. మహాఘట్‌బంధన్ 36 సీట్లకు పరిమితమయ్యే సూచనలు కనిపిస్తున్నాయి. ఎన్డీయే కూటమిలో బీజేపీ 94, జేడీయూ 78, ఎల్‌జేపీ (ఆర్వీ) 19, హెచ్ఏఎం (ఎస్) 5, ఆర్ఎల్ఎం 4 సీట్లలో ముందంజలో ఉన్నాయి లేదా గెలుపొందాయి. మహాఘట్‌బంధన్‌లో ఆర్జేడీ 29, కాంగ్రెస్ 4 సీట్లలో ముందంజలో ఉన్నాయి లేదా గెలుపొందాయి.

# జూబ్లీహిల్స్‌లో బీఆర్ఎస్ ఓటమిపై స్పందించిన కేటీఆర్

హైదరాబాద్, నవంబర్ 14 (భారత శక్తి): జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక ఫలితంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పందించారు. మీడియాతో మాట్లాడుతూ, తెలంగాణ ప్రయోజనాల కోసం ప్రతిపక్షంగా తమ పాత్రను కొనసాగిస్తామని ఆయన స్పష్టం చేశారు. నిర్విరామంగా కృషి చేసిన కేసీఆర్ బృందానికి ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో కష్టాలకోర్చి పనిచేసిన కార్యకర్తలకు ఆయన నమస్సులందించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో పార్టీ గెలుపొందాలని స్థానిక నాయకత్వం ఎంతో శ్రమించిందని ఆయన కొనియాడారు. రాష్ట్రంలో రాజకీయ ప్రత్యామ్నాయం తామేనని ప్రజలు స్పష్టమైన తీర్పు ఇచ్చారని ఆయన పేర్కొన్నారు. ఇకపై ప్రజా సమస్యలపై తమ పార్టీ పోరాటం చేస్తుందని ఆయన ఉద్ఘాటించారు. వ్యక్తిగత సమస్యలు ఉన్నప్పటికీ పార్టీ కోసం కార్యకర్తలు, నాయకులు ఎంతో ఉత్సాహంగా పనిచేశారని కేటీఆర్ అన్నారు. గత రెండేళ్లుగా ప్రధాన ప్రతిపక్ష పార్టీగా బీఆర్ఎస్ సమర్థవంతమైన పాత్ర పోషిస్తోందని ఆయన అన్నారు. మాగంటి సునీతకు రాజకీయ అనుభవం లేకపోయినా ఎంతో కష్టపడ్డారని ఆయన ప్రశంసించారు. ఒక విధంగా ఆమె పోరాటమే చేశారని కొనియాడారు. గత రెండేళ్లుగా బీఆర్ఎస్ ప్రతిపక్ష పార్టీగా అద్భుతమైన పాత్రను పోషిస్తోందని ఆయన పునరుద్ఘాటించారు. ప్రజా సమస్యలను ప్రధానంగా ఎంచుకొని పోరాడుతున్నామని తెలిపారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక్కరికీ ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. ఉప ఎన్నికల్లో తాము ఎంతో నిజాయతీగా పోరాడామని ఆయన స్పష్టం చేశారు. ఈ ఎన్నికలు ఎలా జరిగాయో అందరికీ తెలుసని ఆయన అన్నారు. వాటి గురించి తాను మాట్లాడదలుచుకోలేదని అన్నారు. ప్రచారం ముగిసే వరకు ఒక విధంగా, ముగిసిన తర్వాత మరో విధంగా జరిగాయని ఆయన అభిప్రాయపడ్డారు. 2014 నుంచి 2023 మధ్య ఏడు ఉప ఎన్నికలు జరిగితే కాంగ్రెస్ పార్టీ ఒక్క దాంట్లో కూడా గెలవలేదని గుర్తు చేశారు. జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ పార్టీకి ఒకటి రెండు కార్పొరేటర్ సీట్లు మాత్రమే వచ్చాయని ఆయన గుర్తు చేశారు. ప్రజా సమస్యలను, ఆరు గ్యారెంటీలను, కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ప్రజల్లోకి తీసుకువెళతామని కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్, బీజేపీ ఎన్ని రకాలుగా కవ్వించే ప్రయత్నం చేసినా సంయమనం పాటించామని ఆయన వెల్లడించారు. తమ హయాంలో జూబ్లీహిల్స్ అభివృద్ధి కోసం రూ. 5 వేల కోట్లు ఇచ్చామని పేర్కొన్నారు. రాజకీయాల్లో గెలుపోటములు సహజమని, ప్రజా సమస్యలపై పోరాటానికి కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు. కేసీఆర్ తిరిగి ముఖ్యమంత్రి అయ్యే వరకు శ్రమిద్దామని ఆయన అన్నారు. జాతీయస్థాయిలో చూస్తే బీఆర్ఎస్ ఉనికి కోల్పోయే పరిస్థితి వచ్చిందని వస్తున్న విమర్శలను ఆయన ఖండించారు. బీఆర్ఎస్‌కు ఈ ఉప ఎన్నిక ఒక చిన్న ఎదురుదెబ్బ మాత్రమేనని ఆయన పేర్కొన్నారు. అధికార పార్టీ ఎన్నో ప్రలోభాలు పెట్టినా దీటుగా ఎదుర్కొని మంచి ఓటింగ్ సాధించామని అన్నారు. దొంగ ఓట్ల గురించి తాము స్పష్టమైన ఆధారాలు ఇచ్చామని, పోలింగ్ రోజు కూడా మాగంటి సునీత ఈ వ్యవహారాన్ని బయటపెట్టారని ఆయన గుర్తు చేశారు. ఫిరాయింపు ఎమ్మెల్యే విషయమై బెంగాల్‌లో హైకోర్టు స్పష్టమైన తీర్పు వెలువరించిందని ఆయన ప్రస్తావించారు. రాష్ట్రంలో కూడా పదిచోట్ల ఉప ఎన్నికలు రావాల్సిందేనని కేటీఆర్ డిమాండ్ చేశారు. ఒక్క ఉప ఎన్నికకే కాంగ్రెస్ చాలా కష్టపడిందని, ఇక పదిచోట్ల ఉప ఎన్నికలు వస్తే సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీలను తీసుకువస్తారేమోనని ఆయన వ్యాఖ్యానించారు. 'ఆర్ఎస్ బ్రదర్స్ 'పరస్పర సహకారంతో బాగా పనిచేశారని ఎద్దేవా చేశారు. ఈ ఉప ఎన్నికలో అది స్పష్టంగా కనిపించిందని ఆయన అన్నారు.

## జూబ్లీహిల్స్ లో కాంగ్రెస్ ఘన విజయం.. మాగంటి సునీతపై నవీన్ యాదవ్ జయకేతనం

హైదరాబాద్, నవంబర్ 14 (భారత శక్తి): అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించిన జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీ జయకేతనం ఎగురవేసింది. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ తన సమీప ప్రత్యర్థి, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతపై 24,729 ఓట్ల భారీ మెజార్టీతో ఘన విజయం సాధించారు. ఓట్ల లెక్కింపు ప్రారంభమైన తొలి రౌండ్ నుంచి చివరి వరకు నవీన్ యాదవ్ స్పష్టమైన ఆధిక్యాన్ని ప్రదర్శిస్తూ ఏకపక్ష విజయాన్ని నమోదు చేశారు. శుక్రవారం జరిగిన ఓట్ల లెక్కింపులో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు 98,988 ఓట్లు రాగా, బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీతకు 74,259 ఓట్లు పోలయ్యాయి. భారతీయ జనతా పార్టీ అభ్యర్థి దీపక్ రెడ్డి 17,061 ఓట్లతో మూడో స్థానంలో నిలిచారు. లెక్కింపు ప్రక్రియలో ఏ దశలోనూ బీఆర్ఎస్ అభ్యర్థి కాంగ్రెస్‌కు పోటీ ఇవ్వలేకపోయారు. రౌండ్ రౌండ్‌కు మెజార్టీని పెంచుకుంటూ నవీన్ యాదవ్ తన గెలుపును సులభతరం చేసుకున్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన ఈ కీలక ఉప ఎన్నికలో విజయం సాధించడం కాంగ్రెస్ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపింది. ఈ గెలుపు రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి రాజకీయంగా మరింత బలాన్ని చేకూర్చింది. ఫలితాలు వెలువడిన వెంటనే కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు సంబరాల్లో మునిగిపోయారు.

## జానపద గాయకురాలి నుంచి ఎమ్మెల్యేగా..
# అతిచిన్న వయస్సులో అలీ నగర్ నుంచి గెలిచిన మైథిలీ ఠాకూర్

బీహార్, నవంబర్ 14 (భారత శక్తి): బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో అలీనగర్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రముఖ జానపద గాయని మైథిలీ ఠాకూర్ (25) విజయం సాధించారు. అతి చిన్న వయస్సులో ఆమె బీహార్ అసెంబ్లీకి ఎన్నికైన రికార్డు సృష్టించారు. అలీనగర్ నుంచి ఆమె తన సమీప ఆర్జేడీ అభ్యర్థి బినోద్ మిశ్రాపై 11,730 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. తన గెలుపుపై మైథిలీ ఠాకూర్ స్పందిస్తూ, తనకు మాటలు రావడం లేదని అన్నారు. ఈ విజయం ప్రజలదేనని ఆమె పేర్కొన్నారు. అలీనగర్ నియోజకవర్గ ప్రజలు గెలిచినట్లుగా భావిస్తున్నానని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. బీజేపీ పట్ల ప్రజలు నమ్మకం ఉంచారని ఆమె తెలిపారు. మైథిలీ ఠాకూర్‌తో పాటు పాతికేళ్ల వయస్సులో ఎమ్మెల్యేలుగా గెలిచిన వారిలో సోను కుమార్ (గోహ్), నవీన్ కుమార్ (భట్నాహ), కుందన్ కుమార్ (షేక్‌పురా), శంబూబాబు (సుపౌల్), రాజ్ కుమార్ సాదా (సిమ్రీ భక్తియార్‌పూర్) ఉన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో 25 నుంచి 30 ఏళ్లు కలిగిన ఎమ్మెల్యేలు నలుగురు, 31 40 ఏళ్లు కలిగిన వారు 32 మంది, 4150 ఏళ్ల వారు 83 మంది, 5160 ఏళ్లు కలిగినవారు 65 మంది, 6170 ఏళ్ల వారు 47 మంది, 7180 ఏళ్లు కలిగిన వారు 10 మంది ఉన్నారు. బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎమ్మెల్యేల సగటు వయస్సు 51 సంవత్సరాలుగా ఉంది.

## తెలంగాణ పోలీసు శాఖలో
# 60 పోస్టులకు నోటిఫికేషన్ జారీ

హైదరాబాద్, నవంబర్ 14 (భారత శక్తి): తెలంగాణ ఫోరెన్సిక్ సైన్స్ లేబరేటరీలో 60 పోస్టులకు నోటిఫికేషన్ జారీ అయింది. సైంటిఫిక్ ఆఫీసర్స్, సైంటిఫిక్ అసిస్టెంట్స్, ల్యాబ్ టెక్నీషియన్స్, ల్యాబ్ అసిస్టెంట్స్ పోస్టులకు నోటిఫికేషన్ వెలువడింది. ఈనెల 27 నుంచి డిసెంబరు 15 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నారు. నోటిఫికేషన్ పూర్తి వివరాల కోసం https://www.tgprb.inలో చూడాలని అధికారులు తెలిపారు.




# ఫుడ్ ఎకోసిస్టమ్ నిర్మాణానికి కట్టుబడి ఉన్నాం: శ్రీధర్‌బాబు

హైదరాబాద్, నవంబర్ 14 (భారత శక్తి): ఆధునిక, స్థిరమైన, ఆవిష్కరణలకు ప్రాధాన్యత నిచ్చే ఫుడ్ ఎకోసిస్టమ్‌ను నిర్మించడానికి తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్పష్టం చేశారు. దక్షిణ భారతదేశంలో ప్రముఖ ఆహారపానీయ (ఫుడ్ అండ్ బేవరేజ్) ట్రేడ్ ఫెయిర్‌గా గుర్తింపు పొందిన ఫుడ్ ఎ ఫేర్2025 నగరంలోని హైటెక్స్‌లో ఏర్పాటు చేశారు. ఈ ఫెయిర్‌ను మంత్రి శ్రీధర్‌బాబు శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. ఈ రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఫుడ్ ప్రాసెసింగ్, పారిశ్రామిక వేత్తల అభివృద్ధి, టెక్నాలజీ అనుసరణ, మార్కెట్ అభివృద్ధి వంటి కీలక రంగాల్లో దృష్టి సారించడం ద్వారా ఆహార వ్యవసాయ ఆధారిత పరిశ్రమలకు రాష్ట్రాన్ని ప్రధాన కేంద్రంగా నిలపడమే



తమ లక్ష్యంగా పేర్కొన్నారు. హైదరాబాద్‌ను మరింత ముందుకు తీసుకెళ్లే ముఖ్యమైన అడుగుగా ఈ ఫుడ్ ఎ ఫెయిర్ నిలుస్తోందన్నారు. రిటైలర్లు, హోల్ సెల్లర్లు, తయారీదారులు, ఫుడ్ ప్రాసెసర్లు, టెక్నాలజీ ఇన్నోవేటర్లు, షెఫ్స్, వంట నిపుణులు, స్టార్టప్‌లు, కొనుగోలుదారులు అంతా ఒకే వేదికపైకి రావడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమం నిర్వాహకులు మాట్లాడుతూ.. ఈ ఏడాది ఎడిషన్‌లో ప్రత్యేక ఆకర్షణగా ఫుడ్ ఎ ఫెయిర్ కలినరీ కార్నర్‌ను మొదటిసారి ప్రవేశపెట్టామని చెప్పారు.

# అంతంలేని ప్రభుత్వ పెన్షనర్ల వ్యథలు..

- జీవితపు చివరి అంకంలో సైతం తప్పని కష్టాలు..
- ప్రభుత్వ నిర్లక్ష్యంతో ఛిద్రం అవుతున్న జీవితాలు..
- పదవీ విరమణ చేసి ఏళ్ళు గడుస్తున్నా అందని పెన్షన్ ఇతరాలు..
- కాళ్లరిగేలా ఆఫీసుల చుట్టూ తిరిగి అలసిపోతున్నామని వాపోతున్న వయోవృద్ధులు..
- సర్వీస్ లో ఉన్నంత కాలం ప్రభుత్వానికి, ప్రజలకు విశిష్ట సేవలు..
- శేష జీవితాన్ని సుఖంగా గడపాల్సిన వారికి ప్రభుత్వం నుంచి ఎదురుగాలి..
- పెన్షనర్లను ఆదుకోవడంలో విఫలం అవుతున్న అధికారులు..
- దాదాపు 30 ఏళ్ళు సేవచేసి, వారు అనుభవిస్తున్న జీవితం దుర్భరం..
- పెన్షనర్ల జీవితాలపై " ఫోరం ఫర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థ " అందిస్తున్న ప్రత్యేక కథనం..

*(స్పెషల్ కరస్పాండెంట్) :*
*హైదరాబాద్, నవంబర్ 14 ( భారత శక్తి ) :*

నేడు పెన్షనర్ల పరిస్థితి అగమ్యగోచరంగా ఉంది.. దేశవ్యాప్తంగా లక్షలాది పెన్షనర్లు బతుకు బండిని లాగుతున్నారు. కొందరికి పెన్షన్ వస్తున్నా, అది చాలు అనడం కష్టం...

*** పెరిగిన ద్రవ్యోల్బణం.. తగ్గిన పెన్షన్ విలువ :**

ఒకప్పుడు సరిపడిన నెలపింఛను, ఇప్పుడు అరకొరగా మారింది. మందులు, కూరగాయలు, ప్రయాణం.. అన్నీ రెట్టింపు అయ్యాయి....

కాని పెన్షన్ మాత్రం ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది..

*** రిటైర్డ్ అయిన వారికి ఆరోగ్య సమస్యలు :**

వయసు పెరిగిన కొద్దీ డాక్టర్ దగ్గరికి వెళ్లడం



పెరిగిపోతుంది. పోనీ ప్రభుత్వ దవాఖానల్లో చూపించుకుందామంటే విపరీతమైన రద్దీ.. అదీ కాకుండా సౌకర్యాల లోపం సమస్యగా మారింది.. ప్రైవేట్ లో చికిత్సకైతే పెద్ద మొత్తాలు అవసరం అవుతాయి..

*** పెన్షన్ ఆలస్యం :**

బ్యాంక్ లింక్, ఆధార్ సమస్య, జీవన ధృవీకరణలో ఫింగర్ ప్రింట్ పనిచేయకపోవడం...ఇలా చిన్న చిన్న సమస్యలు పెన్షన్ రావడంలో నెలలు ఆలస్యం చేస్తాయి. దాంతో అవసరాలకోసం అధిక మొత్తంలో వడ్డీ చెల్లించి డబ్బులు అప్పు చేయవలసి వస్తుంది.. ఈ అప్పు భవిష్యత్తులో వారికి గుదిబండగా మారుతుంది..

*** ఒంటరితనం :**

కొంతమందికి కుటుంబం దూరం అవుతుంది.. పిల్లలు నగరాల్లో, విదేశాల్లో వుంటారు.. మనసుకు తోడు లేక కుంగిపోతున్నారు. పైగా విపరీతమైన ఆర్థిక ఇబ్బందులు..

*** ప్రభుత్వ తీరుతెన్నులు :**

ప్రభుత్వాలు పెన్షనర్ల కోసం పథకాలు ప్రకటిస్తాయి.....కానీ సి పనిచేసే విధానం మాత్రం క్షమించరానిదానిగా ఉండిపోతోంది..

పథకాలు ఎన్నో ఉన్నా అమలు బలహీనంగా ఉంటోంది..

డిజిటల్ విధానాలు తీసుకొచ్చినా, గ్రామాల్లో ఇంకా గుర్తింపు సమస్యలు ఎదురవుతున్నాయి.. జీవన ధృవీకరణ కోసం పెద్దవారు క్యూల్లో నిలబడే పరిస్థితి ఏర్పడింది.. అధికారులు సరిగా స్పందించకపోవడం జరుగుతోంది.. పెన్షన్ రివిజన్ చాలా తక్కువగా ఉంటోంది..

ద్రవ్యోల్బణం వేగంగా పెరుగుతుంది. కాని పెన్షన్ రివిజన్ మాత్రం సంవత్సరాలకొకసారి మాత్రమే పెరుగుతుంది.. అదికూడా చాలా తక్కువ శాతంలో ఉంటుంది...

*** ఆరోగ్య భద్రతలో ఎన్నో లోపాలు :**

సీనియర్ సిటిజన్స్‌కి ప్రత్యేక హెల్త్ స్కీమ్ ఉన్నా, ఔషధాలు, పరీక్షలలో 50శాతం వరకూ సబ్సిడీ రావడం లేదు.

*** తీసుకోవాల్సిన చర్యలు :**

ఇకనైనా ప్రభుత్వం, కుటుంబం, సమాజం అన్నీ కలిసి పెద్దవారికి భరోసా ఇవ్వాలి.. ప్రభుత్వం చేయాల్సినవి చాలా ఉన్నాయి..

ద్రవ్యోల్బణానికి అనుగుణంగా పెన్షన్ రివిజన్ చేయాలి.. ప్రతి సంవత్సరం ఆటోమేటిక్ గా పెంపు జరగాలి.. డిజిటల్ వ్యవస్థలో మార్పులు రావాల్సిన వసరం ఎంతైనా ఉంది.. జీవన ధృవీకరణ మొబైల్/ఓటీపీ ఆధారంగా కూడా ఉండాలి. బయోమెట్రిక్ అన్‌లాక్ సెంటర్లు గ్రామాల్లో ఏర్పాటు చేయాలి. ప్రత్యేక హెల్త్ కార్డు అందించాలి.. తక్కువ ధరలో మందులు, ఉచిత ప్రాథమిక పరీక్షలు, ప్రభుత్వ దవాఖానల్లో ఫాస్ట్ ట్రాక్ సేవలు అమలు చేయాలి..

పెన్షనర్ల కోసం గ్రీవెన్స్ సిస్టమ్ ఏర్పాటు చేసి ఏ సమస్యైనా 7 రోజుల్లో పరిష్కారం అయ్యేలా ప్రత్యేక మండలిని నియమించాలి.. ఇక సామాజిక భద్రత కార్యక్రమాలు నిర్వహించాలి.. పెద్దవారి కోసం యాక్టివిటీ సెంటర్స్, కలిసే చోట్ల ఏర్పాట్లు జరగాలి...

*** పెన్షనర్లు పాటించాల్సిన జాగ్రత్తలు :**

డాక్యుమెంట్లు అప్‌డేట్ ఉంచుకోవాలి.. లైఫ్ సర్టిఫికేట్ సమయానికి ఇవ్వాలి.. ఆరోగ్య బీమా తప్పనిసరిగా తీసుకోవాలి.. ప్రభుత్వ సబ్సిడీలు, వృద్ధాప్య సేవా పథకాలు చెక్ చేసుకోవాలి.. ఆర్థిక మోసాల నుంచి జాగ్రత్తగా ఉండాలి..

*** ఇక సమాజం పాత్ర :**

సర్వస్వం ఇచ్చి పెంచిన తల్లిదండ్రులు, వృద్ధులు ఇప్పుడు మన సహాయం కోరుతున్నారు. వారిని ఒంటరిగా వదలకూడదు..

మృదువుగా మాట్లాడుతూ వారి మనసు తెలుసుకోవాలి.. అవసరమైనప్పుడు ఆర్థికంగా, భావోద్వేగంగా తోడు నిలవాలి

ఇక చివరగా.. పెన్షనర్ల బాధ అనేది కేవలం వారి బాధ కాదు.. అది ఒక సమాజం ఎంత అభివృద్ధి చెందిందనే విషయాన్ని ధృవీకరిస్తుంది.. వారు సుఖంగా, భద్రంగా, గౌరవంగా జీవించే అవకాశం కల్పించటం అవసరం.. ప్రభుత్వం, పిల్లలు, సమాజం వీళ్లందరి బాధ్యతగా భావించాలి.. .పెన్షనర్ అంటే సాయం కోరే వృద్ధుడు మాత్రమే కాదు.. ఒకప్పుడు మన కోసం, ఈ దేశం కోసం పనిచేసిన యోధుడు అని గుర్తించండి.. వారికి సౌకర్యాలు, భద్రత, గౌరవం ఇవ్వడం మన ధర్మం.






## బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే గెలుపు.. పార్టీ శ్రేణుల సంబరాలు

**బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే భారీ మోజార్టీతో విజయం సాధించింది. ఈ సందర్భంగా తెలుగు రాష్ట్రాల్లో భాజపా శ్రేణులు గెలుపు సంబరాలు చేసుకున్నారు. బాణా సంచా కాల్చి, మిఠాయిలు పంపిణీ చేస్తూ ఆ పార్టీ నేతలంతా సందడి చేశారు. ఆ చిత్రాలు.**









## కావాలనే వేధింపుల ఫిర్యాదు.. రాజీకి యత్నం

- **చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో మహిళ ఫిర్యాదు**
- **అనేక అనుమానాలు ఉండడంతో కేసు దర్యాప్తు**
- **బాధితురాలికి న్యాయం చేయాలని వీహెచ్ పీ నాయకుల ర్యాలీ-**
- **నిందితుడి భార్య ఫిర్యాదుపై అభ్యంతరం**

ఎల్బీనగర్, నవంబర్ 14 (భారత శక్తి): తనను ఒకరు వేధింపులకు గురి చేస్తున్నారని...అశ్లీల చిత్రాలు పంపిస్తున్నారని ఆరోపిస్తూ...ఒక మహిళ పోలీసులకు ఫిర్యాదు చేసింది.అయితే, ఆ కేసు దర్యాప్తులో ఉండగానే తనను మళ్లీ వేధిస్తున్నాడని, డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదులపై అనేక అనుమానాలు ఉండడంతో పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. ఇంతలో మహిళకు న్యాయం చేయాలని వీహెచ్పీ, భజరంగ్ దళ్ నాయకులు గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ ఘటన సరూర్ నగర్, చైతన్యపురి, ఎల్బీనగర్ పోలీసులను ఉరుకులు పరుగులు పెట్టించింది. వివరాల్లోకి వెళ్తే...కొత్తపేట డివిజన్ మార్గదర్శి కాలనీలో ఉన్న విజయలక్ష్మి అనెక్స్ అపార్ట్మెంట్ లో యలమంచిలి హిమబిందు (41) ఉంటుంది. అయితే, అదే అపార్ట్మెంట్ లో ఉంటున్న నాగిరెడ్డి నాగసుబ్బారెడ్డి (37) తనను వేధిస్తున్నాడని, అశ్లీల చిత్రాలు పంపిస్తున్నాడని ఈ నెల 4వ తేదీ సాయంత్రం చైతన్యపురి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, 5వ తేదీన సుబ్బారెడ్డిని పోలీస్ స్టేషన్ కు తీసుకువచ్చి విచారించారు. కాగా, సుబ్బారెడ్డి కేసు ఉపసంహరించుకోవాలని, తిరిగి అశ్లీల ఫొటోలు పంపకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలని బెదిరిస్తున్నట్లు 12వ తేదీన హిమబిందు మళ్లీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. మొదటి ఫిర్యాదు కేసు దర్యాప్తులో భాగంగా అశ్లీల చిత్రాలు పంపిస్తున్నారని ఇచ్చిన ఫోన్ నెంబర్ సుబ్బారెడ్డి పేరుతో ఉండగా... ఆ ఫోన్ నెంబర్ ఫిర్యాదురాలు వినియోగిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. దీంతో ఫిర్యాదు ఆరోపణలపై సాంకేతిక ఆధారాలను సేకరించాల్సి ఉండడంతో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. .ఈ నైపధ్యంలో నిందితుడి భార్య హిమబిందు కావాలనే వేధింపుల ఫిర్యాదు చేసిందని సన్నిహితులుగా ఉండి డబ్బుల కోసమే బ్లాక్ మెయిల్ చేయాలనీ విరోధం పెంచుకున్నదని విమర్శించారు. కాగా, కొందరు నాయకులు కేసును రాజీ చేయడానికి ప్రయత్నిస్తున్నారు. బాధితురాలికి న్యాయం చేయాలని వీహెచ్ పీ నాయకుల ఆందోళన. బాధితురాలు వీహెచ్పి సభ్యురాలు కావడంతో విషయం తెలుసుకున్న వీహెచ్ పీ నాయకులు గురువారం చైతన్యపురిలో ర్యాలీ నిర్వహించారు. హిందూ మహిళల రక్షణ విషయంలో పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, దీనిపై దర్యాప్తు చేయాలని వీహెచ్పీ జాతీయ కార్యవర్గ సభ్యుడు డాక్టర్ రావినూతల శశిధర్,జిల్లా అధ్యక్షుడు తూము పురుషోత్తం రెడ్డి, జిల్లా కార్యదర్శి పులిమద్ది సుధాకర్, భజరంగ్ దళ్, దుర్గావాహిని, మాతృశక్తి, విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు డిమాండ్ చేశారు.

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.